13-11Pg1fB.qxd:13-11Pg1fB.qxd 01/01/01 9:58 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

16, 17న మహారాష్ట్రలో పవన్ ఎన్నికల ప్రచారం

గ్రూప్-2 మెయిన్స్ ఫిబ్రవరికి వాయిదా

2లో

ఒంగోలు, fb.com/vaartha

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,Srikakulam

13-11-2024 బుధవారం సంపుటి: 30 సంచిక: 285 పేజీలు: 12 వెల: 6.50

## ఆరు గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టులకు శ్రీకారం

### -మంత్రి జనార్ధన్ రెడ్డి వెల్లడి



మంగళవారం సచివాలయంలో వివరాలు వెల్లడిస్తున్న మంత్రి జనార్ధన్ రెడ్డి

**సచివాలయం, నవంబరు 12,ప్రభాతవార్త :** రాష్ట్రంలో 6గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుల ఫిజిబులిటి స్టడి కోసం రూ.2.27కోట్ల నిధులు విడుదల చేయనున్నామని మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. కుప్పం.శ్రీకాకుళం, నాగార్జునసాగర్, తుని-అన్నవరం, తాడేపల్లిగూడెం, ఒంగోలులో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టుల అభివృద్ధికి ప్రతిపాదనలు చేసేమన్నారు. ఎయిర్ పోర్టు అధార్టి ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 9అంశాలపై అధ్యాయనం చేశామన్నారు. ఏపిలో అదనంగా మరో 6గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టుల అభివృద్ధిలో భాగంగా..ఆ యా ప్రాజెక్ట్ల సాధ్యాసాధ్యాల అధ్యయనం కోసం రూ.2.27కోట్ల నిధులు విడుదల చేయనున్నట్లు రాష్ట్ర రోడ్ల భవనాలు,పెట్టుబడులు,మౌలిక సదుపాయాల శాఖమంత్రి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఎయిర్ పోర్టు అధార్టి ఆఫ్ ఇండియా ప్రతిపాదిత ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి తగిన భూమి గుర్తించి నివేదికలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాని కోరడం జరిగింది. దీనికి సంబంధించి కుప్పంలో 1501ఎకరాలు, నాగార్జునసాగర్ 1670 ఎకరాలు, తాడేపల్లిగూడెం 1123ఎకరాలు,శ్రీకాకుళం 1383 ఎకరాలు, తుని అన్నవరం 787ఎకరాలు,ఒంగోలు 657ఎకరాలు ఎయిర్‌పోర్టు అభివృద్ధికి తగిన భూమి అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రభుత్వానికి నివేదికను అందించడం జరిగిందన్నారు.మొత్తంగా ఈ 6ఎయిర్‌పోర్టులకు కలపి దాదాపుగా రూ.2.27కోట్లు వ్యయం అవుతుందన్నారు.ముఖ్యమంత్రి సూచనల మేరకు మొత్తంగా రూ.2.27కోట్లతో ఈ 6ఎయిర్ పోర్టుల అభివృద్ధికై సాధ్యాసాధ్యాల అధ్య >>2

# తిరుగులేని శక్తిగా ఎపి

## పర్యాటక, పారిశ్రామిక రంగాల్లో ముందంజ

### విశాఖలో కొత్తగా ఐటి అభివృద్ధి సెంటర్ ఏర్పాటుకు టాటా కంపెనీల అంగీకారం

### కొత్త ఆవిష్కరణలకు వేదికగా ఉంటాం: సిఎం చంద్రబాబు



సిఎం చంద్రబాబు నాయుడుతో టాటా కంపెనీల ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ చంద్రశేఖరన్ భేటీ దృశ్యం

**విజయవాడ,నవంబరు12,ప్రభాతవార్తప్రతినిధి:** టూరిజం, ఇండస్ట్రీరంగాల్లో ఏపీని తిరుగులేని శక్తిగా ఆవిష్కరింపచేస్తామని సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఇందుకు వివిధ రంగాల నుండి ప్రభుత్వానికి సహకారం లభిస్తోందన్నారు. పర్యాటకం, పారిశ్రామికాభివృద్ధికి అండగా ఉండేందుకు రాష్ట్రంలో మరో తాజ్, వివాంతా, గేట్ వే, సెలెక్టియన్స్, జింజర్ లాంటి 20 హోటల్స్ ఏర్పాటుకు టాటా సంస్థలకు చెందిన ఇండియన్ హోటల్స్ ముందుకు వచ్చింది.
విశాఖలో కొత్తగా ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామని టాటా కంపెనీల ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ చంద్రశేఖరన్ తెలిపినట్లు సిఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో టాటా గ్రూపు ఒక ముఖ్య వాటాదారుగా కొనసాగతుందన్నారు. ఎపి అభివృద్ధికోసం నిర్మాణాత్మక బ్లూప్రింట్‌ను రూపొందించడానికి పారిశ్రామికవేత్తలు చేతులు కలిపారని మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాలు, చిన్న పరిశ్రమల ఏర్పాటు, నైపుణ్యాభివృద్ధి, తయారీపై కేంద్రీకృత చర్చలు 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ సామర్థ్యాన్ని >>2

## బయోగ్యాస్‌పై రిలయెన్స్‌తోనూ ఒప్పందం

**విజయవాడ,నవంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** పెట్టుబడుల సాధనలో ఎపి జోరు మీద ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన పారిశ్రామిక పాలసీలు సత్ఫలితాలను ఇస్తున్నాయని సిఎం అభిప్రాయ పడ్డారు. ఎపిలో రూ.65 వేల కోట్లతో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఒప్పందం చేసుకుంది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ ఎంవోయూ జరిగింది. ఈ ఒప్పందం ద్వారా 500 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ద్వారా >>2

# సభలో పద్ధతులు తెలుసుకోండి

## తొలిసారి ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేసిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,నవంబరు12,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజా సమస్యల పట్ల శాసనసభ్యులు,ఇతర ప్రజా ప్రతినిధులు నిరంతం దృష్టి పెట్టి ఉంచాలని సిఎం చంద్రబాబు నాయుడుఅన్నారు. వారు నిరంతరం ప్రతి అంశాన్ని నేర్చుకుంటూనే ఉండాలన్నాకు.రాష్ట్రంతో పాటు కేంద్ర ఆర్థిక ప్రణాళికలో నిధుల కేటాయింపులపై అధ్యయనం చేయాలన్నారు.పనిచేయాలనే ఆసక్తిఉంటే ఏదైనా సాధ్యమవుతుందన్నారు.అసెంబ్లీలో స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అధ్యక్షతన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వర్క్ షాప్ నిర్వహించారు.అసెంబ్లీ సమావేశాలు, బడ్జెట్ వంటి అవకాశాలపై వర్క్ షాప్‌లో శిక్షణ ఇచ్చారు. బడ్జెట్ సమావేశాలపై ఎమ్మెల్యేలకు అవగాహన ఉండాలి...మీకు వచ్చే మంచి ఆలోచనలు సభలో పంచుకోండి. ప్రభుత్వం తెచ్చే బిల్లులు, పాలసీలపై ప్రతి ఎమ్మెల్యే అధ్యయనం చేయాలి. పబ్లిక్ గవర్నెన్స్‌లో ఎమ్మెల్యేలనూ భాగస్వామలను చేస్తాం. ప్రజలు మనపై అనేక ఆశలు పెట్టుకున్నారు...నమ్మకం పెట్టుకున్నారు. ప్రజల నమ్మకం మేరకు వారి సమస్యలపై సభలో చర్చించాలి.
అర్థవంతమైన చర్చలకు సభ వేదిక కావాలి అన్నారు. నేను 1978లో మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచాను...1980లో మంత్రి అయ్యాను. ఇప్పటికి 9 సార్లు ఎమ్మెల్యేగా గెలిచాను...4సార్లు సిఎంఅయ్యాను.వరుసగా విజయం సాధించడం అనేది మన పనితనం, పార్టీ నిర్మాణాన్ని బట్టి ఉంటుంది. మొన్నటి ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కలిసి పోటీ చేశాయి. చాలామంది >>2

## డిప్యూటీ స్పీకర్‌గా రఘురామ కృష్ణరాజు



**విజయవాడ,నవంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ శాసనసభ ఉపసభాపతిగా ఉండి టిడిపి రఘురామ కృష్ణరాజు పేరును సిఎం చంద్రబాబు ఖరారు చేశారు. శాసనసభలో ఎన్డీఏ పక్ష ఎంఎల్ఎల సమావేశంలో రఘురామరాజును డిప్యూటీ స్పీకరుగా నియమించాలనే ప్రస్తావన రాగానే మొత్తం శాసనసభా పక్షం సభ్యులు అందుకు స్పందన కరతాళ >>2

## అసెంబ్లీ చీఫ్ విప్‌గా జిఆర్ ఆంజనేయులు

### మండలి చీఫ్‌గా పంచుమర్తి అనురాధ

### అసెంబ్లీలో ఒక చీఫ్ విప్,15మంది విప్‌లు

### మండలిలో ఒక చీఫ్, ముగ్గురు విప్‌లు



అసెంబ్లీ చీఫ్ విప్ జిఆర్ ఆంజనేయులు

**విజయవాడ,నవంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** శాసనసభ, శాసన మండలి చీఫ్ విప్, విప్‌లు ఎన్డీఎప్రభుత్వం ఖరారు చేసింది.మొత్తం రాష్ట్ర అసెంబ్లీలో ఒక చీఫ్ విప్, 15మంది విప్‌లు ఖరారు చేసారు. అసెంబ్లీ చీఫ్‌విప్‌గా జీవీ ఆంజనేయులు, విప్‌లుగా టిడిపినుంచి బెందాళం అశోక్, బోండా ఉమామహేశ్వరరావు, దాట్ల సుబ్బరాజు, యన >>2





మంగళవారం సిఎం చంద్రబాబుతో భేటీ అయిన రిలయన్స్ ప్రతినిధులు

# రిలయెన్స్‌తోనూ ఒప్పందం

>> రాష్ట్రానికి రూ.57,650 కోట్ల ఆదాయంతో పాటు 2.5 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...నేటి ఒప్పందం గొప్ప ముందడుగు అన్నారు. పెట్టుబడులకు రాష్ట్రంలో అనుకూల పరిస్థితులు ఉన్నాయని..స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కు ఎపి కేంద్రంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఇలాంటి భారీ ప్రాజెక్టులకు ఎస్కార్ట్ ఆఫీసర్లుగా ఐఎఎస్ అధికారులను నియమించి.. ఎటువంటి ఇబ్బందులు లేకుండా వేగంగా ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సిఎం అన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ నేడు ఇంధన శాఖతో చేసుకున్న ఈ ఒప్పందాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు ట్రాన్స్ కో జెయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కీర్తిని ఎస్కార్ట్ ఆఫీసర్ గా నియమిస్తున్నామని సీఎం తెలిపారు. రిలయన్స్ తో ఒప్పందం సంతోషకరమని....500 సిబిజి ప్లాంట్స్ మూడేళ్లలో ఏర్పాటు అవుతాయని అన్నారు. ఒక్కో ప్లాంట్ రూ.130 కోట్లతో రూ.65 వేల కోట్ల పెట్టుబడులు.. 2.5 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని సిఎం తెలిపారు. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు...పర్యావరణానికి మేలు జరుగుతుందని సీఎం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున సాలిడ్ వేస్ట్‌ను ప్లాంట్స్‌కు ఇస్తామని...వాటి ద్వారా కూడా గ్యాస్ ఉత్పత్తి చేయాలని సిఎం సూచించారు. మున్సిపల్ సాలిడ్ వేస్ట్ ద్వారా కూడా ఉత్పత్తి సాధ్యం అయ్యేలా ప్లాంట్ల నిర్మాణం చేపడతామని రిలయన్స్ ప్రతినిధులు తెలిపారు.

క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 తెచ్చాం. దీని ద్వారా రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు సాధించాలి అని లక్ష్యంగా పెట్టుకున్నామని, క్లీన్ ఎనర్జీపై యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నామని సిఎం అన్నారు. క్లీన్ ఎనర్జీ పాలసీ మంచి ఫలితాలు తెస్తుందని, సోలార్, విండ్‌తో పాటు పంప్డ్ ఎనర్జీ కోసం వెళుతున్నాం అని సిఎం అన్నారు. ఒక కుటుంబం, ఒక పారిశ్రామిక వేత్త అనేది మా నినాదమని, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా కొత్త ఆవిష్కరణలు తీసుకువస్తామని తెలిపారు. రిలయన్స్ లాంటి సంస్థలు దీనికి సహకరించాలని కోరారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనకు మంత్రి లోకేష్ సబ్ క్యాబినెట్ ఛైర్మన్ గా ఉన్నారని...ఆ బాధ్యతను నెరవేర్చే క్రమంలో నేటి ఒప్పందం కీలక ముందడుగు అన్నారు. మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, టీజీ భరత్ లు వేగంగా నిర్ణయాలు తీసుకుని ప్రాజెక్టు ఒప్పందం జరగడానికి దోహద పడ్డారని ముఖ్యమంత్రి ప్రశంసించారు.

**20 లక్షల ఉద్యోగాల కల్పనలో కీలక అడుగు: నారా లోకేష్..**

రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థతో జరిగిన నేటి ఒప్పందం 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ఇది ముందడుగని మంత్రి నారా లోకేష్ అన్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటైన మంత్రుల సబ్ కమిటీకి ఛైర్మన్‌గా ఉన్న మంత్రి లోకేష్ మాట్లాడుతూ.....తమ లక్ష్య సాధనలో 2.5 లక్షల ఉద్యోగాలు ఈ ఒప్పందం ద్వారా వస్తాయని చెప్పారు. కొద్ది రోజుల ముందు ముఖేష్ అంబానీ, అనంత్ అంబానీలతో జరిగిన చర్చల్లో వచ్చిన ప్రతిపాదనపై నేడు ప్రభుత్వం ఒప్పందంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మొత్తం 2 వేల ప్లాంట్లు దేశ వ్యాప్తంగా పెట్టాలని రిలయన్స్ లక్ష్యంగా పెట్టుకోగా అందులో 500 ప్లాంట్లు ఎపిలో పెట్టడం శుభపరిణామం అన్నారు. ఒప్పందం మేరకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని...సాధ్యమైనంత వేగంగా ప్రాజెక్టను ముందుకు తీసుకువెళ్లాలని లోకేష్ కోరారు. ఈ క్రమంలో ఏ అవసరం వచ్చినా తాను వెంటనే స్పందిస్తానని....ఏ సమస్య వచ్చినా వాట్సాప్ మేసేజ్ ఇస్తే చాలని రిలయన్స్ ప్రతినిధులకు సూచించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రిలయన్స్ 8 జిల్లాల్లో ప్లాంట్లు పెడుతుందని తెలిపారు. మొదటి ప్లాంట్ ప్రకాశం జిల్లా కనిగిరిలో పెడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సమక్షంలో జరిగిన ఈ ఒప్పంద కార్యక్రమంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ముంబై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బోర్డు సభ్యుడు పి.ఎం.ఎస్. ప్రసాద్, రిలయన్స్ బయోఎనర్జీ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బషీర్ షిరాజీ తో పాటు ఆ సంస్థ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# తిరుగులేని శక్తిగా ఎపి

>> అన్‌లాక్ చేయడంలో మార్గనిర్దేశం చేస్తాయని అభిప్రాయపడ్డారు. "ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త" అని ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పారిశ్రామికవేత్తలకు మార్గనిర్దేశం చేస్తుందన్నారు. అట్టడుగు వర్గాల సాధికారతను విశ్వసించిన రతన్ టాటాకు అశ్రునివాళి అర్పిస్తున్నామన్నారు

రాష్ట్రంలో టాటాపవర్ రూ.40 వేల కోట్ల పెట్టుబడి

టాటా గ్రూప్ ఛైర్మన్‌తో సిఎం భేటీ అయ్యామన్నారు, 2014-19 మధ్య 13.5 వృద్ధి రేటు సాధించామని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. ప్రస్తుతం 15 సాధిస్తామన్న విశ్వాసం ఉందని సిఎం చంద్రబాబు వివరించారు. స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ 2047పై కూటమి ప్రభుత్వంకు ఉన్నా ఆలోచనలు, పాలసీలకు సంబంధించి తన అభిప్రాయాలను చంద్రబాబు పారిశ్రామికవేత్తలతో పంచుకున్నారు. సాంకేతిక పురోభివృద్ధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువతకు అవకాశాలు కల్పిస్తే తిరుగులేని ఫలితాలు వస్తాయన్నారు. రాష్ట్రంలో సహజ వనరులు, మానవ వనరులు, మౌలిక సదుపాయాలు జాతీయ రహదారులు, విమానాశ్రయాలు ఉన్నాయని గుర్తు చేశారు.

**ఇకపై స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ :**

కొత్త ఆవిష్కరణలకు,కొత్త ఆలోచనలకు వేదికగా ఉంటామని సిఎం చంద్రబాబు తెలిపారు. గతంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి చెప్పామని,ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి మాట్లాడుతుమన్నారు. నాడు ప్రతి ఇంటి నుంచి ఐటీ ఉద్యోగి ఉండాలన్న లక్ష్యంతో పనిచేశామని నేడు ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములు, నీళ్లు, మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వాటికి తోడు ఉత్యత్తమ పాలసీలను ప్రకటించామని తెలిపారు. పారిశ్రామిక రంగంలో వాటి ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించాలన్నదే తమ లక్ష్యమని సిఎం స్పష్టం చేశారు. ఇక రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నందున సంతోషంగా ఉందంటూ లోకేశ్ ఎక్స్ వేదికగా తన ఆనందాన్ని పంచుకున్నారు.స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్2047పై ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీ తొలి భేటీలో జరిగిందన్నారు.ఇందులో భవిష్యత్తులో 15 శాతం వృద్ధిరేటు లక్ష్యంగా ప్రణాళికలను అమలు చేయనున్నట్లు తెలిపారు. ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త అనే నినాదం తీసుకున్నామని స్పష్టం చేసారు. విశాఖలో కొత్తగా ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు టిసిఎస్ కట్టుబడి ఉందన్న ఆయన 10 వేల మందికి ఉపాధి కల్పిస్తామని చంద్రశేఖరన్ చెప్పినట్లు తెలిపారు. టాటా పవర్ 5 వేల మెగావాట్ల సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా 40 వేల కోట్లు పెట్టుబడులు పెడుతోందన్నారు. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కోసం డీప్ టెక్, కృత్రిమ మేధ వినియోగించి పరిష్కారాలను కనుగొనే విషయంలో సహకారంపై చర్చ జరిగినట్లు వెల్లడించారు.

# ఎయిర్‌పోర్టులకు శ్రీకారం

>> యనం చేయడానికి నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు.ఈ నివేదికల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుల అభివృద్ధికి ఒక నిర్ణయానికి రానుంది.మరోవైపు ఇప్పటికే నెల్లూరు ఎయిర్‌పోర్టుకు సంబంధించి,ఎయిర్ పోర్టు అథార్టి ఆఫ్ ఇండియా తగిన భూమి కోసం అధ్యాయనం చేయడం, కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వడం జరిగింది.మొత్తంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనలో కీలకమైన 7గ్రీన్ ఫిల్డ్ ఎయిర్ పోర్టుల నిర్మించాలన్న కల అతి త్వరలో సాకారం కావడం పట్ల మంత్రి ఆనందం వ్యక్తం చేశారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

## సముద్రంలో వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు హెచ్చరిక

**విజయవాడ,నవంబరు12,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాల్లో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కాస్తా అల్పపీడనంగా మారడంతో పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని చెప్పారు. పశ్చిమ గోదావరి, గుంటూరు, ఎన్టీఆర్, వైఎస్సార్, ఏలూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, కృష్ణ, నంద్యాల, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అలర్ట్ జారీ చేశారు.

మూడు రోజుల పాటు ఈ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందన్నారు. అలాగే, కర్నూలు, సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో పలుచోట్ల తేలికపాటి వర్షాలు పడతాయని వివరించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉందని, చేపల వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు సూచించారు. చెరువులు, నదులు, రిజర్వాయర్ల చుట్టుపక్కల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.



శాసనసభ్యుల శిక్షణా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

# సభలో పద్ధతులు తెలుసుకోండి

>> కొత్త వ్యక్తులు ఎమ్మెల్యేలుగా వచ్చారు. రెండో సారి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారు 30 మంది టిడిపి నుంచి ఉన్నారు. ఒకప్పుడు అసెంబ్లీ ప్రొసెడింగ్స్ ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్‌లో వచ్చేవి. కానీ ఇప్పుడు లైవ్, సోషల్ మీడియాలో కూడా ప్రసారం అయ్యే దాకా టెక్నాలజీ వచ్చింది. ఎమ్మెల్యేలుగా గెలిచిన వాళ్లం సభలో పబ్లిక్ పాలసీలు రూపొందిస్తాం. ఈ పాలసీలు ప్రజా జీవితంలో మార్పులు తెస్తాయి. మనం తెచ్చే పాలసీలే రాష్ట్రంలోని సమస్యలకు శాశ్వత పరిష్కారాలను చూపిస్తాయి. గతంలో ఒక సబ్జెక్టుపై ఎంత సమయమైనా చర్చించేవాళ్లం. రానురాను ఎమ్మెల్యేలకు సబ్జెక్టు నేర్చుకోవాలనే ఆసక్తి తగ్గుతోంది. ఇది మంచిది కాదు. నిరంతరంనేర్చుకోవాలి. తెలుసుకోవాలి. మీలో ఇప్పుడు ఎవరు ఏ సబ్జెక్టు మాట్లాడుతున్నారో నేను కూడా నోట్ చేసుకుంటున్నా. సభలో ప్రతిపక్షంలేదు కదా,మనకేముందని అనుకోవద్దు,వాళ్ళకు బాధ్యత లేదు,మనం ప్రజలకు జవాబుదారీగా పనిచేద్దాం. ప్రభుత్వం తెచ్చేపాలసీలు,బిల్లులపై శాసనసభ్యులు తప్పకుండా అధ్యనం చేయాలన్నారు. ఈ శిక్షణశిబిరానికి తొలిసారి ఎంఎల్ఏలు ఎన్నికైన 84మంది, రెండోసారి ఎన్నికయి 39 మంది హాజరయ్యారు.వారికి వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు.సభలో బడ్జెట్ ప్రవేశపెట్టడం నుంచి ఆమోదించే వరకు గల ప్రక్రియపై అవగాహన కల్పించారు,స్పీకరు అయ్యన్న పాత్రుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ పూర్వపు స్పీకరు,మంత్రి నాదెండ్ల మనోహర్,ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఎంఎల్ఎలకు పలు అంశాలపై స్పష్టతను ఇచ్చారు.

# మైనర్ బాలికపై అత్యాచారం కేసులో
# ముద్దాయికి 20 యేళ్లు జైలు

**చిల్లకూరు, నవంబరు 12, ప్రభాతవార్త:** చిల్లకూరు పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 62/2021 కేసులో ముద్దాయి అయిన కావూరు మస్తానయ్య కుమారుడు మస్తాన్ బాబు( 21) భోధనం గ్రామానికి చెందిన ఇతను 2021 సంవత్సరంలో బోధనం గ్రామానికి చెందిన ఒక మైనర్ అమ్మాయిని బలవంతంగా తీసుకెళ్లి రేప్ చేశాడు. దీంతో మైనర్ బాలిక తల్లిదండ్రులు చిల్లకూరు పోలీసులకు పిర్యాదు చేశారు. దీంతో ఇతని మీద ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టుకి హాజరు పరిచారు. ఇప్పుడు ఇతని మీద నేరం రుజువు కావడంతో ఇతడికి నెల్లూరు జిల్లా కోర్టు లోని ఫోక్స్ కోర్టులో మంగళవారం 20 సంవత్సరాలు జైలు శిక్ష, 23 వేల రూపాయలు జరిమానా విధించడం జరిగిందని పోలీసులు తెలిపారు.

# గ్రూప్-2 మెయిన్స్ ఫిబ్రవరికి వాయిదా

**విజయవాడ, నవంబరు 12, ప్రభాతవార్త ప్రతినిధి:** వచ్చే యేడాది జనవరి 5న నిర్వహించబోయే గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష వాయిదా పడింది.గూప్2 మెయిన్స్ పరీక్షను వాయిదా వేయాలని పలువురు అభ్యర్థులు ఎపిపిఎస్సీకి ఇటీవల విజ్ఞప్తి చేసారు. ఈనేపథ్యంలో ఎపిపిఎస్సీ గ్రూప్2 మెయిన్స్ పరీక్షలు మరోసారి వాయిదా పడ్డాయి. వచ్చే ఏడాది జనవరి 5నజరగాల్సిన గ్రూప్2 మెయిన్స్ ఫిబ్ర వరి 23కు వాయిదా వేస్తున్నట్లు ఎపిపిఎస్సీ ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 5న నిర్వహించబోయే గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను వాయిదా వేయాలని పలువురు అభ్యర్థులు ఎపిపిఎస్సీని కోరుతున్నారు. నిరుద్యోగుల అభ్యర్థన, ఆందోళన దృష్ట్యా సానుకూల నిర్ణయం తీసుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు సైతం ఎపిపిఎస్సీకి విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల వినతి మేరకు గ్రూప్2 ప్రధాన పరీక్షను వాయిదా వేయాలని ప్రజా ప్రతినిధులు సైతం ఎపిపిఎస్సీ ఛైర్ పర్సన్ అనురాధను కలిసి వేర్వేరుగా విజ్ఞాపన పత్రాలిచ్చారు.

THE GOVERNMENT OF BODOLAND
Results of 12/11/2024
M.R.P. ₹.2/-

FUTURE SERIES Dr No:20
1st Prize Rs.100000/- 175561
2nd Prize Rs.7000/- 22017
3rd Prize Rs.3500/-
09518 12998 20763 25530 34456
49449 54302 63572 65151 86439
4th Prize Rs.200/-
0345 2171 2694 2804 3550
4465 4700 7155 7507 9617
5th Prize Rs.100/-
2408 4542 5215 5496 5938
6143 6660 7265 7937 9047
6th Prize Rs.50/-
0066 1544 3039 4483 6782 8577
0126 1610 3064 4499 6877 8670
0346 1752 3161 4626 7064 8819
0481 2030 3201 4640 7133 8880
0527 2101 3226 4975 7149 8903
0802 2156 3250 5279 7307 8984
0819 2341 3294 5494 7327 9219
0918 2395 3318 5947 7562 9248
1136 2469 3647 6131 7679 9270
1168 2480 3654 6133 7832 9319
1178 2513 3674 6276 7921 9401
1242 2600 3756 6412 8019 9447
1251 2657 3757 6462 8320 9454
1294 2679 4045 6514 8370 9523
1337 2693 4076 6526 8489 9826
1383 2753 4215 6646 8544
1446 2981 4369 6662 8565

SINGAM SERIES Dr No:20
1st Prize Rs.100000/- 491632
2nd Prize Rs.7000/- 20428
3rd Prize Rs.3500/-
03372 17028 17493 37466 44687
46955 57528 65581 93450 93901
4th Prize Rs.200/-
0494 1210 2050 2879 2956
4289 5254 6527 7381 9499
5th Prize Rs.100/-
0827 0848 1376 3789 4053
4702 4825 7794 8492 9279
6th Prize Rs.50/-
0103 2235 3772 5054 6663 8169
0246 2316 3878 5515 6958 8171
0253 2369 4241 5591 6966 8412
0404 2511 4243 5639 7091 8447
0416 2775 4244 5784 7121 8601
0477 2795 4359 5842 7143 8695
0609 2875 4420 5856 7266 8862
0668 2881 4463 5862 7293 8897
0731 3147 4524 5952 7410 9042
0831 3192 4575 6048 7456 9292
1130 3355 4618 6216 7614 9544
1134 3385 4705 6230 7737 9589
1343 3522 4808 6277 7837 9653
1453 3665 4853 6365 7857 9661
1879 3679 4868 6449 7865 9974
1973 3691 4939 6471 7999
2073 3732 4976 6602 8083

KUIL SERIES Dr No:20
1st Prize Rs.100000/- 221681
2nd Prize Rs.7000/- 25306
3rd Prize Rs.3500/-
09797 12355 33929 34422 42024
43113 73066 82906 87053 90621
4th Prize Rs.200/-
0665 1664 1841 3111 4457
4732 6258 6297 8906 9781
5th Prize Rs.100/-
0092 2112 3517 4813 8164
8240 8356 8707 9791 9852
6th Prize Rs.50/-
0051 1484 3291 5114 6182 8792
0234 1515 3353 5231 6350 8935
0277 1595 3466 5260 6461 8975
0433 1609 3510 5301 6619 8978
0532 1689 3774 5319 6876 9003
0560 1766 3810 5331 7013 9072
0566 1774 3911 5359 7067 9100
0635 1802 3926 5567 7460 9173
0954 1804 3976 5639 7534 9219
1027 1818 3984 5673 7725 9353
1072 1844 4125 5689 7737 9440
1129 1898 4554 5708 7936 9516
1229 1913 4670 5882 8147 9653
1326 1926 4929 5910 8448 9847
1333 2309 4962 6000 8558 9987
1366 2506 5034 6011 8680
1474 2760 5040 6125 8693

ROSA SERIES Dr No:20
1st Prize Rs.100000/- 469815
2nd Prize Rs.7000/- 26109
3rd Prize Rs.3500/-
07259 09689 28835 33796 46989
52616 55636 81630 85282 99851
4th Prize Rs.200/-
0082 0324 1990 2894 3428
5687 7554 7683 8566 9226
5th Prize Rs.100/-
0836 1872 2433 3361 4248
5001 5508 5736 6836 6852
6th Prize Rs.50/-
0075 2069 3911 5825 7261 8787
0127 2155 4496 5851 7306 8798
0235 2345 4504 5890 7345 8938
0365 2347 4620 5969 7378 9262
0479 2428 4796 6036 7421 9264
0650 2569 4966 6322 7435 9284
0688 2659 4987 6342 7643 9334
0781 2685 5067 6400 7971 9385
0966 3267 5156 6456 7991 9539
1000 3299 5267 6480 7999 9572
1015 3315 5308 6540 8049 9582
1213 3399 5402 6688 8094 9801
1635 3400 5455 6785 8457 9915
1645 3404 5484 6984 8469 9971
1772 3534 5520 7006 8491 9984
1942 3678 5689 7068 8574
2034 3901 5733 7223 8643

DEAR SERIES Dr No:20
1st Prize Rs.100000/- 982532
2nd Prize Rs.7000/- 70878
3rd Prize Rs.3500/-
11012 20348 24905 29197 39356
44464 47227 75170 84603 89390
4th Prize Rs.200/-
0171 0242 0572 0628 1245
3222 3345 5713 6097 9707
5th Prize Rs.100/-
1580 3002 3014 5746 5801
6384 7597 8883 9806 9993
6th Prize Rs.50/-
0104 2002 3902 5858 7225 8798
0129 2003 3916 5862 7275 8839
0288 2151 4382 5875 7450 8855
0603 2444 4482 5923 7532 8910
0644 3160 4527 6009 7610 8936
0665 3201 4537 6013 7732 9028
0705 3262 4561 6065 7911 9079
0777 3478 4697 6137 7982 9136
0867 3565 4784 6138 8040 9366
0909 3594 5239 6222 8141 9574
1045 3595 5384 6259 8168 9627
1291 3654 5426 6304 8169 9634
1407 3667 5475 6417 8211 9884
1618 3742 5553 6776 8228 9898
1704 3787 5599 6793 8363 9913
1855 3794 5660 7103 8443
1917 3866 5739 7115 8495

THANGAM SERIES Dr No:20
1st Prize Rs.100000/- 722688
2nd Prize Rs.7000/- 94678
3rd Prize Rs.3500/-
26225 40390 43586 53785 57734
67365 70020 78817 85661 89786
4th Prize Rs.200/-
0068 0118 1640 2554 4286
5299 6242 7130 7321 9732
5th Prize Rs.100/-
0288 1038 2088 2705 2996
3605 4267 5453 5629 5967
6th Prize Rs.50/-
0007 1605 3013 4571 6842 8516
0064 1762 3057 4778 6962 8624
0141 1890 3103 4845 7180 8797
0305 1931 3107 4883 7204 8850
0466 1955 3305 5010 7399 8864
0545 2178 3339 5150 7406 8916
0624 2275 3377 5164 7456 8960
0674 2367 3660 5274 7561 9118
0896 2398 3746 5298 7589 9170
0930 2500 3953 5495 7594 9714
0955 2561 4098 5601 7596 9767
0975 2578 4107 5603 7798 9823
1163 2633 4119 6069 7799 9853
1180 2650 4258 6098 7818 9914
1229 2711 4297 6338 7939 9921
1390 2751 4396 6599 8270
1517 2975 4443 6779 8507

THE GOVERNMENT OF BODOLAND
Results of 12/11/2024
M.R.P. ₹.2/-

ABBLE SERIES Dr No:20
1st Prize Rs.100000/- 875523
2nd Prize Rs.7000/- 28831
3rd Prize Rs.3500/-
11170 15050 22697 26481 30306
34741 65370 79507 85230 96779
4th Prize Rs.200/-
0536 0920 2981 4440 4805
5449 5509 5962 9816 9968
5th Prize Rs.100/-
0331 0562 1648 2112 2716
4546 5312 6175 7045 8809
6th Prize Rs.50/-
0255 1670 2914 4640 6727 8322
0278 1678 3034 4881 6899 8405
0436 1757 3209 4898 6904 8571
0501 1777 3249 5009 6922 8584
0519 1792 3329 5051 7010 8875
0533 1798 3500 5087 7261 8993
0540 2069 3618 5288 7383 9003
0657 2098 3633 5326 7385 9113
0865 2145 3882 5506 7450 9281
0956 2204 3885 5620 7561 9326
0964 2331 3908 5751 7615 9343
0967 2340 3975 5865 7631 9444
1035 2513 4036 5911 7759 9476
1257 2522 4040 6145 7850 9765
1269 2528 4074 6235 7944 9879
1290 2606 4305 6254 8159
1597 2862 4409 6522 8276

NALLANERAM SERIES Dr No:20
1st Prize Rs.100000/- 312123
2nd Prize Rs.7000/- 61061
3rd Prize Rs.3500/-
09248 09754 27296 28503 33330
39121 61100 76885 82823 90459
4th Prize Rs.200/-
2898 3009 3496 3539 4471
5104 5386 6028 7339 8502
5th Prize Rs.100/-
0357 2210 4065 4714 6017
7086 7261 8450 8555 8739
6th Prize Rs.50/-
0024 1358 3107 5449 7212 8564
0025 1513 3123 5659 7344 8695
0049 1566 3173 6085 7347 8753
0087 1689 3292 6224 7461 8787
0128 1739 3614 6330 7532 8858
0398 1784 3871 6331 7701 8979
0417 1977 3913 6409 7811 9073
0631 2094 4132 6429 7925 9184
0638 2363 4235 6542 8028 9249
0664 2367 4606 6546 8307 9406
0735 2445 4618 6677 8344 9469
0808 2505 4634 6790 8371 9585
0966 2618 4677 6845 8434 9590
1074 2748 4696 6864 8487 9735
1091 2814 4800 7009 8536 9996
1207 2942 5185 7059 8537
1216 2988 5300 7160 8560

KUMARAN SERIES Dr No:20
1st Prize Rs.100000/- 338664
2nd Prize Rs.7000/- 27601
3rd Prize Rs.3500/-
02167 07314 21945 33513 40536
50135 70913 80860 90033 91751
4th Prize Rs.200/-
1769 2535 3572 4869 4961
5814 6857 9208 9570 9874
5th Prize Rs.100/-
0575 0579 1696 1946 2556
4511 8489 9159 9524 9611
6th Prize Rs.50/-
0015 1623 3218 4902 6902 8617
0109 1702 3361 5008 6941 8774
0172 1805 3592 5136 6965 8786
0185 1890 3651 5182 7242 8791
0234 1998 3816 5378 7291 9004
0346 2253 3823 5515 7497 9113
0588 2278 3931 5535 7543 9172
0599 2299 3975 5685 7609 9240
0661 2359 4017 5775 7790 9241
0852 2514 4179 6151 7951 9330
0898 2527 4351 6159 8175 9514
1042 2542 4388 6160 8188 9703
1078 2547 4467 6207 8347 9717
1092 2641 4681 6228 8410 9948
1101 2680 4738 6394 8444 9997
1461 2682 4825 6442 8539
1521 2882 4865 6836 8606

VISHNU SERIES Dr No:20
1st Prize Rs.100000/- 748947
2nd Prize Rs.7000/- 38586
3rd Prize Rs.3500/-
05952 33419 36665 50668 54502
72149 76024 78074 82347 98728
4th Prize Rs.200/-
0011 1192 1292 2526 4923
5392 6410 6892 7411 7743
5th Prize Rs.100/-
0310 0448 3130 5021 5150
5824 6247 8085 8135 8512
6th Prize Rs.50/-
0060 1990 3254 5108 6319 9449
0284 2006 3932 5165 6795 9527
0354 2069 3956 5367 6802 9587
0358 2126 3970 5404 7044 9602
0727 2227 4021 5412 7260 9633
0953 2250 4080 5446 7302 9669
1008 2253 4134 5507 7896 9677
1056 2259 4145 5528 8175 9682
1128 2297 4238 5591 8182 9755
1175 2346 4478 5597 8455 9866
1215 2483 4714 5795 8489 9890
1297 2546 4720 5853 8678 9920
1317 2945 4725 5981 8806 9925
1378 2957 4809 6043 8884 9940
1523 3081 4894 6158 9023 9955
1775 3091 4906 6180 9126
1832 3224 4939 6194 9134

SWARNALAXMI SERIES Dr No:20
1st Prize Rs.100000/- 351482
2nd Prize Rs.7000/- 62728
3rd Prize Rs.3500/-
16917 27477 38370 49802 51762
62134 73637 73875 84538 95533
4th Prize Rs.200/-
0097 0660 1820 2995 3091
3984 4645 7960 9086 9760
5th Prize Rs.100/-
0220 0449 1744 4208 5070
6384 6468 7156 7346 9697
6th Prize Rs.50/-
0072 1432 2840 4589 6226 7999
0170 1541 2843 4595 6356 8009
0419 1543 2960 4673 6480 8142
0513 1687 3077 4696 6481 8312
0539 1705 3163 4744 6498 8344
0540 1857 3339 4833 6521 8429
0594 1964 3452 4940 6545 8552
0629 2122 3708 5216 6622 8767
0690 2162 3812 5270 6858 8858
0723 2330 3846 5383 6871 8886
0887 2387 3903 5565 6939 9047
0987 2449 3910 5623 7038 9315
1054 2593 3983 5644 7233 9505
1080 2685 4075 5656 7496 9522
1335 2706 4268 5847 7565 9702
1399 2742 4368 5908 7615
1400 2812 4546 6016 7889

LION SERIES Dr No:20
1st Prize Rs.100000/- 859635
2nd Prize Rs.7000/- 83800
3rd Prize Rs.3500/-
15108 15867 26306 37145 37900
48478 61456 72242 83177 94322
4th Prize Rs.200/-
0780 1542 1750 4563 4645
4730 5150 5198 6590 7894
5th Prize Rs.100/-
0968 2047 2552 5212 8117
8257 8799 9177 9556 9866
6th Prize Rs.50/-
0008 2082 3837 5641 7041 8993
0020 2156 3856 5675 7192 9022
0076 2166 3941 5719 7300 9067
0179 2178 4190 5861 7587 9090
0331 2216 4198 6018 7653 9133
0405 2273 4342 6267 7748 9169
0577 2495 4415 6344 7811 9192
0581 2526 4611 6463 7852 9374
0656 2621 4619 6495 7854 9389
0724 2765 4667 6511 7940 9419
0766 3071 4720 6614 8031 9439
0906 3182 4836 6626 8034 9463
0961 3318 4913 6630 8137 9464
1233 3465 5354 6720 8401 9676
1488 3577 5371 6867 8588 9899
1513 3673 5448 6893 8689
1911 3691 5553 6921 8735

# 16, 17న మహారాష్ట్రలో
# పవన్ ఎన్నికల ప్రచారం

**విజయవాడ,నవంబరు12,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మహారాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి వెళ్తున్నారు.ఇటీవల కేంద్ర మంత్రి అమిత్‌షా ఆదేశాలను అనుసరించి ఆ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పవన్ కల్యాణ్ పర్యటిస్తారు. ప్రచార సభల్లో పాల్గొని ప్రసంగిస్తారు. ఆంధ్రప్రదేశ్ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పవన్ కల్యాణ్‌తో పాటే ఉంటారు. బిజెపి పెద్దల ఆహ్వానం మేరకు వారు మహారాష్ట్రలో ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొంటారు.

ఆ రెండు రోజుల్లో అసెంబ్లీ సమావేశాలకు ఆ ఇద్దరు నేతలు అందుబాటులో ఉండకపోవచ్చు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి సమయం తక్కువగా ఉండడంతో పార్టీలన్నీ ప్రచార సభలతో హోరెత్తిస్తున్నాయి. ఇప్పటికే మ్యానిఫెస్టోలు విడుదల చేశాయి. ఈ ఎన్నికల ఫలితాలను ఈ నెల 23న ప్రకటిస్తారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఈ నెల 20న జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 16, 17న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఎన్డీఏ తరఫున మహారాష్ట్రలో ప్రచారంలో పాల్గొననున్నారు.

# 22వరకు అసెంబ్లీ సమావేశాలు

**విజయవాడ నవంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలు జరిగే రోజులను చర్చల సమయాన్ని మరింత పెంచాల్సిన అవసరంఉందని శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. గతంలో బడ్జెట్ సమావేశాలు కనీసం 30 రోజుల జరిగేవని స్పీకర్ అనగా బడ్జెట్, డిమాండ్లు, గ్రాంట్లపై చర్చలకే మూడు వారాలకుపైగా సమయం ఉండేది. 1995 లో ఒకరోజు సభ నిరంతరాయంగా నిర్వహించడంతో తెలవారుజామున 4 గంటలకు భోజనాలు చేశామని సమావేశాల్లో అలాంటి సీరియస్‌నెస్ ఉండాలని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. సభాపతి అయ్యన్నపాత్రుడి అధ్యక్షతన శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ఈ ఆసక్తికరచర్చ జరిగింది. సిఎం చంద్రబాబు, మంత్రి పయ్యావుల కేశవ్ జనసేన తరపున మంత్రి నాదెండ్ల మనోహర్ బిజెపి పక్షనేత విష్ణుకుమార్‌రాజు పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాలు ఎన్నిరోజులు నిర్వహించాలనే అంశంపై చర్చ సందర్భంగా స్పీకర్, ముఖ్యమంత్రి ఈ విధంగా స్పందించారు. ఈసమావేశాలను 22వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించారు.

# చీఫ్ విప్‌గా జిఆర్ ఆంజనేయులు

>> మల దివ్య, థామస్, తోయక జగదీశ్వరి, కాలవ శ్రీనివాసులు, రెడ్డప్పగారి మాధవీ రెడ్డి, పిజివిఆర్ నాయుడు (గణబాబు), తంగిరాల సౌమ్య, యార్లగడ్డ వెంకట్రావు, జనసేన నుంచి అసెంబ్లీ విప్‌లుగా ఆరవ శ్రీధర్, బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, బిజెపి నుంచి విప్‌గా ఆదినారాయణ రెడ్డి నియామకం శాసనమండలి చీఫ్ విప్‌గా పంచుమర్తి అనురాధ, విప్‌లుగా కంచర్ల శ్రీకాంత్, వేపాడ చిరంజీవి, శాసన మండలి విప్‌గా జనసేన నుంచి హరిప్రసాద్‌లు నియమితులయ్యారు.

శాసన మండలిలో చీఫ్ విప్‌గా పంచుమర్తి అనురాధ నియమితులయ్యారు,విప్ పోస్టులో అయిదు జనసేనకు,ఒకటి బిజెపికి లభించింది.మండలిలో చీఫ్ విప్‌తో కలిపి ముగ్గురు విప్‌లో టిడిపికి రెండు,జనసేన ఒకటి లభించాయి. ఎపిలో నేటి మధ్యాహ్నం ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో విప్‌ల నియామకంపై నిర్ణయం తీసుకున్నారు. ఇక ఈ సమావేశంలో సిఎం చంద్రబాబు ఎంఎల్ఎలకు క్లాస్ పీకారు.ఎవ్వరు ఏమీ చేస్తున్నారని వ్యాఖ్యానించారు.తన సహనానికి పరీక్ష పెట్టవద్దని అసహనం వ్యక్తం చేసారు.విపక్షాలకు అవకాశం ఇచ్చే రీతిలో మీ ప్రవర్తన ఉంటే సహించనన్నారు.

# జగన్ కేసు విచారణను మరో బెంచ్‌కి మార్చిన సిజెఐ

**విజయవాడ,నవంబరు12,ప్రభాతవార్తప్రతినిధి:** సుప్రీంకోర్టులో వై.కాంగ్రెస్ పార్టీ, మాజీ సిఎం జగన్ అక్రమాస్తుల కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సిజెఐ నేతృత్వంలోని బెంచ్ ఈ కేసు విచారణను మరో ధర్మాసనానికి అప్పగించింది. ఇప్పటి వరకు ఈ కేసులో వాదనలు విన్న సిజెఐ బెంచ్ తాజాగా మరో బెంచ్ ముందుకు పంపిస్తూ నిర్ణయం తీసుకుంది. అక్రమాస్తుల కేసులో జగన్ బెయిల్ పై బయట ఉన్నారు,ఈ బెయిల్ ను రద్దు చేయాలంటూ రఘురామకృష్ణరాజు సుప్రీం కోర్టులో గతంలోనే పిటిషన్ దాఖలు చేశారు. దీంతో పాటు ఈ కేసు విచారణను హైదరాబాద్ నుంచి మరో రాష్ట్రానికి మార్చాలంటూ రఘురామకృష్ణరాజు మరో పిటిషన్ కూడా దాఖలు చేశారు. అయితే, సుప్రీంకోర్టు బెంచ్ మార్పు నిర్ణయానికి రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిటిషనే కారణమా? లేక మరేదైనా కారణం ఉందా? అనేది తెలియరాలేదు.

# రఘురామ కృష్ణరాజు

>> ధ్వనులుచేసారు.మొదట ఈపదవికి జనసేన నుంచి అభ్యర్థిని ఖరారు చేస్తారని అభిప్రాయ పడినప్పటికి తరువాత ఎన్డీఏ పక్షాల నాయకులు ఆ ఆలోచన మానుకున్నారు. ఆర్ఆర్ఆర్‌గా పేరుపొందిన కనుమూరి రఘురామ డిప్యూటీ స్పీకరుగా ఎన్నుకోవాలని శాసనసభా పక్షనేత చంద్రబాబు స్పష్టం చేసారు. డిప్యూటీ సిఎం పవన్‌తో చర్చించిన మీదటనే కృష్ణరాజును అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించారు.

## వారం - వర్జ్యం

తేది : 13-11-2024, బుధవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయనం,
శరదృతువు, శుక్లపక్షం,
ద్వాదశి మ.1.02
రేవతి రా.3.10
వర్జ్యం : సా.4.25-5.51
దు.ఉ.11.37-12.22
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా వుండును. దీర్ఘకాలిక రుణాలు తీరి ఊరటచెందుతారు.

**వృషభం :** పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తిచేస్తారు. వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు.

**మిథునం:** గృహ నిర్మాణ ఆలోచనలు కలిసివస్తాయి. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించుకొంటారు.

**కర్కాటకం :** మాటల చాతుర్యంతో ఎదుటివారిని ఆకట్టుకుని ఎంతటి పనినైనా సాధిస్తారు.

**సింహం:** సాంకేతిక విద్యలపై ఆసక్తిచూపుతారు. కుటుంబసభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**కన్య :** ఉద్యోగులకు పదోన్నతులు, ఆర్థిక ప్రయోజనాలు అందుతాయి. వ్యాపారాలు అభివృద్ధిచెందుతాయి.

**తుల :** ముఖ్యమైన విషయాలలో నిదానంగా వ్యవహించటం మంచిది. తొందరపాటు నిర్ణయాలు తగదు.

**వృశ్చికం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**ధనుస్సు:** ఆస్తి వివాదాలు తీరి లబ్ది పొందుతారు. మీ మాటకు సంఘంలో విలువ పెరుగుతుంది.

**మకరం:** అనుకోని విధంగా ధన, వస్తు లాభాలు పొందుతారు. వాహనాలు, స్థలాలు కొనుగోలుయత్నాలు సాగిస్తారు.

**కుంభం:** భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**మీనం :** కొత్త మిత్రులు పరిచయమై సాయం అందిస్తారు. ఊహించని విధంగా ఆహ్వానాలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోలి, హైదరాబాద్

## మహిళల ఆర్థిక సహకారానికి బడ్జెట్‌లో

# రూ.3,341.82 కోట్లు



**విజయవాడ,నవంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ ఆడబిడ్డ నిధికి భారీగా నిధులు కేటాయించింది.19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళలకు నెలకు రూ.పదహేను వందల (రూ.1,500) చొప్పున ఆర్థికసాయం అందిస్తామని కూటమి పార్టీలు ఎన్నికల ప్రచారంలో ప్రకటించాయి. సూపర్‌సిక్స్ పథకాల అమల్లో భాగంగా మరో కీలక హామీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో నిధులు కేటాయించింది. ఈ పథకానికి అప్పట్లో ఆడబిడ్డ నిధి అనే సేరు .పెట్టాటరు.తాజాగా మహిళాశక్తిగా నామకరణం చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. మహిళలకు ఆర్థిక సహకార్థం పేరుతో ఆయా వర్గాలకు చెందిన వారికి 2024-25 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.3,341.82 కోట్లు కేటాయించింది. బీసీ మహిళలకు రూ.1099.78 కోట్లు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రూ.629.37 కోట్లు, మైనారిటీలకు రూ.83.79 కోట్లు, ఎస్సీ మహిళలకు రూ.1198.42 కోట్లు, గిరిజన మహిళలకు రూ.330.10 కోట్లు ప్రతిపాదించింది. జెండర్ బడ్జెట్‌లో ఈ నిధుల్ని ప్రత్యేకంగా చూపించింది.

## రాజ్యాంగ హక్కుల కోసం మాదిగలు ఐక్య పోరాటాలను చేయాలి :

### ఉత్తర కోస్తాంధ్రజిల్లాల ఎమ్మార్పీయస్ అధ్యక్షుడు యం.సుబ్బారావు



రాజవొమ్మంగిలో పాత్రికేయులతో మాట్లాడుతున్న యం.సుబ్బారావు

**రాజవొమ్మంగి, నవంబరు 12, ప్రభాతవార్త** రాజ్యాంగ హక్కులను పొందాలంటే మాదిగలు ఐక్యపోరాటాలను చేయాలని ఉత్తర కోస్తాంధ్ర జిల్లాల ఎమ్మార్పీ యస్ అద్యక్షులు ముమ్మిడివరపు చిన సుబ్బారావు పిలుపు నిచ్చారు. మంగళవారం అల్లూరి సీతా రామరాజు జిల్లా రాజ వొమ్మంగి ఆండ్‌బి అతిధిగృహ ఆవరణలో జిల్లా ఎమ్మార్పీ యస్ సమావేశం జిల్లా అద్యక్షులు నిడమర్తి చినబాబు అద్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారావు పాత్రికేయులు సమావేశంలో మాట్లాడుతూ ఎన్‌డిఏ కూటమి మద్ధత్తుతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణ కమిటీని వేయడం, వర్గీకరణ తదుపరే ఉద్యోగాలు భర్తీ అని ప్రకటించడం హర్షణీయమని అన్నారు. బ్రిటిషు కాలంలో నుండి అల్లూరి జిల్లాలో మాదిగలు ఉన్నారన్నారు. 1970సం. చట్టానికి ముందు ఏజెన్సీలో గల మాదిగలను కొండమాదిగలుగా గుర్తిస్తూ జీవో విడుదల అయినట్లు ఆరోపించారు. కాని నేటికీ మాదిగలుగానే జీవనాలను వెళ్ళదీస్తున్నారని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు మాదిగలకు అందించడంలో ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు.2016సం.లో ఎమ్మార్పీయస్ వ్యవస్థాపకులు మందకృష్ణమాదిగ రంపచోడవరం, దేవీపట్నం మండలాల్లో పర్యటించారన్నారు. వారికి ఉండటానికి ఇళ్ళు, రుణాలను ఇవ్వాలని మందకృష్ణ మాదిగ అన్నారన్నారు.

## సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు సమ్మెకాలం వేతనాలు

**విజయవాడ నవంబర్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. సమగ్ర శిక్షా ఉద్యోగులకు సమ్మె కాలపు వేతనాలు విడుదల చేసిందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది సర్కార్ ఈ మేరకు అంగీకారం తెలిపారు ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ . అయితే గత ప్రభుత్వ హయాంలో 20 డిసెంబర్ 2023నుండి 10 జనవరి 2024 వరకు 21 రోజులు సమ్మెలో పాల్గొన్నారు కేజీబీవీలలో పనిచేసే ఉద్యోగులు ఇక ఈ సమ్మె తర్వాత కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు గౌరవ వేతనాన్ని 23 శాతం పెంచుతూ జనవరి 2024 లో ప్రభుత్వ మెమో విడుదల చేసింది.

2019కు ముందు గౌరవ వేతనం పెంచని వాళ్లకు 23శాతం మేర పెంచారు. అయితే 21 రోజులు సమ్మె కాలానికి గానూ వేతనం చెల్లించాల్సిందిగా మంత్రి నారా లోకేశ్ ని కోరారు. సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్ మరియు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయూస్ ఫెడరేషన్ దీనికి మంత్రి నారా లోకేశ్ అంగీకారం తెలిపారు. ఆ మేరకు సంబంధిత శాఖకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈ వేతనాలు విడుదల చేస్తూ శుభవార్త చెప్పింది ఆంధ్రప్రదేశ్ లోని తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ బీజేపి కూటమి ప్రభుత్వం.

# తిరుమల సమాచారం

## నేడు కైశికద్వాదశి ఆస్థానం

### - ఉగ్ర శ్రీనివాసమూర్తి ఊరేగింపు



**తిరుమల,నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీమహావిష్ణువే కలియుగంలో శ్రీవేంకటేశ్వం స్వామిగా అవతరించారని, కార్తీకమాసంలో వచ్చే ద్వాదశిని పవిత్రమైన కైశికద్వాదశిగా పేర్కొన్నారు. నేటి వేకువజామున కైశికద్వాదశి ఆస్థానం ఆలయంలో జరగనుంది.నేడు సూర్యోదయానికి ముందే ఆలయంలో కొలువైన శ్రీదేవిభూదేవిసమేత ఉగ్రశ్రీనివాస మూర్తి ఉత్సవమూర్తులను ఆలయం వెలుపలకు వేంచేపుచేసి మాఢవీధుల్లో ఊరేగిస్తారు. ఏడాదిలో ఒక్క కైశికద్వాదశిరోజు మాత్రమే ఈ ఊరేగింపు ఉంటుంది. అనంతరం ఆలయంలోపల బుధవారం ఉదయం 6గంటల నుండి 7.30వరకు ఆస్థానం పురాణపారాయణం నిర్వహిస్తారు.

## 17న తిరుమలలో కార్తికవనభోజనం

**తిరుమల,నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** కార్తీకమాసం పురస్కరించుకుని కలియుగ వైకుంఠం తిరుమలలో 17వతేదీ ఆదివారం కార్తీకవనభోజనాన్ని టిటిడి నిర్వహిస్తోంది. తిరుమలలో పార్వేటమండపం సమీపంలో ఉసిరిచెట్ల మధ్య ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం పరిపాటి. ఆ రోజు ఉదయం ఆలయం నుండి మలయప్పస్వామి చిన్న గజవాహనంపై, శ్రీదేవిభూదేవి అమ్మవారుప్ల పల్లకీపై ఊరేగింపుగా బయలుదేరి పాపవినాశనం మార్గంలోని పార్వేటమండపం చేరుకుంటారు. ఉదయం అక్కడ ఉత్సవ మూర్తులకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం కార్తీకవనభోజన కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమంతో ఆలయంలో జరిగే ఆర్జితసేవలు రద్దుచేసింది.

## 15న దత్తక్షేత్రంలో రుద్రహోమం

**తిరుపతి,నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** కార్తీకపౌర్ణమి సందర్భంగా 15వతేదీ శుక్రవారం నెల్లూరుజిల్లా లింగసముద్రం మండలం మొగలిచెర్లలోని అవధూత శ్రీదత్తాత్రేయ మందిరంలో మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేక సహిత రుద్రహోమం నిర్వహిస్తున్నారు. దత్తమందిరం ఆలయం ప్రాంగణంలో ఉదయం 8గంటలకు జరిగే ఈ రుద్రహోమంలో పాల్గొనే భక్తులు నేరుగా రావచ్చన్నారు.

ఇంకా హోమంలో పరోక్షంగా పాల్గొనదలచిన భక్తులు 9908973699, 6302616897 నంబర్లకు సంప్రదించాలని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ తెలిపారు.

## 'కన్నప్ప' చిత్రం డిసెంబర్‌లోనే

### - తిరుమలలో నటుడు మంచు విష్ణు



**తిరుమల,నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** భక్తిరసచిత్రం కన్నప్ప విడుదల ఇంకా ఆలస్యమవుతుందని, డిసెంబర్‌లో విడుదల చేయాలని భావిస్తున్నట్లు సినీనటుడు మంచు విష్ణు తెలిపారు. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకుని నిర్మించడం జరుగుతుందన్నారు. సినీనటుడు మంచు విష్ణు మంగళవారం ఉదయం తిరుమలకు చేరుకున్నారు. విఐపి బ్రేక్‌లో ఆయన ఆలయంలోనికి రావడంతో టిటిడి అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వన్యకుల క్షత్రియుల సమస్యలు పరిష్కరిస్తాం: మంత్రి సవిత



వన్యకుల క్షత్రియ నాయకులతో మంత్రి సవిత

**విజయవాడ,నవంబరు12,ప్రభాతవార్తప్రతినిధి :** రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవితను నూతనంగా నియమితులైన ఏపీ వన్యకుల క్షత్రియ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ సీఆర్ రాజన్ మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను సీఆర్ రాజన్ మంగళవారం కలిశారు. తనపై ఎంతో నమ్మకంతో ఏపీ వన్యకుల క్షత్రియ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గా అవకాశమిచ్చినందుకు సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ తో పాటు మంత్రి సవితకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయబోనని, ప్రభుత్వ కార్యాక్రమాలను, పథకాలను ప్రజల్లో తీసుకెళతానని మంత్రికి వివరించారు. వన్యకుల క్షత్రియుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని వెల్లడించారు. ఏపీ వన్యకుల క్షత్రియ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గా ఎంపికైన సీఆర్ రాజన్ కు మంత్రి సవిత అభినందనలు తెలిపారు. కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వమందించే పథకాలను అర్హులకు అందేలా కృషి చేయాలని రాజన్ కు మంత్రి సవిత సవిత సూచించారు. అనంతరం మంత్రి సవితను రాజన్ దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ఫీజు గడువు పెంపు

**విజయవాడ,నవంబరు12, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు 2024- 25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ఫీజు గడువును పొడిగిస్తూ ఇంటర్ బోర్డు ప్రకటన జారీ చేసింది.ఈ పరీక్షలకు హాజరయ్యేందుకు పరీక్ష ఫీజు చెల్లింపు ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతున్నంది. అక్టోబర్ 21 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమవగా.. తుది గడువు నవంబర్ 11వ తేదీతో ముగిసింది. తాజాగా ఈ గడువును పొడిగిస్తూ ఇంటర్ బోర్డు ప్రకటన జారీ చేసింది. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును నవంబర్ 21వ తేదీ వరకు పొడిగిస్తూ ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి కృతిక శుక్లా ప్రకటన జారీ చేశారు. రూ.100 ఆలస్య రుసుముతో డిసెంబర్ 5వ తేదీ వరకు ఫీజు చెల్లించొచ్చని తెలిపారు. మొదటి లేదా రెండో ఏడాది చదివే విద్యార్థులు జనరల్ థియరీ సబ్జెక్టులకు రూ. 600, సెకండ్ ఇయర్ ప్రాక్టికల్ పరీక్షలకు రూ. 275, బ్రిడ్జి కోర్సు సబ్జెక్టులకు రూ. 165 చొప్పున ఫీజు చెల్లించాలని వెల్లడించారు. మొదటి, రెండో ఏడాదికి కలిపి థియరీ పరీక్షలకు రూ. 1200 చెల్లించాలని ఆమె సూచించారు. హాజరు మినహాయింపు కోరేవారు ప్రైవేటు అభ్యర్థులుగా పరీక్షలు రాసేందుకు అవకాశం ఉంటుందని, వీరు నవంబరు రూ. 1500 ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఇక ఇంటర్మీడియల్ పబ్లిక్ పరీక్షలు మార్చి 1 నుంచి నిర్వహించే అవకాశం ఉంది. ఫిబ్రవరి రెండోవారంలో ప్రాక్టికల్స్ ఉంటాయి. వీటితోపాటు నైతికత, మానవ విలువలు, పర్యావరణ పరీక్షలు కూడా నిర్వహించే అవకాశం ఉంది.

## అరబ్ దేశాల శిక్షలు, చట్టాలు చెప్పి భయపెడుతున్నారు

### మాజీమంత్రి అంబటి రాంబాబు

**విజయవాడ నవంబర్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** చంద్రబాబు పులి మీద స్వారీ చేస్తున్నాడనీ ఆ పులి మిమ్మల్నే తింటుందని వైసీపీ సీనియర్ నేత గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు మాజీమంత్రి అంబటి రాంబాబు అన్నారు. సోషల్ మీడియాపై కక్ష్య గట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ సోషల్ మీడియాను చిందర వందర చేయాలని చంద్రబాబు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీకి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లను అక్రమ అరెస్టు చేశారని విమర్శించారు. సుధారాణి ఆమె భర్త ఎక్కడికో తీసుకు వెళ్లిపోయారాని అన్నారు. సోషల్ మీడియాలో ఏం పోస్టులు పెట్టారు అనేది నిర్ణయించేది పోలీసులు కాదు అందుకు న్యాయస్థానాలు ఉన్నాయన్నారు. వర్రా రవీంద్రారెడ్డిని సుధారాణిని అర్ధరాత్రి న్యాయమూర్తి ఇంటి వద్ద హాజరు పరిచారని అర్థరాత్రి న్యాయమూర్తులు ఇళ్ల వద్ద హాజరు పెట్టాల్సిన అవసరం ఏం ఉందని ప్రశ్నించారు. పౌర సమాజంలో ప్రజాస్వామ్యంఉందా అని అడిగారు. కోయా ప్రవీణ్ అనే సీనియర్ అధికారి మాటలు దారుణంగా ఉన్నాయన్నారు.

## టిడిపి వీరాభిమాని మోహన్‌రావు

### - రూ.లక్షచెల్లించి పార్టీలో శాశ్వత సభ్యత్వం



**తిరుపతి,నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** ఆరుపదుల వయస్సులోనూ తెలుగుదేశం పార్టీపట్ల వీడని అభిమానం...పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ ఎన్టీరామారావుతో ఉన్న సాన్నిహిత్యం ఇప్పటికీ తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతున్నారు తిరుపతికి చెందిన మందలపు మోహన్‌రావు. ఎన్ని ఆటుపోట్లు, ఒడిదుడుకులు వచ్చినా,పదవులు లేకున్నా ఆయన పార్టీపట్ల అసహనం వ్యక్తం చేయలేదు. తిరుమలకు చెందిన ఈయన వ్యాపారరీత్యా భక్తుల సేవలో తరించి హోటల్ నడిపినా తదదనంతరం ఆయన తిరుపతికి దిగారు. తిరుపతిలో ఉంటున్న ఆయన ప్రతి ఏడాది పార్టీ చేపట్టే సభ్యత్వనమోదును తూచా తప్పకుండా తీసుకుంటారు. అయితే ఈ ఏడాది చంద్రబాబుపై వున్న విశ్వాసం, తెలుగుప్రజలకు అండగా తెలుగుదేశం పార్టీ నిలబడాలనే ఆకాంక్షతో మందలపు మోహన్‌రావు లక్షరూపాయలు నగదు చెల్లించి టిడిపి శాశ్వత సభ్యత్వం పొందారు. ఆయన మంగళవారం ఉదయం తిరుపతి ఇన్‌ఛార్జి సుగుణమ్మ ఆధ్వర్యంలో ఈ సభ్యత్వం తీసుకున్నారు. సినీయర్‌నాయకుడు మందలపుమోహన్‌రావును పలువురు పార్టీ నేతలు అభినందించారు.

## సోషల్ మీడియా కార్యకర్తలపై పోలీసులు తప్పడు కేసులు పెడుతున్నారు

### రాష్ట్రపతి, గవర్నర్‌లకు ఫిర్యాదుచేసిన వైఎస్సార్సీ

**విజయవాడ,నవంబరు12,ప్రభాతవార్తప్రతినిధి:** కక్షసాధింపు చర్యలతో తమ సోషల్ మీడియా కార్యకర్తలపై పోలీసులు 100కు పైగా కేసులు నమోదు చేశారని వైకాంగ్రెస్ పార్టీ రాష్ట్రపతి, గవర్నర్‌కు ఫిర్యాదు చేసింది. రాష్ట్రంలో వాక్‌స్వేచ్ఛ లేకుండా పోయిందని, ఇది తీవ్ర ఆందోళన కలిగించే అంశమని పేర్కొంది. కస్టడీలో కార్యకర్తలు ప్రాథమిక హక్కులను కోల్పోతున్నారని తెలిపింది. కల్పిత కేసులు పెడుతున్నారని, ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్ జోక్యం చేసుకోవాలని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా అభ్యర్థించింది. "ఆంధ్రప్రదేశ్‌లో వాక్‌స్వేచ్ఛను అణచివేయడం తీవ్ర ఆందోళన కలిగించే అంశం. సోషల్ మీడియా కార్యకర్తలపై ఏపీ పోలీసులు 100కు పైగా కేసులు నమోదు చేశారు. దాఖలైన పన్నెండు హెబియస్ కార్పస్ పిటిషన్‌లతో అక్రమ నిర్బంధాలు, అర్ధరాత్రి అరెస్టులు, కుటుంబాలపై వేధింపులు. కస్టడీలో కార్యకర్తలు ప్రాథమిక హక్కులను కోల్పోతున్నారు. విమర్శకులు, పాత్రికేయులు, రాజకీయ సంబంధం లేని వ్యక్తులను కూడా లక్ష్యంగా చేసుకోవడానికి కల్పిత కేసులు పెడుతున్నారు. సోషల్ మీడియా కార్యకర్తలపై బీఎన్ఎస్ సెక్షన్ 111(2)ని ప్రయోగిస్తున్నారు. ఇది అన్యాయం.

ఇటువంటి చర్యలు రాజ్యాంగ స్వేచ్ఛ, సుప్రీంకోర్టు తీర్పులు, ప్రజాస్వామ్య పాలనపై ప్రజలు విశ్వాసాన్ని కోల్పోయేలా చేస్తాయి. న్యాయాన్ని కాపాడానికి, భావప్రకటనా స్వేచ్ఛను రక్షించడానికి మీరు జోక్యం చేసుకోవాలని అభ్యర్థిస్తున్నాం" అని వైకాంగ్రెస్ పార్టీ ట్వీట్ చేసింది.

# రైలింజన్‌కే ఓటు.. అభివృద్ధికి చోటు!

### - రైల్వే సిబ్బంది ప్రధాన డిమాండ్ల సాధనకు అవిశ్రాంత పోరాటం - ప్రత్యర్థి యూనియన్ అసత్య ప్రచారాలను నమ్మవద్దు - ఎన్నికల సభలో ఎన్ఎఫ్ఐఆర్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య




కార్మికులనుద్దేశించి ప్రసంగిస్తున్న ఎన్ఎఫ్ఐఆర్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాఘవయ్య

**గుంతకల్లు రైల్వే,నవంబరు 12,ప్రభాతవార్త** రైల్వే సిబ్బంది ప్రధాన డిమాండ్ల సాధనకై అవిశ్రాంతంగా పోరాడుతున్న దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎన్ఎఫ్ఐఆర్ జాతీయ ప్రధాన కార్యదర్శి,దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య రైల్వే సిబ్బందికి విజ్ఞప్తి చేశారు. రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు డిసెంబరు 4,5,6వ తేదీల్లో జరుగనున్న నేపథ్యంలో ప్రచారంలో భాగంగా మంగళవారం స్థానిక డిఆర్ఎం కార్యాలయం వద్ద జరిగిన బహిరంగ సభలో ఆయన, అదనపు ప్రధాన కార్యదర్శి భరణి భాను ప్రసాద్, గుంతకల్లు డివి జనల్ అధ్యక్ష, కార్యదర్శులు బాబు, ప్రభాకర్‌లు ప్రసంగించారు. ఎన్నికల సమయంలో ప్రత్యర్థి యూనియన్ అసత్య ఆరోపణలు, ప్రచారంపై ఆయన తనదైన విశిష్ట శైలిలో సుతిమెత్తగా మెత్తగా చురకలంటించారు. ఎంప్లాయిస్ సంఘ్ రైల్వే కార్మికులకు చేసిన ప్రయోజనాలను ఆయన వివరించారు. రైల్వేరన్నింగ్ సిబ్బందికి 70శాతం కిలోమీటరేజ్ అలవెన్స్‌ను ఆదాయపు పన్నును నుంచి మినహాయించడంతో పాటు రన్నింగ్,భద్రతా విభాగాలకు చెందిన సిబ్బందిపై వేధింపులు,కక్షసాధింపు చర్యలను నిరోధించడం, స్పాడ్ నిర్వచనాన్ని సమీక్షించాలని, ఎన్‌పిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానానికి సమానంగా ,ఏకీకృత పెన్షన్ విధానాన్ని అమలుకై కృషి చేస్తామన్నారు. డాక్టర్. ఆక్రాయిడ్ ఫార్ములా మేరకు కనీస వేతనాన్ని నెలకు రూ.32,500ను చెల్లించడంతో పాటు,8వ వేతన సంఘాన్ని తక్షణ ఏర్పాటుకై కేంద్ర ప్రభుత్వంపై పోరాడి సాధించేందుకు కృషి చేస్తామన్నారు. ఉత్పాదకతతో ముడిపడిన బోనస్ విధానంపై గల వేతన సీలింగ్‌ను తొలగించే డిమాండ్‌తో పాటు కోవిడ్ మహమ్మారి కారణంతో 2020జనవరి నుంచి 2021వరకు నిలిపివేసిన కరువు భత్యాన్ని/డిఆర్‌లను తక్షణం చెల్లించేందు కు కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, 12గంటల పనివిధానాన్ని రద్దు చేసి 8గంటల పనివిధానాన్ని సాధించేందుకు టెక్నీషియన్ గ్రేడ్-02పోస్టులను,గ్రేడ్-1 పోస్టు లతో విలీనం చేసేందుకు రైల్వేలోని అన్ని కేటగిరీలకు గ్రేడ్ పే రూ.4,600లకు బదులుగా రూ.4,800(లెవెల్-8)ను అమలు చేయడంతో పాటు రైల్వే సిబ్బందికి సంబంధించిన అనేక ప్రధాన సమస్యల సాధనకై అవిశ్రాంతంగా పోరాడుతున్నట్లు తెలిపారు. కావున రైల్వే సిబ్బంది ప్రతిఒక్కరు కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఎన్నికల గుర్తు అయిన రైలింజన్‌పై తమ అమూల్యమైన ఓటు వేసి,వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. సభలో పూర్వపు డివిజనల్ అధ్యక్షుడు ఖాజాగరీబ్ అన్ నవాజ్,సిడబ్ల్యు సభ్యులు కుళ్లాయప్ప,డిప్యూటీ డివిజనల్ కార్యదర్శులు డిఎన్‌రెడ్డి,కె మల్లికార్జున,అధిక సంఖ్యలో సంఘ్ నాయకులు,కార్యకర్తలు,రైల్వే సిబ్బంది పాల్గొన్నారు. బ్రాంచిల వారిగా సమీక్ష : అనంతరం స్థానిక రైల్వే ఇన్స్‌టిట్యూట్‌లో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని 25బ్రాంచిల అధ్యక్ష,కార్యదర్శులతో సమావేశమైనారు.



టిడిపి రాష్ట్ర కార్యదర్శి హేమ భారదరావు శాప్ ఛైర్మన్ రవినాయుడు సత్కరిస్తున్న దృశ్యం

## దేశంలోనే అత్యుత్తమంగా క్రీడా రంగాన్ని అభివృద్ధిపరుస్తాం

### శాప్ అధ్యక్షుడు రవినాయుడు

**విజయవాడ,నవంబరు12,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలోనే అత్యుత్తమంగా క్రీడా రంగాన్ని అభివృద్ధిపరిచే విధానాన్ని తీసుకొచ్చామని, అంతే చిత్తశుద్ధితో ఆ విధానాన్ని అమలు చేస్తామని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి హేమ భారదరావు శాప్ ఛైర్మన్ రవినాయుడిని మంగళవారం కలిశారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం ఆమోదించిన స్పోర్ట్స్ విధానం పట్ల భారదరావు హర్షం వ్యక్తం చేశారు. ఏపీ క్రీడారంగాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాలని ఆకాంక్షించారు. అనంతరం పలు అంశాలపై వారిరువురూ చర్చించారు.ప్రభుత్వం తీసుకుని వచ్చిన నూతన క్రీడా పాలసీకి మంచి స్పందన లభిస్తోంది,.ఉద్యోగాల్లో క్రీడా కోటాను 3శాతం పెంచామన్నారు.ఆడుదాం ఆంధ్రాలో జరిగిన అవినీతి,అక్రమాలు వెలుగులోకి తీసుకుని వస్తామన్నారు.

## టిడిపి అంటేనే నాయకులను తయారుచేసే కర్మాగారం

### ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

**సచివాలయం,నవంబర్ 12,ప్రభాతవార్త :** బడ్జెట్ సమావేశాలపై సభ్యు లందరికి అవగాహన సదస్సులో పాల్గొన్నామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి,జనసేన,బిజేపి సభ్యు లందరూ పాల్గొన్నారు.టిడిపి అంటేనే నాయ కులను తయారుచేసేకర్మాగారం. చంద్రబాబు తొమ్మిది సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు.తెలుగు రాష్ట్రాల్లో చంద్రబాబు అంత సీనియర్ నాయకుడ ఎవరూ ఉండరు.ఈనేపథ్యంలో మొదటిసారి ఎమ్మెల్యే ఐనప్పుడు,మంత్రి ఐనప్పుడు, ముఖ్యమంత్రి ఐనప్పుడు సభ ఏలా నడిచేదో,ఇప్పుడేలా జరుగుతుందో మాకందరికీ వివరించారు.సభ అంటే గతంలో హుందాగా జరిగేదని చెప్పారు.గత ప్రభుత్వంలోసభా సాంప్రదాయాలను తుంగలో తొక్కారు. 2019-24మధ్య జరిగింది గౌరవ సభ కాదు కౌరవ సభ. చంద్రబాబు నాయకత్వంలో సభను హుందాగా నడిచేలా తీర్దిదిద్దుతారు. మాకు కూడా జిల్లా,నియోజకవర్గం,రాష్ట్రస్థాయి సమస్యలు చర్చించాలని సీఎం సూచించారు.ప్రజా సమస్యలపై మాట్లాడాల్సి వసు _ందనే వైసిపి నాయకులు సభకు డుమ్మా కొట్టారు. నేడు సభ్యులందరికి బడ్జెట్ సమావేశాలపై అవగాహన కలిగించారు.జరిగిన ఎన్నికల్లో గెలిచి నేటు 84 మంది కొత్త ఎమ్మెల్యేలు సభకు వచ్చారు.వారందరికీ ఈ అవగాహన సదస్సు ఎంతో ఉపయోగపడుతుంది.గతంలో సభ ఎలా ఉండేది,ఇప్పుడు ఎలా ఉంటుంది అనేది మాకు వివరించారు.గత ప్రభుత్వ నిర _క్ష్యంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది.ఈ క్రమంలో కూటమి ప్రభుత్వానికి మొదటి బడ్జెట్.అందుకే సభను హుందాగా నిర్వహిస్తున్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, నసీర్ అహ్మద్

వార్త


మనకుగల శక్తిని బట్టి మనలను మనం అంచనా వేసుకుంటాం. మనం చేసిన పనులను బట్టి ఇతరులు మనలను అంచనా వేస్తారు.

-జేన్ పోర్టర్

# బలిపీఠంపై విద్యార్థిలోకం?

మేధస్సును పంచేవారు మనిషి, మనసును పంచేవారు మహర్షి అన్నారు పెద్దలు. మన విద్యాలయాల్లో అంతోఇంతో మేధస్సును అందిస్తున్నారు. కానీ మనసును పంచేవారు కరవైపోతున్నారేమోననిపిస్తున్నది. అందుకే పరిస్థితులు వికటించి భావిభారత పౌరులుగా ఎదిగి ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థుల జీవితాల్లో అంధకారం అల్లుకొని అర్థాంతరంగా బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. విద్య ఒక వ్యాపారంగా రూపాంతరం చెందినప్పటి నుండి ఈ దురదృష్టపు పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఇవి రానురాను పెరిగిపోతుండడం ప్రజాస్వామ్యవాదుల్లో ఆందోళన కలిగిస్తున్నది. విద్యార్థి దశలోనే అర్థాంతరంగా తనువు చాలిస్తున్న భావిభారత పౌరులను చూసి భారతావని నివ్వెరపోతున్నది. తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చి కుటుంబంలో కాంతులు వెదజల్లాల్సిన దీపాల్లాంటివారు భవిష్యత్తులో దేశాభివృద్ధి భాగస్వాములు కావాల్సిన దివ్వెలు అర్థాంతరంగా ఆకస్మికంగా ఆరిపోతున్నాయి. కని పెంచిన వారి ఆశలను చిదిమేస్తూ కుటుంబాల్లో అంధకారాన్ని నింపుతూ కనుమరుగవుతున్న ఈ విద్యాదీపాల వెనుక ఎన్నో కారణాలు ఉన్నాయి. తెలంగాణలో నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటిలో సోమవారం ఒకవిద్యాదీపం బలవన్మరణానికి పాల్పడింది. బాసర ఆర్జీయుకెటి ట్రిపుల్ ఐటిలో పియూసి రెండోసంవత్సరం చదువుతున్న స్వాతిప్రియ తోటి విద్యార్థులు అల్పాహారానికి మెస్‌కు వెళ్లిన సమయంలో గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కొనఊపిరితో ఉన్న ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించినా ప్రయోజనం లేకుండాపోయింది. కారణాలు స్పష్టంగా తెలియకపోయినా స్వాతిప్రియ గదిలో ఉంటున్న స్నేహితురాలికి మరో విద్యార్థికి గొడవ జరిగిందని దాంట్లో స్వాతిప్రియ కల్పించుకోవడంతో ఆ విద్యార్థి బెదిరించడం ప్రారంభించాడని స్వాతిప్రియ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయంలో అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆ విద్యార్థిని సస్పెండ్ చేశారని, అయినా ఆ తర్వాత కూడా ఆ విద్యార్థి తమకు కుమార్తెను బెదిరించడం వల్లనే ఆత్మహత్య చేసుకున్నదని వారు ఆరోపించారు. సోమవారం ఉదయం జరిగిన ఈ సంఘటనపై విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. బాసర ట్రిపుల్ ఐటిలో ఇలా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం ఇది మొదటిది కాదు. గ్రామీణ పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలనే పవిత్ర ఆశయంతో ఏర్పాటైన ఈ విశ్వవిద్యాలయంలో ఎందుకోఏమోకానీ ఆత్మహత్యల పరంపర కొనసాగుతున్నది. గత రెండేళ్లలోనే తొమ్మిది మందికిపైగా విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. యూనివర్సిటీలో పరిపాలనకు సంబంధించిన లోపాలు, మౌలిక వసతుల కొరత లాంటివన్నీ విద్యార్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నిరువధిక సమ్మెలకు కూడా విద్యార్థులు గతంలో ఉద్యమించారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారం కోసం తక్షణం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. అయినా అక్కడ పరిస్థితులు మాత్రం మెరుగుపడలేదు. దీంతో అనేక సమస్యల మధ్య విద్యార్థులు చదువు కొనసాగించలేక ఒత్తిడిలకు గురై బలవన్మరణాలకు పాల్పడుతున్నట్లు విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇక్కడే కాదు దేశవ్యాప్తంగా కూడా జరుగుతున్న మొత్తం ఆత్మహత్యల్లో విద్యార్థులదే అగ్రస్థానంలో ఉన్నాయి. అందులోనూ రాజస్థాన్‌లోని కోటా ప్రథమస్థానంలో ఉందని చెప్పొచ్చు. దేశవ్యాప్తంగాదాదాపు రెండు లక్షల మందికిపైగా వివిధ కోర్సుల్లో ప్రవేశంకోసం ర్యాంకులు సాధించేందుకు కోటాలో కోచింగ్ తీసుకుంటారు. ఇలా కోచింగ్ కోసం వచ్చిన వారిలో కొందరుఒత్తిడికి గురికావడంతో భయపడి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ యేడాది ఇప్పటివరకు దాదాపు పంతొమ్మిది మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడినట్లు అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. ఆ రాష్ట్రప్రభుత్వం ఈ ఆత్మహత్యలను నిరోధించేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం ఫలించడం లేదు. విద్యార్థుల కోసం హెల్ప్‌లైన్ నెంబర్లు అందుబాటులో ఉంచారు. మరొకపక్క ఫ్యాన్‌లకు ఉరివేసుకుంటున్నారనే కారణంతో హాస్టల్ గది అన్నింటిలో ఫ్యాన్‌లు తీసివేశారు. మరొకపక్క పై అంతస్తులనుండి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడకుండా భవనాలకు ఇనుప గొలుసులతో కంచెలు వేయించారు. ఇలాంటి చర్యలేమీ వీటిని ఆపలేకపోతున్నాయి. మూలాల్లోకి వెళ్లకుండా పైపైచర్యలు తీసుకున్నంత మాత్రాన ఇవి తగ్గవనేది జరుగుతున్న ఆత్మహత్యలు చెప్పకనే చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా 2022లో పదమూడువేల నలభైనాలుగు మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోగా, 2023లో అవి మరింత పెరిగాయి. విద్యార్థుల ఆత్మహత్యల్లోమహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నాయి. బాలురుకంటే బాలికలే ఎక్కువగా ఈ బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ చావులకు ఎన్నో కారణాలున్నాయి. ఇప్పటికైనా పాలకులు రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలి. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఒత్తిడిలేని విద్యావిధాన రూపకల్పనదిశగా మేధావులు ఆలోచించాలి. విద్యార్థిలోకాన్ని ఈ బలవంతపు చావులనుంచిబయటపడేసేందుకు యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాల్సిన తరుణమిది. ఇందులో ఎలాంటినిర్లక్ష్యం చేసినాదేశాభివృద్ధికి భాగస్వాములు కావాల్సిన ఉజ్వలభవిష్యత్ ఉన్నవిద్యార్థులెందరినో దేశం కోల్పోతుంది. ఏ కోణంలో చూసినా చదువుల పేరుతో లేతమనసులను బలిపీఠం ఎక్కించడం ఏమాత్రం సమంజసంకాదు. అన్నింటికంటే మించి ఈ కార్పొరేట్ మాయాజాలానికి అడ్డుకట్ట వేయాలి.

మానవ జాతిని మార్చాలని ప్రతివాడూ చూస్తాడు. కాని తనను తాను మార్చుకోవాలని మాత్రం ఎవరూ చూడరు.



లియో టాల్‌స్టాయ్

వయసులో ఉన్నప్పుడే మంచి పనులు చేయి. ఆలస్యం అయితే కాలం నీ చేతిలో ఉండదు.



ఎడ్వర్డ్ స్పెన్సర్

## ప్రజావాక్కు



### ఉదాసీనత తగదు!

నెల్లూరుఆర్‌డిఒ, తహసీల్దార్ కార్యాలయాల్లోమాజీ మంత్రి భార్య భూ కుంభకోణానికి సంబంధించిన రికార్డులు మాయమైనట్లు తాజా వార్త! ఈ మాజీ మంత్రి గారికి సంబంధించిన కేసు ఫైల్ కోర్టు గది నుంచే మాయమైన వ్యవహారం ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు తేలలేదు! ఇలా అయితే ఇంకా ప్రజలకు వ్యవస్థలపై నమ్మకం ఉంటుందా? బాధ్యులపై చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా ఉంటేఅది పాలకులబాధ్యతారాహిత్యం, వైఫల్యంగా భావించాలి? తప్పు చేసిన వారిని వదలం అంటూ ఘనమైన ప్రకటనలుఇస్తున్న పాలకులు ఆచరణలో చూపడం లేదు. మరోవైపు తప్పులు చేసిన వారు అధికారులను బెదిరిస్తున్నారు! వీరి వైఫల్యాలే నేరగాళ్లకు ఊపిరి పోస్తున్నాయి!

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### ఇంటింటి సర్వే

ఈ నెల నవంబరు 8 వ తారీఖు నుండి గడప గడపకు వెళ్లి అనేక ప్రశ్నలకు ఇంటి వారి నుంచి సమాధానాలు సేకరిస్తారని తెలంగాణా ప్రభుత్వంప్రకటించింది. ముందుగా ఇళ్ల ముందర గోడలమీద స్టికర్లను అతికిస్తారని అన్నారు. ఇంతవరకు చాలా ఇళ్లకుఎవరూవచ్చి స్టికర్లను అతికించలేదు గత సంవత్సరం డిసెంబరులో ప్రజా పాలన అప్లికేషన్లను నింపి కలక్షన్ సెంటర్లలో ఇవ్వడం జరిగింది. వాటిమీద చర్యలు ఇంతవరకు తీసుకోలేదు. కూలిపని చేసుకునేవారు, ఉద్యోగులు, వ్యాపారులు ఇంటి పట్టునఉండరు. అందుచేత మరల గతంలో మాదిరిగా సెంటర్లకు వచ్చిఫలానా తేదీలోపల ఫలానా ఫారంలో తమ వివరా లను అందచేయాలని నియమం పెట్టాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ఆధ్యాత్మిక చింతన

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యార్థులు నైతిక విలువల ప్రభుత్వ సలహాదారుగా ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు గారు నియమితులవడం హర్షణీయం. పెద్దలు, గురువులపై గౌరవంగా ఉండేలా పిల్లలను సత్ప్రవర్తనతో ఉండేలా తమమాటలతో, అనుభవంతో గురువుగారు తీర్చి దిద్దగలరని ఆశిద్దాం. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత చింతన అలవాటు చేసుకోవాలి. చాగంటి గారు నేర్పే నైతిక విలువలు అందరూ పాటించాలి.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### చిన్నారులే జాతి సంపద

చిన్నారులే ఏ జాతికైనా జాతిసంపద. అటువంటి చిన్నారుల కోసం ఆస్ట్రేలియా గట్టి నిర్ణయమే తీసుకుంది. 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధించాలని సంకల్పించింది. విద్యార్థులు రోజూ గంటలకొద్ది కాలాన్ని సోషల్ మీడియా వేదికలపై గడుపుతున్నారు. ఈ ప్రభావం విద్యార్థుల చదువులపైనే కాక ఆరోగ్యంపై కూడా పడుతుంది. ఇది తల్లిదండ్రులకు ఆందోళన కలిగిస్తుంది. విద్యార్థులు సోషల్ మీడియా వైపు ఆకర్షితులుకావడం ద్వారా వారికి మంచికంటే చెడు ఎక్కువ కలుగుతుంది. ఆస్ట్రేలియా ప్రధాని నిర్ణయం పిల్లలకు, తల్లిదండ్రులకు మేలు చేస్తుందనడంలో సందేహం లేదు. అన్ని దేశాలు కూడా ఈ దిశగా ఆలోచిస్తే బాలల భవిష్యత్తు బాగుంటుంది. 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా అందుబాటులో లేకుండా చూడాల్సిన బాధ్యత ఆయా సంస్థలదే.

-చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరు జిల్లా

### పత్తి కొనుగోలులో సి.సి. ఐ కొర్రీలు

తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన పత్తి పంట కొనుగోలులో సి.సి.ఐ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొర్రీలు పెట్టడం ద్వారా రైతులు ఇబ్బంది పడుతున్నారు. మార్కెట్స్‌కు రైతులు తీసుకు వచ్చిన పత్తిని నేరుగా కొను గోలు చేయాలి. మార్కెట్ అధికారులు, సి.సి.ఐ వారు కుమ్మక్కు అయి రైతులను నిలువు దోపిడి చేస్తున్నారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధర దక్కాలంటే సి.సి. ఐ తక్షణమే పత్తిని కొనుగోలు చేయాలి

-కామిడి సతీశ్ రెడ్డి, జయశంకర్, భూపాలపల్లి జిల్లా

### మీ నిర్వాకం మాటేమిటి?

సీప్లేన్ సర్వీసులతో సంపద పెరగదు అంటూ పులివెందుల ఎమ్మెల్యే వైఎస్.జగన్ వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉంది. గత ప్రభుత్వంలో విశాఖపట్నంలో ఫ్లోటింగ్ బ్రిడ్జి అంటూ సాక్షి ఛానల్‌లో ఊదర గొట్టారు. పర్యాటకుల సంఖ్య పెరుగుతుందన్నారు. అది రెండో రోజుకు కూలి పోయిన విషయం జగన్ మరిచిపోయినట్టున్నారు? చిత్రావతి నదిలో బోటింగ్ జెట్టీ నిర్మించి ఆహా ఇదే అభివృద్ధి అంటూ హోరెత్తించారు! రాష్ట్రానికి కియా పరిశ్రమ వచ్చిన సందర్భంలోనూ ఇలాంటి పసలేని వ్యాఖ్యలు చేశారు! జగన్ వ్యాఖ్యలు గురివింద సామెతను తలపిస్తున్నాయి! వ్యాఖ్యలు చేయడం మానాలి.

-జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణా జిల్లా

మన విధి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

# సమన్వయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం!

**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రయోజనాల కొరకు పలుమార్లు ఢిల్లీకి వెళ్లి ప్రధానిని కలిశారు. దానికి ప్రతిఫలం గా బడ్జెట్‌లో మాత్రం గణాంకాలపరంగా ఘనంగా కేటాయింపులు జరిగాయి. కానీ వాటిలో ఇప్పటివరకు ఒక్కటీ కార్యరూపం దాల్చకపోవడంతోపాటూ కనీసంవాటిపై స్పష్టత కూడా రావడంలేదు. గతంలో అధికారంలో ఉన్న పార్టీలు అఖిలపక్ష పార్టీలతో తరచుగా సమావేశాలు నిర్వహించి రాష్ట్రానికి సంబంధించిన జటిలమైన విషయాలలో వారి సలహాలు తీసుకునేవి. ఇటీవలికాలంలో ఆ సంస్కృతి కను మరగైంది. అదేసంస్కృతిని ఆదర్శంగా తీసుకుని ఎటువంటి బేషజాలాలకు పోకుండా ప్రజలు తనపైపెట్టుకున్న ఆశలకు అనుగుణంగా ముఖ్యమంత్రితోపాటు సంబంధిత సహచరమంత్రులను సమన్వయం చేసుకుని ఢిల్లీకివెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడితెచ్చి రాష్ట్రానికి రావలసిన అంశాలన్నిటినీ సాధించాల్సిన బాధ్యత పవన్‌కళ్యాణ్ పై కూడా అత్యధికంగా ఉందనేది నిర్వివాదాంశం.**

కైలసాని శివప్రసాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌ను రెండు తెలుగు రాష్ట్రాలలోని లక్షలాది యువత దైవంగా ఆరాధిస్తారనడంలో ఎటువంటి సందేహం లేదు. రాజకీయ దురంధరునిగా పేరు గడించిన నారా చంద్రబాబు నాయుడును గత ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి తన హయాంలో అన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేసి చివరకు జైలుపాలు కూడా చేశారు. కానీ గత ప్రభుత్వంపై ఎంత దూకుడుగా వ్యవహరించినా పవన్ కళ్యాణ్‌ను మాత్రం జగన్ మోహన్ రెడ్డి భౌతికంగా ఇబ్బంది పెట్టేందుకు సాహసించలేదు. యువతలో పవన్ కళ్యాణ్‌కు ఉన్న ఆదరణే దానికి ప్రధాన కారణం. అంతటి శక్తివంతుడైన పవన్ కళ్యాణ్ దశాబ్ద కాలంపాటూ రాజకీయంగా, మానసికంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. అనేక అవమానాలు, తిరస్కారాలు రుచి చూశారు. అయినా ఏ మాత్రం ఆత్మస్థైర్యం కోల్పోకుండా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగి జగన్ మోహన్ రెడ్డి పార్టీపైన, ప్రభుత్వంపైన చాలా దూకుడుగా వ్యవహరించారు. కోట్లాది రూపాయాల కష్టార్జితాన్ని రైతులకు, ఆపదలలో ఉన్నవారికి పంచారు. పలుమార్లు పవన్ కళ్యాణ్ చేసిన పరుష పదజాలంపై, అనుసరిస్తున్న వైఖరిపై విమర్శలు వెల్లువెత్తాయి. కానీ ఆ విమర్శలకు భయపడిన దాఖలాలు మాత్రం ఎక్కడా కనిపించలేదు. పవన్ తాను చెప్పదలచుకునింది ముక్కుసూటిగా చెప్పడం, తాను అనుకున్నట్లు నడచుకోవడం జరిగింది. రాజకీయంగా పవన్ కళ్యాణ్ అమలు చేస్తున్న వ్యూహం రాజకీయ విశ్లేషకులకు పలురకాల అనుమానాలు రేకెత్తించింది. తద్వారా పవన్ నాయకత్వ పటిమపై, పార్టీ మనుగడపై సందిగ్ధత నెలకొనేటట్లు చేసింది. అదేసమయంలో అందరి అంచనాలు తలక్రిందులు చేస్తూ 2024 ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ చారిత్రాత్మక విజయాన్ని పొందడం గమనార్హం. ఆ ఎన్నికల్లో జనసేన పార్టీ నూటికి నూరు శాతం విజయాలు సాధించడం విశేషం. కూటమి కూడా 164స్థానాలతో అఖండ విజయాన్ని సాధించి రాష్ట్రంలో అధికారాన్నిచేపట్టింది. దీంతో జనసేనాని పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి పదవితో పాటూ రాష్ట్ర పంచాయితీ రాజ్, పర్యావరణ, ఆటవీశాఖామాత్యులుగా బాధ్యతలు చేపట్టారు. గతంలో నిర్వీర్యం అయిపోయిన తన ఆధీనంలోని శాఖలను పటిష్టపరచడంలో, బాధ్యతలు నెరవేర్చడంలో కొద్దికాలానికే పవన్ కళ్యాణ్ మంచి పేరు సంపాదించారని కచ్చితంగా చెప్పవచ్చు. అదే సమయంలో ఇటీవల కేంద్ర హోం శాఖామాత్యులు అమిత్‌షాను కలవడం పవన్ కళ్యాణ్‌కు ఇబ్బందికారంగామారింది. కేవలం మర్యాదపూర్వకంగానే అమిత్ షాను కలిసినట్లు జనసేనాని తెలియచేయడం జరిగింది. ఇదే ప్రజలలో పవన్ పై తీవ్ర అసంతృప్తి కలుగజేస్తూ ఉంది. ప్రధాని నరేంద్ర మోడీ తరువాత అమిత్ షా దేశంలోనే అత్యంత శక్తివంతమైన నేతగా మనుగడ సాగిస్తున్నారు. భారతీయ జనతా పార్టీ ట్రబుల్ షూటర్‌గా, యన్.డి.ఏకి కర్త, కర్మ, క్రియగా అమిత్‌షా వ్యవహరిస్తున్నారు. అటువంటి వ్యూహ కర్తను మర్యాదపూర్వకంగా కలిశానంటే ప్రజలు నమ్ముతారా? వాస్తవంగా పవన్ కళ్యాణ్‌కు ప్రధాని నరేంద్ర మోడీతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. కనుక మోడీని కలసి ఉంటే పవన్ ఏమి చెప్పినా ప్రజలు నమ్మేపరిస్థితి ఉండేది. పార్టీ, యన్.డి.ఏ వ్యవహారాలు ఒంటిచేత్తో నడిపే అమిత్ షాను మర్యాదపూర్వకంగా కలిశానని జనసేనాని చెప్పడాన్ని ప్రజలు ఏమాత్రం నమ్మడం లేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ



అంతర్గత విషయాలు మాట్లాడేందుకే అమిత్ షాను పవన్ కలసినట్లు ప్రజలు గట్టిగా విశ్వసిస్తున్నారు. ఈ పరిణామం ఏమాత్రం ఆక్షేపణీయం కాదు. కానీ రాష్ట్ర, ప్రజా ప్రయోజనాల కొరకు ఢిల్లీ వెళ్లి ప్రధాని నరేంద్ర మోడీతో చర్చించి కేంద్రప్రభుత్వం వద్ద అపరిష్కృతంగా ఉన్న విభజన చట్టంలోని హామీలకు, విశాఖ ఉక్కుకర్మాగారానికి మోక్షం ప్రసాదిస్తారని పవన్ కళ్యాణ్ పై ప్రజలు గంపెడు ఆశలు పెట్టుకొని ఉన్నారు. ప్రధాని నరేంద్ర మోడీకి పవన్ కళ్యాణ్ అత్యంత ఆత్మీయుడు కావడమే ప్రజల ఆశలకు కారణం. ప్రజాప్రయోజనాలు విస్మరించి స్వీయప్రయోజనాల కొరకు అమిత్‌షాను కలవడంతో ప్రజలు పవన్ కళ్యాణ్ పై పెట్టుకున్న ఆశలు అడియాసలు అయ్యాయనే చెప్పాలి. విశాఖ ఉక్కునుప్రైవేటు పరం కానివ్వకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయడం, రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ప్యాకేజీ విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావలసిన అంశాలన్నింటినీ సాధించుకోవలసిన బాధ్యత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపైఎంత ఉందో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, యన్.డి.ఏలోభాగస్వామి, ప్రధాని నరేంద్రమోడీకి సన్నిహితులైన జనసేనాని పవన్ కళ్యాణ్‌పై అంతే ఉందనేది నిర్వివాద అంశం. ఆది నుంచి కేంద్రాన్ని ప్రశ్నించడంలో పవన్ ఆచితూచి వ్యవహరిస్తున్నారు. గతంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదాకు బదులుగా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించినప్పుడు మాత్రం పాచిపోయిన లడ్డూలు ఇచ్చారంటూ చాలా సున్నితంగా కేంద్రాన్ని పవన్ కళ్యాణ్ విమర్శించారు. తరువాత కొద్దికాలానికే యన్.డి.ఏ కూటమిలో భాగస్వామిగా చేరి దక్షిణాదిన కూటమికి, ప్రధానికి ముఖ్యమైన నేతగా జనసేనాని మారారు. కేంద్రప్రభుత్వంలో, నరేంద్ర మోడీ వద్ద బలమైన పలుకుబడి కలిగిన జనసేనాని రాష్ట్ర ప్రజా ప్రయోజనాల గురించి, రాష్ట్రానికి సంబంధించిన విభజన చట్టంలోని హామీల గురించి ప్రధానిని ఎందుకు ఆడగడంలేదో ప్రజలకు అర్థం కావడం లేదు. ప్రశ్నించే దానికే రాజకీయాలలోకి వచ్చానంటూ పవన్ కళ్యాణ్ ప్రతినిత్యం చెపుతూ ఉంటారు. అందరి రాజకీయ నాయకులను చూసినట్లు కాకుండా పవన్ కళ్యాణ్‌ను ప్రత్యేకత కలిగిన నేతగా ప్రజలు గుర్తిస్తున్నారనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇటీవల పోలీసు అధికారులు, సహచర హోం శాఖామాత్యుల విధినిర్వహణలోని అలసత్వంపైపవన్ కళ్యాణ్ ఘాటుగా స్పందించారు. ప్రభుత్వంలో నెంబర్ 2 స్థానంలో ఉండి ప్రభుత్వంలో భాగస్వాములైన సహచర మంత్రిని, పోలీసు అధికారులను ప్రశ్నించినప్పుడు 5కోట్ల ఆంధ్రుల ప్రయోజనాల కొరకు కేంద్రప్రభుత్వాన్ని ప్రశ్నించాలి కదా ? సుదీర్ఘ రాజకీయ, పాలనా అనుభవం కలిగిన నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండగా పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రయోజనాల కొరకుప్రధానిని కలవడం సబబు కాదు అనుకునేదానికి కూడా వీలులేదు. ఇటీవలిసాధారణ ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు, నరేంద్ర మోడీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉండేది. వారిద్దరి మధ్య సఖ్యత కుదిర్చి చంద్రబాబును యన్.డి.ఏలో భాగస్వామిగా చేసి ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి, జనసేన, బిజెపిల కూటమి అధికారంలోకి రావడంలో ప్రముఖ పాత్ర పవన్ కళ్యాణ్ దే అనే విషయం జగమెరిగిన సత్యం. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి సాధించిన 21పార్లమెంటు స్థానాలు ప్రస్తుత మోడీ ప్రభుత్వమనుగడకు చాలాకీలకం అనేదికూడా అక్షర సత్యం. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో చంద్రబాబు నాయుడు ఏమాత్రం పంతాలు, పట్టింపులకు పోకుండా అవసరమైతే ఒక మెట్టుదిగైనా వచ్చేఅవకాశం ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రయోజనాల కొరకు పలుమార్లు ఢిల్లీకి వెళ్లి ప్రధానిని కలిశారు. దానికి ప్రతిఫలంగా బడ్జెట్‌లో మాత్రం గణాంకాలపరంగా ఘనంగా కేటాయింపులు జరిగాయి. కానీ వాటిలో ఇప్పటివరకు ఒక్కటీ కార్యరూపం దాల్చకపోవడంతోపాటూ కనీసంవాటిపై స్పష్టత కూడా రావడంలేదు. గతంలో అధికారంలో ఉన్న పార్టీలు అఖిలపక్ష పార్టీలతో తరచుగా సమావేశాలు నిర్వహించి రాష్ట్రానికి సంబంధించిన జటిలమైన విషయాలలో వారి సలహాలు తీసుకునేవి. ఇటీవలికాలంలో ఆ సంస్కృతి కను మరగైంది. అదేసంస్కృతిని ఆదర్శంగా తీసుకుని ఎటువంటి బేషజాలాలకు పోకుండా ప్రజలు తనపై పెట్టుకున్న ఆశలకు అనుగుణంగా ముఖ్యమంత్రితోపాటు సంబంధిత సహచర మంత్రులను సమన్వయం చేసుకుని ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడితెచ్చి కేంద్రప్రభుత్వం ద్వారా రాష్ట్రానికి రావలసిన అంశాలన్నిటినీ సాధించాల్సిన బాధ్యత పవన్‌కళ్యాణ్ పై కూడా అత్యధికంగా ఉందనేది నిర్వివాదాంశం. ●

# ఢిల్లీ కాలుష్యానికి అంటుకున్న రాజకీయ బురద

డా : బుర్ర మధుసూదన్ రెడ్డి

కాలుష్యం ఓ ప్రమాదకర భూతం. మానవ సమగ్రాభివృద్ధితోపాటు కాలుష్యం కూడా ప్రమాదకరంగా విస్తరిస్తున్నది. కాలుష్యానికి కారణంగా ఆధునిక మానవుడు నిలుస్తున్నాడు. మానవ తప్పిదమే కాలుష్యం పెరగడం రేపటి తరానికి శాపంగా మారుతున్నది. పల్లెల నుంచి పట్టణాలవరకు కాలుష్య కోరలు బుసకొడుతున్నాయి. కాలుష్యం అంతటా ఉన్నప్పటికీ మహానగరాల కాలుష్య పరిస్థితులు ప్రాణాంతక స్థాయికి చేరడం ఓ హెచ్చరికగా తీసుకోవాలి. ఢిల్లీ, ముంబాయి లాంటి మహానగరాల్లో కాలుష్య పరిమితులు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయని, తగు జాగ్రత్తలను పాటించని యెడల నగరవాసులు నరకం చూడనున్నారని భావించాలి. మానవాళితో పాటు సకల జీవకోటిని ప్రభావితం చేయగల కాలుష్యానికి అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వాలు పథకరచన చేస్తుంటాయి. ఏ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కాలుష్యం పెరగాలని భావించవు, ప్రోత్సహించవు. అయినా నేడు దేశ రాజధానిలో కాలుష్యం పట్ల రాజకీయ నాయకుల ఆరోపణలు ఘాటుగా వినిపిస్తున్నాయి. ఈ రాజకీయబురద చల్లుకోవడం ఢిల్లీ సిఎమ్ ప్రారంభించింది. రాజధాని ఢిల్లీ మహానగరంలో కాలుష్యం విపరీతంగా పెరగడానికి బిజెపి పాలిత రాష్ట్రాలే కారణమని ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి తెలుపడం కొంత విస్మయాన్ని కలుగజేస్తున్నది. బిజెపిపాలిత హర్యానా, యూపీ రాష్ట్రాలకు చెందిన రైతులు తమ వ్యవసాయ వ్యర్థాలను విచక్షణారహితంగా, పెద్ద ఎత్తున కాల్చడంతో రాజధానిలో కాలుష్యం పలు రెట్లు పెరిగిందని ఆమె అన్నారు. అదే విధంగా ఆప్ పార్టీ పాలిత పంజాబ్‌లో వ్యర్థాల కాల్చివేత గణనీయంగా తగ్గిందని కూడా పేర్కొ నడం విశేషం. ఢిల్లీ



కాలుష్యం విషయంలో అతిషి చేసిన ఆరోపణలు అర్థరహితంగా ఉన్నాయని బిజెపి నాయకులు ఖండించడం కూడా జరిగిపోయింది. ఈ విధంగా రెండు పార్టీలు ఒకరి మీద మరొకరు కాలుష్య ఆరోపణల బురద చల్లుకోవడం సమంజసంగా లేదని, కాలుష్యాన్ని తగించడా నికి పార్టీలకు అతీతంగా నడుం బిగించాల్సింది పోయి ఇలా ఆరోపణలు చేసుకోవడం శుభ పరిణామం కాదని పౌర సమాజం విస్తుపోతున్నది. నేడు ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ టెర్రిటరీలో కాలుష్యం అనుమతులకు మించి మూడు రెట్లు పెరిగిందనే ప్రమాదకర విషయాలను బయట పెట్టడంతో నగరవాసులు భయంతో కంపించిపోతున్నారు. పిఎం 2.5 కాలుష్య స్థాయి 0నుంచి 60ఘనపు మీటరుకుమైక్రోగ్రామ్స్ ఉండాలని, కాని నగరంలోని నోయిడా, గుర్గావ్ లాంటి కొన్ని ప్రాంతాల్లో ప్రమాదకరంగా 125వరకు నమోదు అవుతున్న దని గమనించారు. ఢిల్లీలో గాలి కాలుష్యం పెరిగినప్పటికీ, వ్యవసాయ వ్యర్థాలను కాల్చివేయడం మాత్రం కొంత తగ్గినట్లు తెలుస్తున్నది. పంజాబ్‌లో వ్యర్థాల కాల్చివేత గణనీయంగా తగ్గినట్లు, యూపీలో మాత్రం గత ఏడాదితో పోల్చితే నేడు కొద్దిగా పెరిగిందని తెలుస్తున్నది. వ్యర్థాలకాల్చివేత కట్టడికి ప్రభుత్వాలు తీసుకుంటున్న పలు చర్యలతో (ఫైన్ విధించడం, తప్పు చేసిన వారిపై కేసులు పెట్టడంలాంటివి) మూడు రాష్ట్రాల్లో పిఎం 2.5తగ్గడం గమనించారు. 2024లో పంజాబ్, హర్యానాలతో పోల్చితే యూపీలో 1,581 వ్యర్థాల కాల్చివేతలు జరిగాయని తెలుస్తున్నది. రానున్న చలికాలంలో కాలుష్యం మరింత పెరిగే ప్రమాదం ఉన్నందున నేటి నుంచే కట్టడి చర్యలు తీసుకోవడం ప్రారంభించాలి. వ్యవసాయ వ్యర్థాలకాల్చివేతతో 10శాతం కాలుష్యం మాత్రమే జరుగుతున్నందున నగరంలో ఇతర కాలుష్య కారణాలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా తగుజాగ్రత్తలు/ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలు, పౌర సమాజం గుర్తుంచుకోవాలి. ●

# న్యాయ రక్షణలో తాత్సారమేల?

భాస్కర్ యలకంటి

న్యాయం ఆలస్యమౌతోందంటే న్యాయాన్ని తిరస్కరించడమేనని న్యాయకోవిదుల పరిభాష. దీన్నానరాగా చూస్తే అత్యున్నత న్యాయస్థానాలు నిర్దేశించిన 'కోర్టు ఆఫ్ రికార్డు'ను అనుసరించి న్యాయాన్ని అందించడంలో జరిగే తాత్సారాన్ని న్యాయాన్ని నిరాకరించడంగానే భావించాలి. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్1 నియామక ప్రక్రి యలో భాగంగా విడుదల చేసిన జీవో 29 విషయంలో జరిగిన రచ్చ అంతా ఇంత కాదు. నిరుద్యోగ యువత నిర సనలతో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకున్న కింది కోర్టులు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను సైతం పెడచెవిన పెడుతు న్నాయని అది "కోర్ట్ ఆఫ్ రికార్డ్'ను ముమ్మాటికి ఉల్లంఘిం చడమే అవుతుందని పలువురు రాజ్యాంగ నిపుణులు, న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల విషయంలో పైకోర్టు ఇచ్చిన పలు తీర్పులలో కిందికోర్టుల ద్వారా అమలుకు నోచుకోకపోవడం గమనార్హం. వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాం. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను 'కోర్ట్ ఆఫ్ రికార్డ్'గా పరిగణిస్తారు. దానికి వ్యతిరేకంగా కింది కోర్టులు తీర్పులు ఇవ్వరాదు. అయితే ఆచరణలో మాత్రం అది విరుద్ధంగా కనబడుతున్నది. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులు అమలుకు నోచుకోవడంలేదు. దీనికి అనేక దృష్టాంతాలు వెలుగులోకి వచ్చాయి. సామాజిక రిజర్వేషన్లకు చెందిన అభ్యర్థులు ఓపెన్ కోటాలో అవకాశం పొందిననూ వారిని రిజర్వేషన్ కేటగిరి కింద పరిగణించరా దని సౌరవ్ యాదవ్ కేసులో పేర్కొనగా, సామాజిక రిజర్వే షన్లను అన్ని స్టేజీలలో అమలు చేయాలని దీపేందర్ యాదవ్ కేసులో సుప్రీం కోర్టు తీర్పు వెలువరించింది. ఈ రెండు తీర్పులను విభేదిస్తూ తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన జీవో 29 అందుకు విరుద్ధంగా ఉన్ననూ, దానిపై తలెత్తిన వివాదానికి హైకోర్టు పరిష్కారం చూపకపోగా తాత్సారం చేస్తోందని సామాజికవేత్తలు, రాజ్యాంగ పండితులు గర్హిస్తున్నారు. ఇదిలా ఉండగా రాజేష్ కుమార్ దారియా కేసులో వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్ల విషయంలో విస్పష్టమైన తీర్పు వెలువడింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు మాత్రమే సామాజిక రిజర్వేషన్లు వర్తిస్తా యని, వాటిని వర్టికల్‌గా అమలు చేయాలని మిగిలిన రిజర్వేషన్లు అన్నీ ప్రత్యేక రిజర్వేషన్లుగా పరిగణిస్తూ వాటిని హారిజంటల్‌గా అమలు చేయాలని పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం హారిజంటల్



రిజర్వేషన్‌ను అమలు చేయకపోవడాన్ని సవాలు చేయగా సుమారు సంవత్సరకాలం పాటు వాద ప్రతివాదనలు జరిగాక మహిళలకు హారిజంటల్ రిజర్వేషన్లను వర్తింపజేశారు. కానీ వికలాంగుల కోటాకు, స్పోర్ట్స్ కోటాలకు కూడా వర్తింప చేయకపోగా వర్టికల్ విధానాన్నే అనుసరిస్తున్నారు. ఈవిషయాన్ని కూడా సవాలు చేస్తూ మరో పిటిషన్ దాఖలు అయ్యింది. ఇప్పటికీ సుమారు 8నెలలు గడుస్తున్నా ఇంత వరకు తీర్పు వెలువడలేదు. అంటే సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులకు దిక్కే లేకుండా పోయిందని న్యాయ నిపుణులు వాపోతున్నారు. ఇక 'మండల్' తీర్పుగా పరిగణించే ఇందిరా సహాని కేసులో సామాజిక రిజర్వేషన్లు 50 దాటకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చిన తమిళనాడు రిజర్వేషన్లకు తప్ప మిగతా వాటికి ఇది వర్తిస్తుంది. రాజ్యాంగ సవరణ చేసిన తర్వాత రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా మాత్రమే రిజర్వేషన్ల పెంపు చేయాలి. కానీ దానికి విరుద్ధంగా ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఒక జీవో ద్వారా ఎస్టీ రిజర్వేషన్లను ఆరు నుండి పదికి పెంచింది. దీన్ని సవాలు చేస్తూ హైకోర్టులో వేసిన పిటిషన్ సింగిల్ బెంచ్ నుండి డివిజనల్ బెంచ్‌కి, డివిజనల్ బెంచ్ నుండి సింగిల్ బెంచ్‌కి బదలీ అవుతూ ఊగిసలాడుతోందే తప్ప పరిష్కారానికి నోచుకోవట్లేదు. మరో పక్క ఉద్యోగ భర్తీ ప్రక్రియలో భాగంగా వివిధ రాష్ట్రాలు అమలు పరుస్తున్న రోస్టర్ విధానాలకు మార్గదర్శక సూత్రాలను సుప్రీం కోర్టు 1996 ఆర్కే సబర్వాల్ కేసులో వెలువరించింది. ఒక కేడర్‌కు చెందిన ఏదేని ఒక రిజర్వేషన్ కేటగిరీ 100 స్థాయి పొందితే ఆ తరువాత ఏర్పడ్డ ఖాళీలలో ఓపెన్/రిజర్వేషన్ కేటగిరిలను గుర్తించి సంబంధిత అభ్యర్థుల ద్వారా భర్తీ చేయాలి. ఉదాహరణకు ఒక కేడర్ స్ట్రెంత్ మొత్తం 200 పోస్టులు ఉన్నాయంటే ఎస్సీలకు 30(15 ), ఎస్టీలకు 12 (6), బీసీలలో అన్ని గ్రూపులకు కలిపి 58(29 ) వచ్చే వరకు రోస్టర్ విధానం అమలులో ఉంటుంది. ఆ తర్వాత కేడర్‌లో ఏర్పడ్డ ఖాళీలో ఏ స్థానాల్లో ఖాళీ ఏర్పడితే సంబంధిత ఓపెన్/ రిజర్వేషన్ అభ్యర్థులతో అంటే 'పోస్ట్ బేస్డ్ రిజర్వేషన్' విధానంలో భర్తీ చేయాలని స్పష్టంగా ఉన్నప్పటికీ దానికి విరుద్ధంగా ఏర్పడ్డ ఖాళీలను బట్టి రిజర్వేషన్ విధానం అంటే 100 పాయింట్స్ సైకిల్ రోస్టర్ ద్వారా "వేకెన్సీ బేస్డ్ రిజర్వేషన్"ను అమలు పరుస్తున్నారు. ఈ విధానాన్ని సరి చేయవలసి ఉంది. ఈ నేపథ్యంలో "కోర్ట్ ఆఫ్ రికార్డ్'ను గౌరవిస్తూ కింది కోర్టులు సకాలంలో తీర్పులు వెలువరిచి ఏకీకృత న్యాయ వ్యవస్థను కాపాడాలని రాజ్యాంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరి కోర్టులు ఎలా స్పందిస్తాయో చూడాలి. ●

# సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేసిన రాష్ట్ర బడ్జెట్

- ఎంపి మాగుంట



**ఒంగోలు టౌన్, నవంబర్ 12, (ప్రభాతవార్త**

రాష్ట్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేసిందని పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయని, వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఆర్థిక లోటు భర్తీ, సుపరిపాలన దిశగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

**ఎంపి చొరవతో అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు**

పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి చొరవ మేరకు గతిశక్తి పథకం క్రింద మంజూరైన ఒంగోలు ఎన్.అగ్రహారం రైల్వే గేట్ ఎల్సి నెం.207 వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం రైల్వే నిధులతో చేపట్టేందుకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అనుమతులు జారీ చేశారు. సదరు బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగింది.

# నేడు జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ సెలక్షన్స్

**ఒంగోలు టౌన్, నవంబర్ 12, (ప్రభాతవార్త**

జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ సెలక్షన్స్ బుధవారం భీమవరపు హైస్కూల్ నందు నిర్వహించబడునని జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రటరీ ఎండి హాజీరాబేగం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి అండర్ 14-17 బాలబాలికలకు జరిగే ఈ సెలక్షన్స్‌ను వ్యాయామ ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కావున విద్యార్థులు తమ డేట్ ఆఫ్ బర్త్, స్టడీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని కోరారు. ఈ సెక్షన్స్‌కు ఇంచార్జిలుగా స్వరూపారాణి, పి శ్రీనివాస్, పి కౌసల్యదేవిలు వ్యవహరిస్తారని తెలిపారు.

# పేస్‌లో లీగల్ రైట్స్ ఫర్ ఎవరీగర్ల్ అనే అంశంపై అవగాహన సదస్సు

**ఒంగోలు టౌన్, నవంబర్ 12, (ప్రభాతవార్త**



స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో లీగల్ రైట్స్ ఫర్ ఎవరీ గర్ల్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైకోర్టు, సుప్రీంకోర్టు అడ్వకేట్లు ఎంహెచ్ దీపలత, సిహెచ్ సురేష్‌బాబు పాల్గొన్నారు. సదస్సులో ఎంహెచ్ దీపలత మాట్లాడుతూ మహిళలు తమ జీవితంలో మెరుగైన స్థాయిని చేరుకోవడానికి చేరుకోవడానికి సమాజంలో అనేక ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కోవడానికి ధైర్యంగా అనేక అంశాలను అధిగమించడానికి మన రాజ్యాంగంలో ఉన్న మహిళా హక్కులను తెలుసుకోవాలన్నారు. మహిళా హక్కులు తెలుసుకోవడంతో పాటు వాటిని వినియోగించుకోవాలని తెలిపారు. అదే విధంగా సురేష్‌బాబు మాట్లాడుతూ ఎక్కడైనా ఎప్పుడైనా పరిస్థితులన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని తెలిపారు. కొంతమంది విద్యార్థులు తమ జీవితంలో జరిగిన అనుభవాలను పంచుకోవడం జరిగింది. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్స్‌పాల్ డాక్టర్ జివికె మూర్తి, అకాడమిక్ డీన్ డాక్టర్ సివి సుబ్బారావు, డీన్ కె రూప అక్కన్, అడ్మిషన్ డైరెక్టర్ ఆర్ వీరాంజనేయులు, ఏవో ఎం రమణబాబు, ఉమెన్ ఎంపవర్మెంట్ కన్వీనర్ వైష్ణవి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# సినీ నటి కస్తూరిని అరెస్ట్ చేయాలి: కృష్ణారావు డిమాండ్

**ఒంగోలు టౌన్, నవంబర్ 12, (ప్రభాతవార్త**



తెలుగు వారిని కించపరుస్తూ సినీ నటి కస్తూరి వ్యాఖ్యలపై ద్రావిడ దేశం అధ్యక్షులు వి.కృష్ణారావు ఆధ్వర్యంలో చెరువుకొమ్ముపాలెం సచివాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కస్తూరి ఇష్టారీతిన మాట్లాడారని, కరుణానిధి కుటుంబం లక్ష్యంగా అవాకులు చవాకులు పేలిన ఆమె వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. కరుణానిధి పూర్వీకులు చెరువుకొమ్ముపాలెం గ్రామస్తులు అయినా స్వశక్తితో రయయుతగా, మేధావిగా పేరు గడించారని, తమిళ ప్రజల ఆదరాభిమానాలతో సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా సేవలు అందించారన్నారు. తెలుగు సంఘాల నిరసనతో ఎగ్మోర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యాక కస్తూరి పత్తా లేకుండా పోయారని, ఎక్కడ ఉన్నా పట్టుకుని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం బంకా చిరంజీవి, ద్రావిడ జెఏసి గోపీకృష్ణ, కాటమరాజు ప్రొటెక్షన్ ఫౌండేషన్ రాజు యాదవ్, నాయిబ్రాహ్మణ సంఘ నేత డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 11న ఛలో పార్లమెంట్

- ఎల్ఐసిఏఓఐ వర్కింగ్ ప్రెసిడెంట్ మంజునాథ్

**ఒంగోలు టౌన్, నవంబర్ 12, (ప్రభాతవార్త**




ప్రజల సంస్థ ఎల్ఐసిని రక్షించుకునేందుకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 11న ఛలో పార్లమెంట్ నిర్వహిస్తున్నట్లు ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.మంజునాథ్ తెలిపారు. స్థానిక రెడ్‌క్రాస్ బిల్డింగ్‌లో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ- కేంద్ర ప్రభుత్వ, ఐఆర్‌డిఏ విధానాల వల్ల ఏజెంట్ల కమీషన్ తగ్గడం, పాలసీలపై ప్రీమియం, కనీస బీమా పెంపు, వయోపరిమితి కుదింపు, పాలసీ తీసుకునే వారి సంఖ్య తగ్గుముఖం నష్టదాయకమని, ఎల్ఐసి కార్పొరేట్‌లకు కట్టబెట్టే యత్నాలను తీవ్రంగా నిరసిస్తున్నామన్నారు. జోనల్ ప్రధాన కార్యదర్శి పిఎల్ నరసింహారావు మాట్లాడుతూ దశల వారీ ఉద్యమంలో భాగంగా అన్ని బ్రాంచ్‌ల వద్ద గేట్ మీటింగ్‌లు, డిసెంబర్ 10 దాకా డివిజనల్ ఆఫీస్ ముందు ధర్నాలు, డిసెంబర్ 20 నుండి కోటి సంతకాల సేకరణ, పార్లమెంట్ సభ్యులకు వినతి పత్రాల సమర్పణ, అంతిమంగా ఛలో పార్లమెంట్ అన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికిషోర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, రాష్ట్ర కోశాధికారి శ్రీనివాసరావు, నెల్లూరు డివిజన్ అధ్యక్షులు బెజవాడ శివయ్య, ప్రధాన కార్యదర్శి నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకట్రావు, కోశాధికారి ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర గ్రంధాలయ సంస్థ చైర్మన్ కోటేశ్వరరావును సన్మానించిన గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, నవంబర్ 12, (ప్రభాతవార్త**



రాష్ట్ర గ్రంధాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన గోనుగుంట్ల కోటేశ్వరరావుని మంగళవారం నరసరావుపేటలో దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ కడియాలవెంకటేశ్వరరావు, యువనేత డాక్టర్ కడియాల లలిత్ సాగర్ మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఆనాడు ఎన్టీఆర్, ఈనాడు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి అండగా ఉంటూ పార్టీ విజయానికి కృషి చేస్తూ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన కోటేశ్వరరావుకి నిన్న నామినేషన్ పదవుల నియామకంలో ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర గ్రంధాలయ సంస్థ చైర్మన్‌గా నియమించడం పట్ల వారు అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధికి, గ్రంధాలయాల పునర్ నిర్మాణానికి కోటేశ్వరరావు అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని గొట్టిపాటి లక్ష్మీ అభిప్రాయపడ్డారు. గోనుగుంట్ల కోటేశ్వరరావు రాష్ట్ర అభివృద్ధికి, దర్శి అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు.

# 29డివిజన్‌లో చురుకుగా టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

**ఒంగోలు, నవంబర్ 12, (ప్రభాతవార్త**



ఒంగోలు 29వ డివిజన్‌లో మంగళవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుకుగా జరిగింది. స్థానిక టిడిపి డివిజన్ అధ్యక్షులు పెద్దిశెట్టి వరలక్ష్మీ చంద్ర ఆధ్వర్యంలో జరుగుతున్న సభ్యత్వ నమోదు వరుసగా మూడు రోజులుగా సాగుతున్నాయి. సభ్యత్వ నమోదుకు డివిజన్‌లో విశేషస్పందన వస్తుందని వరలక్ష్మీతెలిపారు. కార్యకర్తలే పార్టీకి ప్రాణంగా పనిచేస్తున్న టిడిపిలో సభ్యత్వం తీసుకుని పార్టీలో చురుకుగా పనిచేయడానికి కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు లైఫ్‌ఇన్స్‌రెన్స్‌ను కల్పించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక **వార్త**

# సియం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన జిల్లా ఎమ్మెల్యేలు

**ఒంగోలు, (ప్రభాతవార్త**

రాష్ట్ర బడ్జెట్‌లో వెలుగొండ ప్రాజెక్ట్‌కు 394.50 కోట్లను కేటాయించినందున రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మంగళవారం జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి ధన్యవాదాలు తెలిపారు. సియంను కలిసిన వారిలో మంత్రులు గొట్టిపాటి, డోలా, ఎమ్మెల్యేలు దామచర్ల, ఏలూరి, కందుల, ఉగ్ర, ముత్తుముల, ఇంటూరి, నేతలు నూకసాని, ఎరిక్షన్‌బాబు, దివి శివరాం తదితరులు ఉన్నారు.



# పైసలుంటేనే దస్త్రం కదిలేది

**- సబ్ రిజిష్ట్రర్ కార్యాలయాల్లో హెచ్చుమీరిన అవినీతి**

**ఒంగోలు, (ప్రభాతవార్త**

రిజిస్ట్రార్ కార్యాలయాలు అవినీతికి అడ్డాగా మారాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మామూళ్లు ముట్టచెప్తే అలాంటి వివాదాలు ఉన్నా సరే.. లేదంటే అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా కొర్రీలు తప్పదన్న విమర్శలు మాములయ్యాయి. ఇప్పటికే పెరిగిన భూముల మార్కెట్ విలువలు, యూజర్ ఛార్జీలు, ఇతర ఛార్జీలతో రిజిస్ట్రేషన్ భారంగా మారిందని వాపోతున్న ప్రజలు ఈ అదనపు వసూళ్లతో అల్లాడిపోతున్నారు. అవినీతి బాగోతం కళ్లెదుటే జరుగుతున్నా ఉన్నాతాధికారుల ఫిర్యాదులు అందుతున్నా సంబంధిత శాఖలో చలనం కనిపించకపోవడం గమనార్హం. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం 17 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా వీటి పరిధిలో నిత్యం వంద నుండి 150 వరకు రిజిస్ట్రేషన్‌లు జరుగుతుండటాయి. ఒంగోలు, సంతనూతలపాడు, అమ్మనబ్రోలు, సింగరాయకొండ, కందుకూరు, దర్శి, పొదిలి, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, చీరాల, అద్దంకి, పర్చూరులో అత్యధికంగా ఉంటాయి. ఈ క్రమంలో కొందరు ప్రైవేటు సిబ్బందిని పెట్టుకుని మరి వసూళ్లకు పాల్పడుతుండటం పరిపాటిగా మారింది. వారసత్వంగా స్థలాల రిజిస్ట్రేషన్ల విషయంలో ఆధారాలు లేకపోతే ఒక రేటు, ఉంటే మరో రేటు వసూళ్లు చేస్తుండగా, ప్రతి డాక్యుమెంట్‌కు ఒక శాతం కమీషన్ అన్నది తప్పనిసరిగా మార్చేశారు. భూముల విలువలు భాగా ఉన్న కార్యాలయాల పరిధిలో అన్ని సక్రమంగా ఉన్నా ఎకరాకు లక్ష ముడుగు చెల్లించుకోవాల్సిందేనన్న




విమర్శలు నెలకొన్నాయి. కొన్ని సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఔట్ సోర్సింగ్ కింద పని చేస్తున్న సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కొందరు ఉద్యోగులు ఆ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులకు వచ్చే వారి వద్ద నుంచి పొలం డాక్యూమెంట్లు తీసుకుని మేము చేపిస్తామంటూ జిల్లాలో ఎక్కడైనా చేపిస్తామని చెప్పి వారి వద్ద నుండి భారీగా వసూళ్లు చేస్తున్నా కొందరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది కూడా ఉండటం గమనార్హం. ఆదాయం ఎక్కువ ఉండే కార్యాలయాల్లో పోస్టింగ్‌ల కోసం గట్టి పోటీనే ఉంది. డీపట్టా ప్రభుత్వ నిషేధ జాబితాలో ఉన్న వాటికి వేరే సర్వే నెంబరు వేసి డాక్యూమెంటు రిజిస్ట్రేషన్ చేయడానికి లక్షల్లో వసూళ్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఒంగోలులో పని చేస్తున్న ఒక్కరు గతంలో ఈ జిల్లాలోనే మరో కార్యాలయంలో పని చేస్తూ సస్పెండ్ అయ్యారు. ఇతనిపై ఎన్నో ఆరోపణలు రావడంతో నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారు. అది జరిగిన తరువాత రెండు సార్లు సదరు అధికారి గతంలో చేసిన పోస్టు కంటే ఎక్కువ ఆదాయం వచ్చే ప్రదేశానికి రావడం గమనార్హం. సుదూర ప్రాంతాలకు వీరిని నియమించకుండా దగ్గర దగ్గరే రిజిష్టర్ కార్యాలయాలకు బదిలీ చేయడం వల్ల వీరి అవినీతికి అడ్డు అదుపు లేకుండా పోయింది. కొందరైతే సస్పెండ్ అయితే ఆరు నెలలు ఉంటాం, తరువాత మరలా విధుల్లోకి వస్తామన్న తీరు కొందరిలో నెలకొని ఉంది. కొందరు రిజిస్ట్రేషన్ చేసుకునే వారు పొలాలు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వస్తే వాళ్లు అడిగినంత ఇవ్వడమే పరిపాటిగా మారింది. సబ్ రిజిష్టర్ కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తులు, డాక్యుమెంట్ రైటర్లదే హవా. వీరిలో కొందరు అక్రమ వసూలే పనిగా పెట్టుకుంటున్నారు. సైగల్‌తోనే వసూళ్ల నిర్ధారణ అవుతుంటాయి. ఎనివేర్ రిజిస్ట్రేషన్ సౌలభ్యాన్ని కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. మద్యవర్తులు కొంత కమీషన్ ముందే మాట్లాడుకుని వివాదస్పద ఆస్తులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నా పరిస్థితి. అలా వచ్చే సొమ్ములో వీరికి 80శాతం, వారికి 20 శాతం పంచుకుంటారని విమర్శలు ఉన్నాయి. కందుకూరులోని సబ్ రిజిష్ట్రార్ కార్యాలయంలో ఒక ప్రైవేటు వ్యక్తిదే పెత్తనం. ఆయనే నేరుగాకంప్యూటర్ ముందు కూర్చొని డాక్యుమెంట్లు పరిశీలించడం, దానికి అధికారి లాగిన్ ఐడీలను వినియోగించడం పలు విమర్శలకు, ఆరోపణలకు తావిస్తుంది.

# లింగ నిర్ధారణ చట్టరీత్యానేరం - కలెక్టర్

**ఒంగోలు, (ప్రభాతవార్త**



జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుకు పట్టిష్టమైన చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన లింగనిర్ధారణ చట్టం-1994 అమలుపై జిల్లాస్థాయి మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అధారిటీ సలహాకమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, అటువంటి పరీక్షలు చేసిన వారికి చేయించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టంచేశారు. డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలను ఎన్జివోల ప్రతినిధుల సమన్వయంతో సంబంధిత అధికారులు ముమ్మరం చేయాలన్నారు. ఈ చట్టం క్రింద అనుమతులు పొందిన స్కానింగ్ సెంటర్స్ ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహిస్తున్నారా లేదా తరచూ తనిఖీలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే అనుమతి పొందిన స్కానింగ్ సెంటర్స్ తిరిగి నిబంధనల ప్రకారం రెన్యువల్ చేసుకున్నారా లేదా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్కానింగ్ సెంటర్స్ అనుమతుల్లో భాగంగా ఈ సమావేశంలో 7 కొత్త దరఖాస్తులను, 2 రెన్యూవల్ దరఖాస్తులను ఆమోదించగా, 2 దరఖాస్తును తిరస్కరించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్ కుమార్, డాక్టం నాగార్జున, సిఐ ప్రభాకర్, ఎన్ జీవో సార్డ్స్ జిల్లా మేనేజర్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# చీమకుర్తి హరిహరక్షేత్రంలో ఘనంగా శ్రీ పార్వతి అమ్మవారి సారే సమర్పణ

- అమ్మవారికి సారె సమర్పించిన శిద్దా లక్ష్మీ పద్మావతి

**సంతనూతలపాడు, నవంబర్ 12, (ప్రభాతవార్త**



కార్తీక మాసం సందర్భంగా చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో జరిగిన శ్రీ పార్వతి అమ్మవారికి సారే సమర్పణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సతీమణి శిద్దా లక్ష్మీ పద్మావతి నేతృత్వంలో జరిగిన అమ్మవారికి సారే సమర్పణ పండుగలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మర్చిపోయిన మన హిందు పండుగ విశిష్టతనుసంప్రదాయాలను చాటి చెప్పారు. కార్తీక మాసం మంగళవారం సందర్భంగా చీమకుర్తి, దర్శి, మార్కాపురం, ఒంగోలు తదితర ప్రాంతాల నుండి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

**ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు:**



కార్తీక మాసం సందర్భంగా చీమకుర్తి శ్రీహరిహర క్షేత్రంలో మంగళవారం మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా లక్ష్మీ పద్మావతి దంపతులు క్షేత్రంలో వేంచేసి ఉన్న సర్వ దేవతలకు విశేష పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. శిద్దా లక్ష్మీ పద్మావతి, సువాసినిలతో కలిసి అమ్మవారికి పట్టు చీర, రవికె, గాజులు, పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలు విశేష రకాల పండ్లు, డ్రై ఫ్రూట్స్ 108 రకాల అమ్మవారి ప్రీతికరమైన పిండి వంటలతో అమ్మవారికి మహానైవేద్యం సమర్పించారు.

# రిలయన్స్ ఇండస్ట్రితో ఒప్పందం.. పామూరు మండలానికి మహర్ధశ

- నిమ్స్ పారిశ్రామిక కారిడార్‌లో పరిశ్రమలకు ఎమ్మెల్యే ఉగ్ర కృషి

**పామూరు, నవంబర్ 12, (ప్రభాతవార్త**

దశాబ్దాల కాలం నుండి నిమ్జ్ పారిశ్రామిక కారిడార్‌లో ఇండస్ట్రియల్ ఏర్పాటు గురించి ఊహాగాణాలకే ఈ ప్రాంత ప్రజలు పరిమితం అవుతుండగా తాజాగా మంగళవారం నాడు రిలయన్స్ ఇండస్ట్రిస్ సంస్థతో సీఎం చంద్రబాబుతో జరిగిన ఒప్పందంలో వివిధ శాఖల మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే ఉగ్రతో పాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు పాల్గొని చంద్రబాబునాయుడును అభినందించడం జరిగింది. దీంతో పామూరు మండలానికి మహర్ధ శపర్పడనున్నట్లు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాలకొండాపుం, బోడవాడ పరిసర ప్రాంతాల్లో గత 15 ఏళ్ల క్రితం నిమ్జ్ పారిశ్రామిక కారిడార్ కోసం స్థల సేకరణ చేయడం జరిగింది. అందులో భాగంగా 12 వేల ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని గుర్తించి కొంత భూమిని ప్రభుత్వానికి అప్పగించడం జరిగింది. గత పదేళ్ల నుంచి ఊరిస్తూ వస్తున్న కారిడార్ ఏర్పాటుతో ఈ ప్రాంతంలో భూమి దరలకు రెక్కలు రాగా సుదూర ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు ఇక్కడ భూములు కొనుగోలు చేసి పరిశ్రమల స్థాపన కోసం ఎదురు చూస్తున్నారు. కానీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పట్టువదలని విక్రమార్కుడిలా కనిగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే



అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్న తపనతో నిమ్జ్ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకోవడం జరిగింది. మొత్తం రిలయన్స్ ఇండస్ట్రి వారు 2 వేల ప్లాంట్లను దేశంలో పెట్టే యోచనలో ఉండగా అందులో 500 ప్లాంట్లు ఏపీలో పెట్టనున్నట్లు, మొదటి ప్లాంట్‌ను కనిగిరిలో అది కూడా పామూరు మండలంలో ఏర్పాటు చేసేందుకు ఒప్పందం జరిగినట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రాజధాని ప్రాంతంలో పర్యటించడం జరిగింది. ఇటీవల నిమ్జ్ ప్రాంతంలో డిఫెన్స్ కారిడార్ ఏర్పాటు చేసేందుకు రిటైర్డ్ కల్నర్ జయరావు బృందం పరిశీలన కూడా చేయడం జరిగింది. దీంతో ఈ ప్రాంతం సస్యశ్యామలం కావడమే కాక ఉపాధి అవకాశాలు లేక వలసలు వెళ్లిన వారు తిరిగి వచ్చే అవకాశం ఉంది. పామూరుకు 20 కిలోమీటర్ల దూరంలో బోడవాడ చుట్టు పక్కల ప్రాంతాలకు అమాంతం రెక్కలు వచ్చే అవకాశం ఉంది. బొట్లగూడూరు, పామూరు కలిసిపోయే అవకాశం ఉంది. నేషనల్ హైవే నాలుగు లైన్లుగా ఏర్పడటంతో రవాణాకు అనుకూలంగా ఉంటుందని చెప్పవచ్చు. అంతే కాక రామాయపట్నం పోర్టు దగ్గరలో ఉండటం వల్ల ఇక్కడి చేసిన ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసేందుకు అవకాశం కల్పిస్తుంది. ఈ ప్రాంతంలో లక్షలాది మందికి ఉపాధి అకవాశాలు కలగడమే కాక ఎంతో మంది ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎన్నికైన హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ నాగరాజు

**చీరాల టౌన్, నవంబర్ 12, (ప్రభాతవార్త**



ఈ నెల 15నుండి వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలో జరుగుతున్న అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు చీరాల టూటౌన్‌లో పని చేస్తున్న ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ నాగరాజు అథ్లెటిక్స్ సంబంధించి 40 సంవత్సరాలు పైబడిన విభాగంలో షాట్ ఫుట్, జావిలిన్ త్రోకి ఎంపిక అయ్యారు. ఈ అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలు ఈనెల 15 నుండి 17వరకు వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలో న్యూ కోచ్ బీహార్ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి పాల్గొని బహుమతులు గెలుచుకొని రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సహా ఉద్యోగులు మిత్రులు తదితరులు కోరుకుంటున్నారు.

# విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలు కూడా ముఖ్యం: జేసి

**ఒంగోలు, (ప్రభాతవార్త**






విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలు కూడా ఒక భాగం కావాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయంలో జరిగిన 17వ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఒక భాగం కావాలన్నారు. జీవితంలో క్రీడలు- నాయకత్వం, జవాబుదారీతనం, సహనం, ఆత్మవిశ్వాసం, జట్టు కృషి వంటి జీవన నైపుణ్యాలు నేర్పించడంలో ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా బోధనతో పాటు క్రీడా రంగానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. క్రీడలకు, క్రీడాకారులకు గొప్ప భవిష్యత్తు ఉందని, ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ఉద్యోగ నియామకాల్లో ఇస్తున్న రిజిస్ట్రేషన్‌ను రెండు నుంచి మూడు శాతానికి పెంచిందని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ నైపుణ్యం ఉన్న క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. ముందుగా జాయింట్ కలెక్టర్ శ్రీగోపాలకృష్ణ క్రీడా పతాకావిష్కరణ చేశారు. ఫ్లాగ్ మార్చ్ తిలకించి క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. పోటీలకు హాజరైన బాల బాలికల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన క్రీడా విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. క్రీడల్లో విశేష ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు సర్టిఫికేట్లె, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్, యుబీఐ మేనేజర్ ప్రసాద్ సాహు, స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ, ప్రిన్సిపాల్ మనీష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శివరాం, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సూర్య ప్రకాశరావు, కేంద్రీయ విద్యాలయం అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పీవర్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



**సింగరాయకొండ, నవంబర్ 12, ప్రభాతవార్త**
ఇంటింటా పీవర్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవర్ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించి ,జ్వర పీడితులను వెంటనే గుర్తించి వారి రక్త నమూనాలను సేకరించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి మంగళవారం శుక్రవారం వెక్టార్ కంట్రోల్ కార్యక్రమం మరియు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి అందులో గుర్తించిన బ్రీడింగ్ ప్లేసెస్ చెత్తకుప్పలను వెక్యాటర్ హైజిన్ యాప్ నందు పొందుపరిచి పంచాయతీ కార్యదర్శుల దృష్టికి తీసుకొని వెళ్లి వెంటనే దోమలు లేకుండా క్లియర్ చేయవలెనని అన్నారు. ఇంటింటి లార్వా సర్వే నందు నీరు నిల్వ ఉన్న మూతలు లేని సంపులు టైర్లు కూలర్లు ,కొబ్బరి బోండాల యందు దోమ లార్వాలు నిలువ లేకుండా మూతలు ఉంచాలని అవగాహన కలిగించి దోమ లార్వాలను తొలగించాలని తెలియజేశారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా ప్రభలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చైతన్య కష్ణ, డాక్టర్ వంశీధర్, మలేరియా సబ్ యూనిట్ అధికారి సాగర్, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌ఆలీ, రాజమ్మ, ఏఎన్ఎంలు, సిహెచ్ఓలు, ఆశాకార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# 17 నుండి రబీ ఈ పంట నమోదు



**దొనకొండ ,నవంబర్ 12, ప్రభాతవార్త**
రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకి ఈ నెల17నుండి పంట నమోదు చేయ బోతున్నట్లు పంట బీమా ప్రీమియం చెల్లించాలని లక్ష్మీనారాయణ చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పెద్దన్న పాలెం ,గంగ దేవిపల్లి రైతు సేవా కేంద్రాలలో రైతులతో మాట్లాడుతూ వివరాలు తెలియజేశారు. వరి, మొక్కజొన్న, మినుములు ,పప్పుశనగ ,ఎండు మిరప సాగు చేసిన వారు సమీపంలోని మీ సేవా కేంద్రాలలో ప్రీమియం చెల్లించాలని కోరారు. మరిన్ని వివరాలకి రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకునికి సంప్రదించాలని కోరారు. బోరు ఉన్న రైతులకి సబ్సీడీపై డ్రిప్పు మరియు తుంపర సేద్య పరికరాలని సబ్సీడీపై ఇస్తున్నట్లు మైక్రో ఇరిగేషన్ అధికారికి కె.వెంకటేశ్వర్లు తెలియజేశారు. 5 ఎకరాలలోపు రైతులకి 90 శాతం,5 ఎకరాలకి పైన ఉన్న రైతులకి 70 శాతం రాయితీపై డ్రిప్పు 50 శాతం రాయితీతో స్ప్రింకర్లను ఇస్తున్నట్లు చెప్పారు. కావల్సిన రైతులు వివరాలని రైతు సేవా కేంద్రంలో ఇవ్వాలని సూచించారు. ఇరు గ్రామాల రైతులు ,గ్రామ వ్యవసాయ సహాయకులు వీణాకుమారి మరియు అరుణా దేవి పాల్గొన్నారు.

# భవితకేం ద్రాల ద్వారా దివ్యాంగులకు ఉజ్వల భవిష్యత్తు

## – మండల విద్యాశాఖ అధికారులు కోటేశ్వరరావు, దినేష్‌కుమార్‌లు



**అద్దంకి రూరల్ నవంబర్ 12 ప్రభాతవార్త**
భవితకేం ద్రాల ద్వారా దివ్యాంగులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మండల విద్యాశాఖ అధికారులు వేమరవపు కోటేశ్వరరావు, డి. దినేష కుమార్‌లు పేర్కొన్నారు. పిజియోథెరపిస్టు ఎం. ఇందిరాప్రియదర్శిని సహకారంతో దేవరపల్లి శ్రీధర్ బాబు వారి స్నేహితులు రు.12000ల విలువ గలిగిన బోధన, అభ్యసన వస్తువులను సంతమాగులూరు కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలోని ప్రత్యేక అవసరతలు కలిగిన చిన్నారుల కొరకు నిర్వహిస్తున్న భవిత కేంద్రానికి మండలవిద్యా శాఖ అదికారుల పర్యవేక్షణలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దాతలు సమకూర్చిన పరికరాలను సద్వినియోగం చేసుకుని భవిత చిన్నారుల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చి దిద్దాలని సూచించారు. ఈ కార క్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. అనురాధ ఉపాధ్యాయురాలు బాలి, ఐఈఆర్‌టీలుజి. పిలిప్‌రెడ్డి, బి. చంద్రశేఖర్, దివ్యాంగవిద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గ్రామాల సమగ్ర అభివృద్ధి ప్రణాళికల తయారుకై

## సర్పంచులు, ఎంపీటీసీలు , గ్రామ సచివాలయ సిబ్బందికి ఈ నెల 14న శిక్షణ

**అద్దంకి రూరల్ ,నవంబర్ 12 ,ప్రభాతవార్త**
గ్రామాల సమగ్ర అభివృద్ధి ప్రణాళికల తయారుకై సర్పంచులు, ఎంపీటీసీలు , గ్రామ సచివాలయ సిబ్బందికి ఈనెల 14న ఒక్కరోజు శిక్షణ కారక్రమం జరుప నున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ యస్. శివరామప్రసాద్ లెలిపారు. సంతమాగులూరు మడలంలోని 20 గ్రామ పంచాయితీలను రెండు బ్యాచ్‌లుగా ఉదయం 9.0 గంటలను నుండి మధ్యాహ్నం 1.0 గంటల వరకు అడవిపాలెం ,వెల్లలచెరువు, కామేపల్లి, పుట్టవారిపాలెం, ఏల్చూరు. మక్కెనవారిపాలెం, కొమ్మాలపాడు, కుందు ర్రు, మామిళ్ళపల్లి, .పరిటాలవారిపాలెం గ్రామాల వారికి, మధ్యాహ్నం 2.0 గంటలనుండి సాయంత్రం 6.0 గంటల వరకు సంతమాగులూరు, పాతమాగులూరు, పత్తేపురం, బండివారిపాలెం, కొప్పరం, సజ్జాపురం, మిన్నెకల్లు, తంగేడుమల్లి, నవలిపాలెం, గురిజేపల్లిగ్రామాల వారికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జరుప నున్నట్లు ఆయన తెలిపారు.

# ఈ నెల 14 నుండి 20 వరకు గ్రంధాలయ వారత్స వాలు

**అద్దంకి రూరల్ ,నవంబర్ 12, ప్రభాతవార్త**
ఈనెల 14 నుండి 20 వరకు గ్రంధాలయ వారత్స వాలు నిర్వహించనున్నట్లు సంతమాగులూరు శాఖ గ్రంధాలయ పాలకుడు బాదం విజయ భాస్కరరెడ్డి తలిపారు. ఇందులో భాగంగా వారంరజుల పాటు ప్రతిరోజు వివిధ కార్యక్రమాలు నిర్వహించి అందులో చివరి రోజు విజేతలకు బహుమతి ప్రధానం చేయడం జరుగుతుందన్నారు.

# పొలం పిలుస్తుంది కార్యక్రమం



**అద్దంకి రూరల్ ,నవంబర్ 12, ప్రభాతవార్త**
సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు, మామిళ్ళపల్లి గ్రామాలలో మంగళవారం మండల వ్యవసాయాధికారిని లావణ్య ఆధ్వర్యంలో పొల పింపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలో రైతులకు అవగాన ఆర్యక్షణం నిర్వహించ అనంతరం పంటల వద్దకు తీసుకువెళ్లి మిర్చి పంటలపై రైతులు తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు సమగ్ర వ్యవసాయం తదితర పరిస్తితులను వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# స్థానిక ప్రజాప్రతినిధులకు శిక్షణా కార్యక్రమం

**బల్లికురవ, నవంబర్ 12, ప్రభాతవార్త**
మండలంలోని అందరూ గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఈనెల15వ తేదీ స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీఓ కుసుమ కుమారి అన్నారు. మంగళవారం ఆమె ఈ మేరకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. మండల అభివృద్ధిపై కార్యచరణ ప్రణాళిక రూపొందించడం, అదే విధంగా గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక రూపొందించడం తదితర అంశాలపై ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. రెండు విడతలుగా జరిగే ఈ కార్యక్రమంలో మండలంలోని 21 గ్రామ పంచాయతీలకు చెందిన అందరూ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు విధిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాప్రతినిధులందరూ ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యే విధంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

# బల్లికురవలో భారీ వర్షం



**బల్లికురవ, నవంబర్ 12, ప్రభాతవార్త**
అల్పపీడన ద్రోణి ప్రభావంతో మంగళవారం సాయంత్రం బల్లికురవలో భారీ వర్షం కురిసింది. 5గంటల నుండి 6గంటల వరకు భారీ వర్షపు జల్లులు కురుస్తూనే ఉన్నాయి. ఈ వర్షం వల్ల మిర్చి, పత్తి, కంది, పైర్లకు ఊరట లభించిందని రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సమస్యల సత్వర పరిష్కారానికి పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమం

## – చీరాల ఆర్‌డిఓ చంద్రశేఖర్ నాయుడు



**కొరిశపాడు , నవంబరు 12 , ప్రభాతవార్త**
ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పిజిఆర్ఎస్ కార్యక్రమం ప్రారంభించిందని చీరాల ఆర్‌డిఓ తుమాటి చంద్రశేఖర్ నాయుడు తెలియజేశారు. మంగళవారం కొరిశపాడు మండల కేంద్రం ఎంపిడిఓ సమావేశ హాలులో ప్రత్యేక గ్రీవెన్స్ డేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం చీరాల ఆర్‌డిఓ కార్యాలయంలో, కలెక్టరేట్, మండల కేంద్రాలలో గ్రీవెన్స్ డేను నిర్వహిస్తుమన్నారు. సిబ్బందిని ఉద్దేశించి గ్రీవెన్స్‌డేలో వచ్చిన అర్జీలను గడువు మేరకుండా ఏడు, ఎనిమిది రోజులలో పరిష్కరించాలని సూచించారు. సిబ్బంది ప్రజల నుంచి వచ్చే ఆర్జీలను గడువులోగా పరిష్కరించకపోవడం వలన కొన్ని గ్రీవెన్స్‌డే అర్జీలను రిఓపెన్ చేయాల్సివస్తుందని అన్నారు. అధికారులు గ్రీవెన్స్ డే అర్జీలపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని ఇండస్ట్రీయల్ రాష్ట్రంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక శ్రద్ధ చేపుతుందన్నారు. కనుక గ్రామాలలోని రెవెన్యు సిబ్బంది, పంచాయతీ సిబ్బంది గ్రామాలలో ఇండస్ట్రీయల్ అభివృద్ధికై వున్న ప్రభుత్వ స్ధలాలను గుర్తించాలన్నారు. అంతేకాక రాష్ట్రీయ జాతీయ రహదారులలో ఆనుకొని గ్రామాలలో ఎక్కడైనా 30 సెంట్లు స్థలం వివాదం లేని ప్రభుత్వ భూమి ఉంటే ప్రభుత్వ పెట్రోల్ బంకులను ఏర్పాటు చేస్తుందన్నారు. గ్రామాలలో ఆక్రమ లేవుట్లను గుర్తించి, వారి చేత ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా లేవుట్ల్ ను పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యు సిబ్బంది దృష్టిసారించాలన్నారు. ఈ కార క్రమం ప్రజల సమస్యల పరిష్కారానికై ఏర్పాటు చేశామని వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కొరిశపాడు తహశీల్దార్ జివి సుబ్బారెడ్డి, ఎంపిడిఓ రాజ్యలక్ష్మి, రీసర్వే డిటి రవికాంత్, డిటి మెహతాజ్, ఎలక్ట్రికల్ ఎఇ శ్రీనివాసరావు, హౌసింగ్ ఎఈ నటరాజులతోపాటు అన్నీ గ్రామాల విఆర్ఒలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# రోటరీ ఆధ్వర్యంలో ఘనంగా బివికె జన్మదిన వేడుకలు

## – బధిరుల పాఠశాలలో అన్నదాన కార్యక్రమం



**అద్దంకి , నవంబరు 12 , ప్రభాతవార్త**
రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో సీనియర్ రోటేరియన్, పట్టణ ప్రముఖులు బిజ్జం వెంకట కృష్ణారెడ్డి 55వ పుట్టిన రోజు సందర్భంగా చైతన్య బదిరుల పాఠశాలలోని విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దైవస్వరూపులైన విభిన్న ప్రతిభావంతులైన పేద విద్యార్థులమధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం ఎంతో ప్రశంసనీయమని, కృష్ణారెడ్డి వ్యాపార రంగంతోపాటు సేవా రంగంలో కూడ ముందుంటారని పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుదాకర్, ట్రెజరర్ మాలాది శ్రీనివాసరావు, డాక్టర్ ఉబ్బా దేవపాలన, సందిరెడ్డి శ్రీనివాసరావు, ఊటుకూరి రామకోటేశ్వరరావు, ఎ.జి.పి. వై. రమేష్‌బాబు, కొల్లి సురేంద్రబాబు, కూకట్ల సుబ్బారావు, లేవి ప్రసాద్, సురేంద్ర, ప్రిన్సిపాల్ ఆరోగ్యం, కోల్లా భువనేశ్వరి, అంజాద్ బాషా, తదితరులు పాల్గొన్నారు. అనంతరం రోటరీ వారు కృష్ణారెడ్డి చేత బర్తడే కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో సత్కరించారు.

# వరిలో సుడి దోమ పట్ల రైతులు అప్రమత్తంగా వుండాలి

## – ఎఓ వెంకటకృష్ణ



**అద్దంకి , నవంబరు 12 ,ప్రభాతవార్త**
వరిలో సుడిదోమపట్ల రైతులు అప్రమత్తంగావుండాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ సూచించారు. మంగళవారంధర్మవరం, శంఖవరప్పాడు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి మాట్లాడుతూ వరిలో ప్రస్తుతం సుడి దోమ అక్కడక్కడ కనిపిస్తుందని ,ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు కూడా దీనికి అనుకూలంగా వుందన్నారు. దుబ్బుకు ఈనిక దశలో 20 నుండి 25 దోమలు గమనించినప్పుడు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వేపనూనె 1500పిపిఎం లీటరు నీటికి 5 ఎంఎల్ కలిపి పిచికారి చేసుకోవాలి లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.5ఎంఎల్ లీటరు నీటికి, లేదా ఎథిప్రోల్ 0.25 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని ఆయన సూచించారు. రబీ ఈ పంట నమోదు 17వ తేది నుండి మొదలవుతుందని సాగుచేసిన రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార య్రక్రమంలో వ్యవసాయ సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 57వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు

**అద్దంకి , నవంబరు 12 , ప్రభాతవార్త**
57వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు పురస్కరించుకొని అద్దంకి శాఖా గ్రంధాలయం నందు నిర్వహించనున్నట్లు గ్రంధపాలకుడు చుండూరి సుగుణరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుండి 20 తేది వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ వారోత్సవాలలో అద్దంకి పట్టణంలోని అన్నీ స్కూల్ విద్యార్ధినీ విద్యార్థులు, గ్రంధపాఠకులు, మరియు పుస్తక ప్రేమికులు పాల్గొన్ని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సుగుణరావు కోరారు.

# మల్లాయపాలెం, నక్కబొక్కలపాడులో పొలం పిలుస్తోంది



**బల్లికురవ, నవంబర్ 12, ప్రభాతవార్త**
మండలంలోని నక్కబొక్కలపాడు, మళ్ళాయపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారి కుమారి మొక్కజొన్న, శనగ పంటలలో యాజమాన్య పద్దతులు, సస్యరక్షణ గురించి వివరించారు. అదే విధంగా కాంప్లెక్స్ ఎరువులు పై పాటుగా వేయడం వలన ఖర్చు పెరగడమే తప్ప ప్రయోజనం ఉండదని వివరించారు. కాంప్లెక్స్ ఎరువుల బదులు సూటి ఎరువులు వాడుకోవాలన్నారు. జింక్ ధాతు లోపం రాకుండా దుక్కిలో 20 కిలోల జింక్ సల్ఫేట్ వాడుకోవాలన్నారు. కంది కల్లె దశకు వచ్చిందని, ఈ సమయంలో మారుక మచ్చల పురుగు ఆశించి నష్టం కలిగిస్తుందని, అప్రమత్తంగా ఉండి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. పొగాకు ఆరోగ్యానికి హానీకరం కావున సాగు విస్తీర్ణం తగ్గించుకుని అపరాలు, మొక్కజొన్న సాగు చేసుకోవాలని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన ద్వారా రబీ పంటలకు భీమా చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నక్కబొక్కలపాడు సర్పంచ్ దూళిపాళ్ళ రామయ్య, దూళిపాళ్ళ హనుమంతరావు, దర్శి రామస్వామి, వ్యవసాయ సహాయకులు లక్ష్మణ్, సుభాని, పశు సంవర్ధక సహాయకులు పున్నారావు, నరేంద్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా అపరాలు సాగు చేసుకోవాలి



**హనుమంతునిపాడు, నవంబర్ 12, ప్రభాతవార్త**
పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా అపరాలు సాగు చేయాలని కనిగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు ఈవీ రమణ అన్నారు. మంగళవారం మండలంలోని సీతారాంపురం, లింగంగుంట్ల గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి కేవీ రమణ ఆధ్వర్యంలో పొగాకు సాగు చేసే రైతులతో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా కనిగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు ఇవి రమణ పాల్గొని మాట్లాడుతూ పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా అపరాలు సాగు చేయాలని, పొగాకు పంట వలన ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులు దెబ్బతింటాయని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలైన మినుము, అలసంద సాగు తగ్గించుకుని రైతులు లాభపడవచ్చని తెలిపారు. అలాగే ఎరువులు, పురుగు మందులు తగ్గించుకుని నేల, వాతావరణ కాలుష్యాన్ని అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి జే.అశోక్, ఉప స్పంచ్ ఎస్‌కే మహబూబ్‌భాషా, బూత్ కన్వీనర్ అంద్ర కనకరాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు నవ్య తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండ్ సెంటర్లో మూత్రశాలలు ఏర్పాటు చేయాలి

**కొనకనమిట్ల, నవంబర్ 12, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన కొనకనమిట్ల బస్టాండ్ సెంటర్లో మూత్రశాలలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రతినిత్యం ఒంగోలు, కనిగిరి, మార్కాపురం, శ్రీశైలం, కర్నూలు, హైదరాబాద్ ఆపై ప్రాంతాలకు నిత్యం ఇక్కడి నుండి ప్రయాణిస్తుంటారు. బస్సు దిగిన, బస్సు కోసం వేచి ఉండే ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు మూత్రశాలలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి బస్టాండ్ సెంటర్లో మూత్రశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రయాణికులు అభ్యర్థిస్తున్నారు.

# చెన్నకేశవుని పుష్కరిణిని సందర్శించిన సబ్ కలెక్టర్



**మార్కాపురం, నవంబర్ 12, ప్రభాతవార్త**
కార్తీక మాసంలో వచ్చే చిలుకు ద్వాదశి సందర్భంగా నిర్వహించే తెప్పోత్సవ కార్యక్రమానికి పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి పుష్కరిణి సిద్ధమైంది. బుధవారం తెప్పోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ పుష్కరిణిని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, భద్రతా బందోబస్తు గురించి అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమీషనర్ నారాయణరావు, సీఐ పి.సుబ్బారావు, ఎస్సై సైదుబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అధికారుల అనుమతి లేకుండానే బ్రాందీ షాపుకు కరెంటు స్తంభాలు

## – సొంతగా లైన్ బిగించుకున్నారు



**పెద్దదోర్నాల, నవంబర్ 12, ప్రభాతవార్త**
కరెంట్ మీటర్ పెట్టుకోవాలన్నా, కరెంటు స్తంభాలు ఏర్పాటు చేసుకోవాలన్నా ప్రభుత్వానికి చెల్లించాల్సిన డీడీలు చెల్లించి అనుమతి పొందాక విద్యుత్ సిబ్బంది వచ్చి ఏర్పాట్లు పూర్తి చేసి కరెంటు సరఫరా చేస్తారు. కానీ అటువంటి నిర్వాకం జరగకుండానే నిబంధనలు పాటించకుండా పెద్దదోర్నాలలోని ఓ బ్రాందీ షాపు నిర్వాహకులు ఎక్కడినుంచో స్తంభాలు తెచ్చుకొని కరెంటు లైన్ బిగించుకుని బ్రాందీ షాపుకు ఏర్పాట్లు సిద్ధం చేసుకుంటున్నారు. సమాచారం అందుకున్న పెద్దదోర్నాల కరెంటు ఏఈ హనుమానాయక్ కరెంట్ లైన్ పరిశీలించారు. ఈ విషయమై ఏఈ హనుమానాయక్‌ను వివరణగా కోరగా నిబంధనలు ఉల్లంఘించి తమకు తెలియకుండానే స్తంభాలు లైన్ బిగించుకున్నారని, చర్యల కోసం ఉన్నతాధికారులకు రిపోర్టు నివేదిస్తానని వివరించారు.

# ఈ నెల 14న జీపీడీపీపై శిక్షణ కార్యక్రమం

**హనుమంతునిపాడు, నవంబర్ 12, ప్రభాతవార్త**
మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నందు అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు (జీపీడీపీ) గ్రామ పంచాయతీ డవలప్‌మెంట్ ఫ్రోగ్రాంపై ఈ నెల 14 న శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ రంగ సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 14 వ తేదీ అన్ని గ్రామాల వారికి శిక్షణ కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6గంటల వరకు శిక్షణా కార్యక్రమాలు ఉంటాయని జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలని ఎంపీడీఓ తెలిపారు.

# వెలిగొండ ప్రాజెక్ట్‌కు మంత్రులు వచ్చి హడావుడి చేశారు

- రూ.4వే కోట్లు బడ్జెట్ అవసరం
- కనీసం రూ.2వేల కోట్లు ప్రకటిస్తారనుకుంటే.. ముష్టి రూ.394 కోట్లు ప్రకటించారు
- ఏమి సరిపోతాయి ఎప్పుడు పూర్తి చేస్తారు..?
- అసెంబ్లీ సమావేశాల్లో వెలుగొండ ప్రాజెక్ట ఎప్పుడు పూర్తి చేస్తారో ముఖ్యమంత్రి ప్రకటించాలి
- సీపీఎం కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు డిమాండ్



**పెద్దదోర్నాల, నవంబర్ 12, ప్రభాతవార్త**
ఇటీవల వెలిగొండ ప్రాజెక్టుకు మంత్రులు వచ్చి హడావుడి చేశారు. ఈ హడావుడి వెలిగొండ ప్రాజెక్టుకు దోహదపడుతుందను కుంటే నిరాశే ఎదురైంది. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.4వేల కోట్లు బడ్జెట్ అవసరం కాగా మొదటి దశ కింద కనీసం రూ.2వేల కోట్లు కేటాయిస్తారనుకుంటే కేవలం రూ.394 కోట్లు ముష్టి వేసినట్లు వెలిగొండ ప్రాజెక్టుకు కేటాయించడం అన్యాయమని సీపీఎం కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. పెద్దదోర్నాల మండలం కొత్తూరు వద్ద వెలిగొండ ప్రాజెక్ట మొదటి రెండు సొరంగాలను మంగళవారం సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులతో పాటు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి హనీఫ్, జిల్లా కమిటీ సభ్యుడు జీవీ కొండారెడ్డి, నూకని వెంకటరమణలతో కలిసి వెలిగొండ ప్రాజెక్టును పర్యటించారు. ప్రాజెక్టుకు సంబంధించి క్షేత్ర స్థాయి సమస్యలు గుర్తించారు. ఈ సందర్భంగా సీపీఎం కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున వెలిగొండ ప్రాజెక్ట ఎప్పుడు పూర్తి చేస్తారో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల వెలిగొండ ప్రాజెక్టును సందర్శించిన మంత్రుల హడావుడిని చూసి ప్రజలు వెలిగొండ ప్రాజెక్ట సాకారం అవుతుందిలే అన్న భ్రమ కలిగించారని తీర చూస్తే బడ్జెట్‌లో కేవలం రూ.394 కోట్లు కేటాయించడం ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. ఈ రెండు టన్నెల్స్ ముందు నిలిచి చూస్తుంటే అనాధ పరిస్థితిని పోలి ధమనీయంగా ఉందన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు ఉపయోగపడి ఊరట కలిగించే ఇటువంటి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయడం అన్యాయమన్నారు. 2004లో చేపట్టిన ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి మూడు దశాబ్దాలు కావస్తుందని, ఈ ప్రభుత్వాలు చిత్తశుద్ధి ఎంత ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చన్నారు. మొదటి టన్నెల్‌లో మిగిలి ఉన్న పనులు పూర్తి చేసి రిజర్వాయర్‌కు నీళ్ల ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆ తర్వాత రెండో టన్నెల్ పనులు కూడా చేపట్టి పనులు చేయాలని ఎన్నాళ్లు చేకూరి పక్షుల్లాగా ఎదురు చూసి ఆఖరికి కోల్పోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం అంటున్నారు. ఆ ప్రాంతంలో ఎలాగు నీటి వనరులు ఉన్నాయి. కేంద్రం నిధులు ఇస్తానంటుంది, వెనుకబడిన వెలిగొండ ప్రాజెక్ట తక్కువ ఖర్చుతో కూడుకొని ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జోక్యం చేసుకుని వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వెలిగొండ ప్రాజెక్ట చేపట్టిన రెండేళ్లకే ఫీడర్ కెనాల్, రిజర్వాయర్ పనులు పూర్తి కొన్నారని, ఇక 20 ఏళ్ల నుండి వెలిగొండ ప్రాజెక్ట పనులు ప్రభుత్వాలు నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచాయన్నారు. హెడ్ రెగ్యులేటర్ వర్క్ కూడా పూర్తి చేసుకుని ఉన్నాయి. నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించి వారిని పునరావాస కేంద్రాలకు తరలించి మొదటి టన్నెల్ ద్వారా నీళ్ల ఇవ్వవచ్చని అన్నారు. వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి కూడా వెలిగొండ ప్రాజెక్ట వృధాగా పడి ఉందన్నారు. ప్రాజెక్ట ఆలస్యమైనందుకు ప్రస్తుతం ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, దీంతో ప్రాజెక్ట వ్యయం కూడా పెరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంత పకడ్బందీగా ఉండాలంటారు. కానీ ప్రాజెక్ట గురించి వివరాలు తెలుసుకుని ముందు సాగాలి. ఈ ప్రాజెక్ట తీరు ఇంటి ముందు కసువు ఊడ్చి ఇంటి వెనుక వేసినట్లుగా ఉందని పోల్చారు. పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి శ్వేతపత్రం విడుదల చేశారు. ఏ ప్రభుత్వం ఎంత వృధాగా దండగ ఖర్చు పెట్టిందో వివరించారు. అంతకంటే ఎక్కువ వెలిగొండ ప్రాజెక్టుకు దండగ ఖర్చు పెట్టారని వివరించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నతాధికారులతో కమిటీ వేసి ఎక్కడెక్కడ లోపాలు జరిగాయి. ఎంత దుర్వినియోగం అయింది. ఎంత త్వరగా పూర్తి చేస్తామో తెలుసుకోవాలని కోరారు. అది వీలుపడకపోతే తమనైన సర్వే చేయమంటే సర్వే చేసి రిపోర్టు అందిస్తామని ప్రజల పక్షాన ఉండటానికి సిద్ధమన్నారు. కాలయాపన చేస్తే రైతులతో తాము ఉద్యమిస్తామని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు హెచ్చరించారు.

# పొగాకు పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగుపై రైతులకు అవగాహన



**సంతనూతలపాడు, నవంబర్ 12, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలంలోని బొడ్డువారిపాలెం, పి.తక్కెళ్ళపాడు, ఎం.వేములపాడు గ్రామాల్లో పొగాకు పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు చేయుటకై రైతులకు గ్రామ స్థాయిలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి పి.పావని రైతులతో మాట్లాడుతూ పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా శనగ, కంది, మినుము, పెసర, అలసంద, సజ్జ, జొన్న, మొక్కజొన్న, కొర్రపంటలను సాగు చేసినట్లయితే తక్కువ పెట్టుబడితో అధిక లాభం పొందవచ్చనని అంతే కాకుండా పొగాకు మార్కెట్ ధరల స్థిరంగా లేకపోవడం వలన రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. అనంతరం బొడ్డువారిపాలెం, ఎం.వేములపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రాయితీపై శనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కేవీ సుబ్బారెడ్డి, బొడ్డువారిపాలెం, పి.తక్కెళ్ళపాడు, ఎం.వేములపాడు గ్రామాల గ్రామ వ్యవసాయ సహాయకులు డి.సుప్రజ, షేక్ అబ్జల్, పి.జయకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## కాశిరెడ్డినాయన కుంట ఆక్రమణలపై సబ్ కలెక్టర్ తనిఖీలు

**గిద్దలూరు టౌన్, నవంబర్ 12 ప్రభాతవార్త**



గిద్దలూరు పట్టణంలోని కాశిరెడ్డినాయన కుంటలో ఆక్రమణాలపై బండారు జనార్ధన్ రెడ్డి ఫిర్యాదుపై స్పందించిన అధికార యంత్రాంగం మార్కాపురం సబ్ కలెక్టర్ సహజిత్ వెంకట త్రివిగాన్ కాశిరెడ్డినాయన కుంట పరిసరాల్లో ఆక్రమణలనుమంగళవారం పూర్తిగా పరిశీలించారు.అలాగే స్థానికంగా నివాసం ఉంటున్న వారి వద్దకు వెళ్ళి ఆక్రమణల గురించి తెలియపరిచారు. కుంట పరిసర ప్రాంతాల్లో అమ్మవారి గుడి, కాశిరెడ్డినాయన గుడి, ఆశ్రమాలను, రామకృష్ణ ధ్యానమందిరం,ఓ ప్రైవేటు ఆసుపత్రి ఏర్పరచిన రస్తాలను పరిశీలించారు. గిద్దలూరు మండల రెవెన్యూ అధికారులు తయారు చేసిన సర్వే రిపోర్టు, సరిహద్దు రాళ్ళను పరిశీలించి గిద్దలూరు తహశిల్దార్ మరియు గిద్దలూరు నగర పంచాయితీ కమీషనర్‌లకు సూచనలు ఇచ్చారు. ఆక్రమణలపై ఫిర్యాదుదారుడు బండారి జనార్ధన్ రెడ్డితో మాట్లాడి సమస్య గురించి తెలుసుకొని తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాశిరెడ్డినాయన కుంట ఆక్రమణలపై పరిశీలనలో అక్కడ పేరుకుపోయిన చెత్త, మురికి చూసి నగర పంచాయితీ కమీషనర్ పై మండిపడ్డ సబ్ కలెక్టర్ వెంటనే చెత్త, చెదారం, మురికి తొలగించి శుభ్రం చేయించాలని అలాగే ఆ ప్రాంతాల్లో బయో వేస్ట్ ఉండకుండా చర్యలు తీసుకోవాలని నగర పంచాయితీ కమీషనర్‌కు సూచించారు. నంద్యాల నుండి ఒంగోలు రోడ్డులోగల డ్రైనేజీ కాల్వపై ఆక్రమ కట్టడాలను బంకులను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో సబ్ కలెక్టర్ సహజిత్ వెంకట త్రివినాగ్ మాట్లాడుతూ కాశిరెడ్డి నాయన కుంటలో ఆక్రమణలపై కమిటీని ఏర్పాటు చేశామని రెవెన్యూ ఆర్ఎస్ఆర్ ప్రామాణికంగా కమిటీ నివేదిక ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. అలాగే నంద్యాల – ఒంగోలు రోడ్డులో డ్రైనేజీ కాలువలు దాటి ముందుకు వచ్చిన వాటిపై దశలవారీగా చర్యలు చేపడతామని తెలిపారు. మార్కాపురం సబ్ కలెక్టర్ వెంట గిద్దలూరు తహశిల్దార్ ఎం ఆంజనేయరెడ్డి, నగర పంచాయితీ కమీషనర్ వెంకటదాస్, మండల సర్వేయర్ తదితర సిబ్బంది ఉన్నారు.

## సిఎం చేతులమీదుగా అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది

### – ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మొర్రి పిచ్చయ్య

**రాచర్ల, నవంబర్ 12 ప్రభాతవార్త**




రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ మొర్రి పిచ్చయ్య అన్నారు. రాచర్ల మండలం ఎడవల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు మొర్రి పిచ్చయ్య గిద్దలూరు మండలం పొదలకుంటపల్లి గ్రామంలో జిల్లాపరిషతన ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. పిచ్చయ్య సేవలను గుర్తించిన రాష్ట్రప్రభుత్వం ఆయనను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాఉడిగా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడలోని ఏవన్ కన్వెన్షన్ హాలులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ చేతులమీదుగా అవార్డు గ్రహీత మొర్రి పిచ్చయ్యకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, షీల్డ్, ప్రశంసా పత్రం, మెడల్, ప్రైజ్‌మనీని అందజేశారు. ఈ సందర్భంగా మొర్రి పిచ్చయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని తన జీవితంలో ఇది మరిచిపోలేని సంఘటన అని అన్నారు. తాను పొందిన ఈ అవార్డు తన తల్లిదండ్రులకు, సోదరులకు, గురువులకు అంకితమిస్తున్నట్లు ఆయన తెలిపారు. తనకు ఈ అవార్డు రావడానికి కారకులైన ప్రతిఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న పిచ్చయ్యను అధికారులు, స్నేహితులు, అభిమానులు, శ్రేయోభిలషులు, కుటుంబ సభ్యులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఇంటిలోకి చొరబడ్డ నాగుపాము

**గిద్దలూరు రూరల్, నవంబర్ 12 ప్రభాతవార్త**



మండలంలోని కొమ్మునూరు పంచాయితీ నల్లగట్ల గ్రామంలోని ఓ నివాసగృహంలోకి సోమవారం రాత్రి నాగుపాము చొరబడింది. దీంతో ఇంటిలోని కుటుంబ సభ్యులు నాగుపామును గుర్తించి దిగువమెట్ట డిఆర్ఓ వంశీకృష్ణకు సమాచారమందించడంతో వారు స్నేక్ టీమ్‌ను పంపించి చాకచక్యంగా నాగుపామును బంధించి అడవిలో వదిలివేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో గ్రామస్తులు స్నేక్‌టీమ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించి తెగుళ్ళను నివారించుకోవాలి

### – వ్యవసాయ శాఖ ఏవో రఫిక్

**రాచర్ల, నవంబర్ 12 ప్రభాతవార్త**



పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించి తెగుళ్ళను నివారించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి షేక్ అబ్దుల్ రఫిక్ అన్నారు. మండలంలోని సోమిదేవిపల్లి, గుడిమెట్ట గ్రామాల్లో మంగళవారం ఆయన పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రధానంగా కంది పంట కల్లె మరియు పూత దశలో ఉందని ఈ దశలో మరూక మచ్చల పురుగు ఆశించే అవకాశం ఉందని తెలిపారు. మరుకమచ్చల లద్దె పురుగు ఆకులను పూతను, పిందెలను, కాయలన్నిటినీ గూడుచేసి గూడులోపలే ఉంటూ విత్తనాలు తిని కాయలను డొల్లగా చేస్తుందని తెలిపారు. ఈ పురుగు ఎక్కువ కాలం గూడులో ఉండటం లేదా కాయ లోపల పెరగడం వలన అదుపుచేయడం కష్టమవుతుందని తెలిపారు. పురుగు ఉనికిని గమనించడానికి ఎకరాకు 10చొప్పున లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలని తెలిపారు. వేరు కల్లె దశ వచ్చిన వెంటనే ముందస్తు చర్యగా వేపనూనె 5ఎంఎల్ కలిపి పిచికారి చేయాలని తెలిపారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే లామిడా సైహాలోత్రిన్ 1ఎంఎల్ లేదా స్పైనోసాడ్ 0.3ఎంఎల్ లేదా ఫ్లూబెండమైడ్ 0.2ఎంఎల్ లేదా యామామెక్టిన్ బెంజోయేట్ 0.4గ్రాములు లేదా క్లోరంట్రానిలిప్రోల్ 0.3ఎంఎల్ ఒక లీటర్ నీటిని కలిపి పిచికారి చేయాలని తెలిపారు. ప్రతి 2-3 సంవత్సరములకు ఒకసారి పంటమార్పిడి వలన పురుగుతెగుళ్లను అదుపు కావడంతోపాటు నేలలోని పోషకాలను కూడా సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చని తెలిపారు.అనంతరం అంతరపంటలను గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామవ్యవసాయసహాయకులుసాయికౌసిక్,గుర్రప్పదు,గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

## ఏపీవోపై దాడిని ఖండించిన మండల అధికారులు, సిబ్బంది

**మర్రిపూడి, నవంబర్ 12, ప్రభాతవార్త**



పర్చూరు ఏపీవో బుల్లయ్య, కంప్యూటర్ ఆపరేటర్ ఖాదర్ మొహిద్దీన్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ మర్రిపూడి మండల ఉపాధి హామీ సిబ్బంది నిరసన మానవహారంగా ఏర్పడి దాడికి తెగబడిన టెక్నికల్ అసిస్టెంట్ రాజేంద్రపాల్ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు ఉపాధి హామీ అధికారులపై జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీవో రాంబాబు పాల్గొన్నారు.

## కొలుకుల,గొల్లవిడిపి గ్రామాలో పొలంపిలుస్తుంది కార్యక్రమం

**యర్రగొండపాలెం,నవంబర్12,ప్రభాతవార్త**



యర్రగొండపాలెం మండలంలోని కొలుకుల, గొల్లవిడిపి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో రైతు సేవ కేంద్రం వద్ద పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో ముందుగా రైతులతో కలిసి కంది,ప్రత్తి,మిరప పంటలను అధికారులు పరిశీలించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కె.వి.శేషరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కంది కల్లదశలో ఉన్నందున కంది యొక్క చిగుర్లను ఒక అడుగు మేర కత్తిరించవలెనని,ఇలా చేయడం వలన పైరు ఎమ్మగా పెరిగి,కాయ తొలచు పురుగును నివారించవచ్చని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎల్.మాల్యాద్రిరెడ్డి, పి.ధనేశ్వర నాయక్,వీఏఏలు షేక్.మస్తాన్‌వలి, పి.పార్వతిబాయ్,తదితరులు పాల్గొన్నారు.

## బసవన్నపాలెం హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను పరిశీలించిన ఎన్క్వాస్ టీమ్ సభ్యులు

**మద్దిపాడు, నవంబర్ 12, ప్రభాతవార్త**



మండలంలోని బసవన్నపాలెం హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను యాప్ ద్వారా ఎన్క్వాస్ నేషనల్ క్వాలిటీ ఏష్యూరెన్స్ స్టాండర్డ్ కమిటీ సభ్యులు డాక్టర్ ప్రేమాను పాండ్య, డాక్టర్ రుక్మిణిలు పరిశీలించారు. వెల్నెస్ సెంటర్ ముందు భాగం నుండి సెంటర్ పరిసరాలు మొదలుకొని వెల్నెస్ సెంటర్‌లోని ప్రతి గదిని పరిశీలించి ఆయా గదులలో ఏర్పాటు చేసిన పలు స్టాల్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు మొత్తం యాప్ ద్వారానే పరిశీలించారు. అనంతరం వెల్నెస్ సెంటర్లో రోగులకు బాలింతకు అందించే సేవలపై పలు ప్రశ్నలు వేసి సమాధానాలు తీసుకున్నారు. సెంటర్లో మందులు అందుబాటులో ఉన్నాయా లేవా అన్న విషయాల గురించి వారు తెలుసుకున్నారు. అనంతరం వెల్నెస్ సెంటర్‌కు వచ్చే రోగులను సిబ్బంది పని తీరును గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంను జిల్లా ఎన్క్వాస్ కోఆర్డినేటర్ ఎన్.కృష్ణప్రసాద్ నిర్వహించగా ఆసుపత్రి డాక్టర్లు శ్రావణ్ ఆనంద మోహన్, వినీల జగదీష్‌లు, సీహెచ్ రజిత కుమారి, హెచ్‌పీ నాగరాజి, సూపర్‌వైజర్ బాలకోటయ్య, ఎంఎల్‌హెచ్‌పీ జెస్సీ రోజ్వాల్, ఏఎన్ఎం మాధవి, ఎంఎల్‌డీహెచ్‌పీలు మాధురిలత, రమ్యజ్యోతి, అచల పూజిత, దరియా, సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న డాక్టర్ మజ్నుబీబీ

**మద్దిపాడు, నవంబర్ 12, ప్రభాతవార్త**



మండలంలోని బసవన్నపాలెంలో హిందీ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న డాక్టర్ షేక్ మజ్నుబీబీ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక అయిన విషయం పాఠకులకు తెలుసు. ఈ నేపథ్యంలో ఈనెల 12న మంగళవారం నాడు తాడేపల్లిలో నేషనల్ ఎడ్యుకేషన్ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అయిన వారికి అవార్డులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందించారు. ఈ క్రమంలో షేక్ మజ్నుబీబీ కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈమె గతంలో పలుమార్లు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక అయ్యారు. కులు స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేశారు. ఆమెకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకోవడం పట్ల మండలంలోని యూనియన్ల నాయకులు, ఉపాధ్యాయులు ఎంఈఓలు ఎంపీఆర్ ఆంజనేయులు, మెడబలిమి శ్రీనివాసరావులు బసవన్నపాలెం పాఠశాల సహోద్యోగులు, పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు.

## స్కూటీ అదుపు తప్పి మహిళకు గాయాలు

**మద్దిపాడు, నవంబర్ 12, ప్రభాతవార్త**

స్కూటీ అదుపు తప్పి మహిళకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం బూరేపల్లి కాలనీ సమీపంలో జరిగింది. స్థానికులు సమాచారం మేరకు వివరాల్లోకి వెళ్తే.. నాగులుప్పలపాడు నుండి మేదరమెట్ల వెళ్లేందుకు తమ స్కూటీపై బయలుదేరింది. కొత్తకోట వాగు దాటి బూరేపల్లి కాలనీ మధ్యకు రావడంతో ఒక్క సారిగా గేదె అడ్డం రావడంతో మహిళ స్కూటీ అదుపు తప్పి క్రింద పడిపోయింది. ఈ సంఘటనలో అద్దంకి పట్టణానికి చెందిన పారెళ్ళ రమాదేవికి గాయాలయ్యాయి. స్థానికులు ప్రధమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు.

## విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి

**మర్రిపూడి, నవంబర్ 12, ప్రభాతవార్త**



మర్రిపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు రాష్ట్రీయ బాల ఆరోగ్య సురక్ష కార్యక్రమం మీద ఎన్‌సీడీ 3.0 మీద అవగాహనకార్యక్రమం ఏర్పాటు చేయడమైంది. ఈ కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ వీరబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీ లో ఉన్నటువంటి పిల్లలకు, స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు నవంబర్ 14 నుండి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి యొక్క బరువు ఎత్తులను గుర్తించాలని , అలాగే హెచ్‌బీ పరీక్షలు చేయాలని, విద్యార్థి, విద్యార్థుల యొక్క ఆరోగ్య పరిస్థితులు గమనించి వారి యొక్క పరిధిలో ట్రీట్మెంట్ ఇవ్వాలని, రెఫర్ చేయాలని, అలాగే ఎన్‌సీడీ 3.0లో భాగంగా 18 సంవత్సరాల పైబడిన వారికి హౌస్ టు హౌస్ తిరిగి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. క్యాన్సర్ స్క్రీనింగ్‌లో భాగంగా ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ల గురించి తెలియపరిచారు. అలాగే 0-5 విద్యార్థినీ, విద్యార్థులకు న్యూమోనియా వ్యాధి ఉన్న యెడల వారిని గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ నాగేశ్వరరావు,హెచ్‌వి రమాదేవి,అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుచరిత,ఎంఎల్‌హెచ్‌పీలు ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి సిబ్బంది నిరసన

**మార్కాపురం, నవంబర్ 12, ప్రభాతవార్త**



ఉపాధి హామీ ఏపీవో పై పర్చూరులో జరిగిన దాడిని ఖండిస్తూ మార్కాపురం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉపాధి హామీ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు జీవరత్నం మాట్లాడుతూ విధులలో ఉన్న ఉద్యోగులపై ఇటీవల దాడులు అధికమయ్యాయి అన్నారు. పర్చూరులో ఏపీఓ పై జరిగిన దాడి హేయమైందని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర కళాశాలల క్రీడోత్సవాలు

**సీఎస్‌పురం, నవంబర్ 12, ప్రభాతవార్త**



ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర కళాశాలల క్రీడలు, సాహిత్యం, సాంస్కృతిక సమ్మేళనం వేడుకలు మంగళవారం తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల వేదికగా ప్రారంభ మయ్యాయి. ఈ క్రీడా పోటీలలో సీఎస్‌పురం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరుస్తున్నారు. ఈకార్యక్రమంలో ఫిజికల్ మాస్టర్ బండారు రవీంద్రాబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుస్మిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## 14 నుంచి జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు

### – గ్రంథపాలకుడు అహ్మద్ షరీఫ్

**హనుమంతునిపాడు, నవంబర్ 12, ప్రభాతవార్త**



హనుమంతునిపాడు శాఖా గ్రంధాలయంలో ఈనెల 14 నుండి జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంధపాలకుడు అహ్మద్ షరీఫ్ తెలిపారు. 14న ప్రారంభోత్సవం, బాలలదినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న పాటల పోటీలు, దేశభక్తి, జానపద, భావగీతాలు, 17న కవి సమ్మేళనం, వ్యాస రచనా పోటీలు, 18న వకృత్వ పోటీలు, 19న మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ పోటీల నిర్వహణ, 20న జాతీయ గ్రంధాలయ వారోత్సవ ముగింపు వేడుకలు, విజేతలకు బహుమతుల ప్రధానం కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. చాలా కాలం నుంచి సభ్యుల వద్ద ఉన్న గ్రంధాలయ పుస్తకాలను ఆలస్య రుసుం లేకుండా వారోత్సవాల సందర్భంగా తిరిగి తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9666029015 ను సంప్రదించాలని కోరారు.

## నేడు సాధారణ సర్వసభ్య సమావేశం

### – ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు

**హనుమంతునిపాడు, నవంబర్ 12, ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నందు నేడు అనగా బుధవారం ఉదయం 11గంటలకు ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ రంగ సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కావున మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

## వర్షం పడితే వీఐపీ రోడ్డు చిత్తడి

**సంతనూతలపాడు, నవంబర్ 12, ప్రభాతవార్త**





సంతనూతలపాడులోని హైస్కూల్ సమీపంలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే వీఐపి రహదారి వర్షం పడితే మరింత చిత్తడిగా మారిపోతుంది. ముఖ్యంగా ఇళ్ల మధ్యలో ఈ రహదారి మాగాణిని తలపిస్తుంది. వర్షం పడితే పలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ఈ రహదారి నీటిమయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి గుండానే మండల పరిషత్ కార్యాలయం, ప్రభుత్వ హాస్పిటల్, విద్యుత్ కార్యాలయం, ఎన్సెస్పీ కార్యాలయం, ఆర్‌బీకే కేంద్రం, తదితర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రజలు వెళ్ళవలసి ఉంది. ఈ రహదారి గుండాన్ని కామేపల్లివారిపాలెం గ్రామానికి గ్రామస్తులు వెళ్లాల్సి ఉంది. గత వైసీపీ పాలనలో నేటి కూటమి ప్రభుత్వ పాలనలో నేటి వరకు వీఐపీ రహదారి దుస్థితి మారిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ వీఐపీ రహదారికి మరమ్మత్తులు నిర్వహించి ప్రజల ఇక్కట్లు పరిష్కరించాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

## సిరి పప్పు ధాన్యాలు పంటలు సాగు చేయాలి

### – మండల వ్యవసాయాధికారి ప్రసన్న రంగలక్ష్మి

**కొనకనమిట్ల, నవంబర్ 12, ప్రభాతవార్త**



రైతులు పొగాకు పంటల ప్రత్యామ్నాయ మైన సిరి పప్పు ధాన్యాల పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి కె.ప్రసన్న రంగ లక్ష్మి కోరారు. మంగళవారం మండలంలోని చిన్నారికట్ల, పెద్దారికట్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతు సేవా కేంద్రాలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు పంటకు ప్రత్యామ్నాయమైన మినుము, కంది, బొబ్బర్లు, జొన్న, పప్పు ధాన్యాల పంటలు సాగు చేయాలని సూచించారు. పొగాకు పంట అధికంగా సాగు చేయడం వల్ల ధరలు తగ్గే అవకాశం ఉందని, రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి ఎదురవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ వ్యవసాయ సహాయకులు అరవింద్, శ్రీరామ్ ఏఈఓ విక్రమ్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ఏపీవో, కంప్యూటర్ ఆపరేటర్‌పై దాడికి నిరసన

**పొన్నలూరు, నవంబర్ 12, ప్రభాతవార్త**



ఉమ్మడి ప్రకాశం జిల్లా పర్చూరు మండల మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అదనపు కార్యక్రమం అధికారి బి.బుల్లయ్య, కంప్యూటర్ ఆపరేటర్ ఖాదర్ మొయిద్దీన్ పై అక్కడ టెక్నికల్ అసిస్టెంట్‌గా నిర్వహిస్తున్న వ్యక్తి కత్తితో దాడి చేయడంపై మంగళవారం పొన్నలూరు ఏపీవో మాచర్ల, కార్యాలయ సిబ్బంది దాడిని ఖండిస్తూ నిరసన తెలిపారు.

## వర్క్‌షాపులో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలూరి

**మార్టూరు, నవంబర్ 12, ప్రభాతవార్త**



అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వర్క్‌షాపులో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

## ప్రజా శ్రేయస్సు ధ్యేయంగా ఎరిక్షన్‌బాబు కృషి

### – గ్రామాల అభివృద్ధిపై దృష్టి

### – ప్రణాళిక బద్ధంగా పనులకు ప్రతిపాదనలు

**పుల్లలచెరువు, నవంబర్ 12, ప్రభాతవార్త**





గత సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలవక పోయినప్పటికి ప్రజాతీర్పుకు తలవంచి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం గూడూరి ఎరిక్షన్‌బాబు కృషి చేస్తున్నారు. పని చేయాలంటే పదవితో పనిలేదని నిరూపిస్తున్న ఆయన నియోజకవర్గ ప్రజల సమస్యలను తెలుసు కుంటూ వాటి పరిష్కారానికి ప్రణాళిక బద్ధంగా ప్రతిపాదనలుపంపుతూ పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఇటీల యర్రగొండపాలెంలో ప్రజాదర్బార్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటికే పుల్లలచెరువు మండలంలో పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి దాదాపు రూ.15 కోట్ల రూపాయల పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ పనులన్ని ప్రారంభమై గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణం జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు గ్రామాల్లో గుంతలు లేని రోడ్లు లక్ష్యంగా ప్రధాన రోడ్ల గుంతలు పూడ్చే కార్యక్రమానికి కూడా శ్రీకారం చుట్టిన ఎరిక్షన్‌బాబు పుల్లలచెరువు మండలంలోని ఐటీవరం, మానేపల్లి సిద్దనపాలెం గ్రామాల్లో రోడ్ల గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. వీటితో పాటు ఎన్నో ఏళ్లుగా మరుగున పడిపోయిన పలు పనుల పూర్తి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. పుల్లలచెరువు మండల ప్రజలకు ఆశాదీపంగా ఉన్న చిన్న కండలేరు ప్రాజెక్టు నిర్మాణంలో కూడా శ్రద్ధ చూపి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. పుల్లలచెరువు– యర్రగొండపాలెం డబుల్ రోడ్డు నిర్మాణానికి కూడా కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఇలా నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను గుర్తిస్తూ పార్టీలో నెలకొన్న విభేధాలను పట్టించుకోకుండాఅభివృద్ధిపనులపైన దృష్టిపెట్టిముందుకు కదులుతూ ప్రజలమన్ననలు పొందుతున్నారు.

## ఘనంగా మాగుంట రాఘవరెడ్డి జన్మదిన వేడుకలు

**తాళ్లూరు, నవంబర్ 12, ప్రభాతవార్త**



మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలో గుంటి గంగ సన్నిధిలో గల తేజా వయోవృద్ధాశ్రమంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు మాగుంట రాఘవరెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి, బియ్యం అందజేశారు. అనంతరం రాఘవరెడ్డి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తూర్పు గంగవరం ఉప సర్పంచ్ యాత్తపు కాశిరెడ్డి, గుంటి గంగ ఆలయకమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం,నాయకులుఐ.శ్రీనివాసరెడ్డి,గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి(చందన), చేతల రమేష్, రాయుడు, యలమందరెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, ఎస్.కోటిరెడ్డి, జి.సుబ్బారెడ్డి, ఎస్.ఆంజనేయులు, చాట్ల ఇమ్మానియేలు, మాలిక్, పి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్, డీపీఓని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీటీసీ సూరిశెట్టి నారాయణస్వామి

**హనుమంతునిపాడు, నవంబర్ 12, ప్రభాతవార్త**



హనుమంతునిపాడు మండలం నందనవనం ఎంపీటీసీ సూరిశెట్టి నారాయణస్వామి మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను, డీపీఓ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి జి.వెంకట నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పరిచయం చేసుకున్నారు.

## పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

**సీఎస్‌పురం, నవంబర్ 12, ప్రభాతవార్త**



అయ్యలూరివారిపల్లె పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చినట్లు సర్పంచ్ ముత్యాల భారతీరెడ్డి, నాయకులు ముత్యాల నారాయణరెడ్డి తెలిపారు. అయ్యలూరివారిపల్లె గ్రామంలో మంగళవారం నూతనంగా వీధిలైట్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా పంచాయతీ పరిధిలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నట్లు తెలిపారు. పంచాయతీలో మెరుగైన పారిశుధ్యం కోసం ప్రజలు సహకరించాలని తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా డస్ట్‌బిన్‌లలో వేయాలన్నారు. రోడ్లపై చెత్తా చెదారం వేయవద్దన్నారు. పంచాయతీలో బ్లీచింగ్, ఫాగింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## మట్టిరహిత రహదారులను నిర్మించడమే ఎమ్మెల్యే ఉగ్ర లక్ష్యం

### - పువ్వాడి వెంకటేశ్వర్లు



**పామూరు, ప్రభాతవార్త**

పామూరు మండలంలో మండల కేంద్రమైన పామూరుతో పాటు 25 పంచాయతీల్లో మట్టి రహిత రహదారులు నిర్మించడమే శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని పామూరు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సీఎస్‌పురం ప్రధాన రహదారి నుండి చెన్నకేశవనగర్ వరకు రూ.20లక్షలతో మంగళవారం నాడు సీసీ రోడ్డుకు భూమి పూజ గావించారు. గ్రామ సీమల అభివృద్ధి రహదారుల మీదనే ఆధారపడి ఉంటుందన్నారు. చిన్నపాటి వర్షం కురిసిన అధ్వాన్నంగా తయారై ప్రజలు పడుతున్న ఇక్కట్లను గుర్తించి ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణమే ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తీసుకువస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర అభినందనీయుడని అన్నారు. సోమవారం నాడు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్య ప్రజానీకానికి ఊరట కలిగించిందన్నారు. తొలి దశలో వెలిగొండ ప్రాజెక్టుకు రూ.350 కోట్లు కేటాయించడం ఈ ప్రాంత రైతులు చేసుకున్న పుణ్యఫలంగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పువ్వాడి తిరుపతమ్మ, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కొండిశెట్టి రమణయ్య, జనసేన నాయకులు వై.రహిముల్లా, టీడీపీ యువ నాయకులు పారిశ్రామిక వేత్త లక్ష్మీనరసింహాపురం ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, జిల్లా మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ అమీర్ బాబు, ఆర్ఆర్ రఫీ, దేవరపు మాల్యాద్రి, మాచర్ల రెహమాన్, అస్లామ్, మస్తాన్, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, మొబినామౌలాలి, మాజీ ఎంపీటీసీ పట్టణ ఫోర్‌మెన్ కమిటీ మెంబరు ఇర్రి కోటిరెడ్డి, నబిసాహెబ్ గారి గౌస్ భాష, పత్తు మస్తాన్, బాలరంతుగారి గౌస్‌భాష తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కులగణన చేపట్టిన అణగారిన బీసీలకు సముచిత స్థానం కల్పించాలి



**పామూరు, నవంబర్ 12, ప్రభాతవార్త**

రాష్ట్రంలో అణగారిపోతున్న బీసీలకు రాజ్యాధికారంలో, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో సముచిత స్థానం కల్పించాలంటే కులగణన తక్షణమే చేపట్టాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి, కోఆర్డినేటర్ మాజీ డీజీపీ పూర్ణచంద్రరరావు, బీసీసీ కమిటీ పూర్ణచంద్రరరావు, రాష్ట్ర సమన్వయకమిటీ కార్యదర్శి ఒగూరి ఏడుకొండలు కోరారు. నెల్లూరులో జరిగిన బీసీ కులగణన ధర్నా కార్యక్రమంలో పై వారు పాల్గొని బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా కులగణన చేపట్టకపోవడం వలన అనేక రంగాల్లో వెనుకబడి పోయి ప్రాథమిక హక్కులను సైతం కోల్పోతున్నారని అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం కులగణన చేపడితే అన్ని రంగాల్లో బీసీలకు ప్రాధాన్యత పెరుగుతుందని వారు ప్రజలకు తెలియజేశారు.

## పశువులు రహదారులపై రాకుండా చూడాల్సిన బాధ్యత యజమానులదే

### - సీఐ భీమా నాయక్ హెచ్చరిక



**పామూరు, నవంబర్ 12, ప్రభాతవార్త**

నేషనల్ హైవే ప్రాంతాల్లో ఇటీవల జరుగుతున్న ప్రమాదాలకు ముఖ్య కారణం గేదెల వలనేనని, విచ్చలవిడిగా యజమానులు వాటిని వదిలివేయడం వలన రోడ్డు ప్రమాదంలో పలువురు మరణించడం వల్ల వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని పామూరు సీఐ భీమానాయక్ తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ భీమా నాయక్ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయంత్రం 6గంటల నుండి 7గంటలలోపు ప్రధాన రహదారుల మీదుకు గేదెలు, మేకలు తదితరవి యదేచ్ఛగా సంచరిస్తుండటం వల్ల రహదారి కనిపించక ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురవుతూ ప్రమాదానికి గురవడంతో అంగవైకల్యానికి గురవుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో అధికంగా వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీవనం సాగిస్తుంటారని, కానీ సాయంత్రం 6గంటల లోగా పశువుల యజమానులు వాటిని ఇంటికి వచ్చేలా చూసుకోవాల్సిన బాధ్యత మరచిపోతూ రోడ్డు ప్రమాదాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమవుతున్నారని తెలిపారు. ఎవరి పరిధిలో వాళ్ల తమ పశువులను జాగ్రత్త పరుచుకోగలిగితే రోడ్డు ప్రమాదాలు నివారించిన వారవుతారని హితవు పలికారు. ప్రతి ఒక్క పశుపోషకులు ముఖ్యంగా పశువుల కొమ్ములకు విధిగా రేడియం పేయింట్స్ వేయించాలని, అందువల్ల చీకట్లో సైతం కొమ్ముల లైటింగ్ వల్ల వాహన చోదకులకు ప్రమాదాల భారి నుండి తప్పించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే కొన్ని పర్యాయాలు పశుపోషకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించామని, వారంలోగా పశుపోషకులు తమ పశువులను 6గంటల లోగా ఇళ్లకు చేర్చని పక్షంలో చట్టపరంగా తీసుకునే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు.

## ఎమ్మెల్యే ఉగ్ర చొరువతో పామూరు ప్రధాన రహదారికి మహర్ధశ



**పామూరు, నవంబర్ 12, ప్రభాతవార్త**

కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పదవి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి నియోజకవర్గం అభివృద్దే ధ్యేయంగా కృషి చేస్తున్నారని తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కొండిశెట్టి వెంకటరమణయ్య, యువనేత లక్ష్మీనరసాపురం ఎంపీటీసీ బొల్లా నరసింహారావు చౌదరి, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, జనసేన నియోజకవర్గ కన్వీనర్ యలమందల రహిమల్లా, మైనార్టీ నాయకులు అమీర్‌బాబు, ఎనిమిదో వార్డు మెంబరు ఉప్పలపాటి హరిబాబు, మాజీ ఎంపీటీసీ ఇర్రి కోటిరెడ్డి తదితరులు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుండి నెల్లూరు రోడ్డులోని ఎన్‌హెచ్ 565 రోడ్డు వరకు రోడ్ల విస్తరణ, నూతన సీసీ రోడ్ల నిర్మాణం, సైడు కాలువల ఏర్పాటుకు రహదారుల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ద్వారా ఎస్టిమేషన్ వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. దీర్ఘకాలికంగా ఆక్రమణల చెరలో పామూరు ప్రధాన రహదారి ఉండటం వల్ల ప్రయాణికులు, వాహన చోదకులు పడుతున్న ఇబ్బందులను నివారించేందుకు ఈ రహదారి విస్తర్ణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కనిగిరిలో చేపట్టిన విధంగా సైడు కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించి ప్రధాన రహదారిని వెడల్పు చేయడమే కాక కొత్త రోడ్ల నిర్మాణంతో పాటు కాలువలను ఆధునీకరించేందుకు ఆర్అండ్‌బి అధికారులకు ఎస్టిమేషన్ వేయమని ఆదేశాలు రావడం పామూరు అభివృద్ధికి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి చేపడుతున్న కృషి అవగతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ రఫీ, కావేరి రసూల్, దేవరపు మాల్యాద్రి, మాచర్ల రెహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

## పంటలను ఆశించు తెగుళ్లకు సస్యరక్షణ చేపట్టండి - ఏవో కే.రాధ



**పామూరు, నవంబర్ 12, ప్రభాతవార్త**

కంది, వరి తదితర పైర్లకు ఆశించిన చీడపీడల నుండి సరైన మోతాదులో వ్యవసాయాధికారులు సూచించిన విధంగా మందులను వాడి పంటలను రక్షించుకోవడమే కాక అధిక పైరు దిగుబడి సాధించాలని మండల వ్యవసాయాధికారి కే.రాధ తెలిపారు. మండల పరిధిలోని తాతయపల్లి, నుచ్చుపొద గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నాడు చేపట్టారు. ఈ సందర్భంగా రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పైర్లకు అవసరమైన చర్యల గురించి వివరించారు. ప్రస్తుతం ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పైర్లను ఆశించే పురుగుల నివారణకు తగు మోతాదులో మందులను పిచికారి చేసుకుని రైతులు లబ్ది పొందాలని సూచించారు.

## మాలకార్పొరేషన్ చైర్మగాన్ ఎన్నికైన విజయ్‌కుమార్‌ను కలిసిన రాష్ట్ర మాల ఉద్యోగ సంఘం అధ్యక్షులు అశోక్‌బాబు



**టంగుటూరు, నవంబర్ 12, ప్రభాతవార్త**

మాల కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన పెద్దపూడి విజయ్‌కుమార్‌ను రాష్ట్ర మాల ఉద్యోగ సంఘం అధ్యక్షులు తుల్లిబిల్లి అశోక్‌బాబు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాలకార్పొరేషన్ ద్వారా మాలల ఆర్థికాభివృద్ధికి సహకరించాలని కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితులపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణన దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలల జేఏసీ కోఆర్డినేటర్ కంచర్ల చిట్టిబాబు, ప్రకాశం జిల్లా మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు హనుమంతరావు, యరమాల మల్లిఖార్జునరావు, కొండలరావు, తిరుపతిస్వామి, మేడిద రవి, పీసీపల్లి మాల్యాద్రి, రాజు, రమేష్, జస్‌మాల, లక్ష్మణ్‌నారాయణ, మాల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం పట్ల హర్షం

**ఒంగోలు టౌన్, నవంబర్ 12, ప్రభాతవార్త**

రాష్ట్ర బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి పెద్ద పీట వేశారని సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జి.వీరభద్రాచారి హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల బలోపేతానికి, గ్రామాలలో మౌళిక వసతుల కల్పనకు రూ.16739 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. గ్రామ స్వరాజ్య సాధన దిశగా నడిపిస్తున్న డిప్యూటీ సిఎంకు సంఘం పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

## సెయింట్ ఆన్స్ కళాశాలలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

**వేటపాలెం, నవంబర్ 12, ప్రభాతవార్త**



సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ చీరాలలో జేఎన్టీయూకే కాకినాడ ఆధ్వర్యంలో పురుష, మహిళల విభాగంలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు బుధవారం 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.జగదీష్‌బాబు మాట్లాడుతూ జేఎన్టీయూకే కాకినాడ పురుషులు,మహిళల విభాగంలో ఇంటర్ కాలేజీ టోర్నమెంట్‌తో పాటు యూనివర్సిటీ టీం సెలక్షన్ పోటీలను తమ కళాశాలలో నిర్వహించడం గర్వకారణం అన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు జేఎన్టీయూకే పరిధిలోని శ్రీకాకుళం జిల్లా నుండి ప్రకాశం జిల్లా వరకు ఉన్న కళాశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు. అనంతరం కళాశాల వ్యాయమా ఉపాధ్యాయులు, జేఎన్టీయూకే స్పోర్ట్స్ కౌన్సిల్ మెంబర్ అన్నం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటర్ కాలేజీ గవర్నమెంట్ లో పాల్గొనే విద్యార్థులకు వసతి ఏర్పాట్లతో పాటు భోజన సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ పోటీలను పర్యవేక్షించేందుకు జేఎన్టీయూకే నుండి పరిశీలకులు విచ్చేస్తారన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్దులు ఉదయం 8గంటల నుండి కళాశాల నుండి ఎలిజిబిలిటి ఫామ్స్‌తో హాజరు కావాలన్నారు.

## యానాది కార్పొరేషన్ కోసం ఎదురు చూపులు

**ఒంగోలు టౌన్, నవంబర్ 12, ప్రభాతవార్త**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు యానాది కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ ఈగా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట ఆయన మీడియాతో మాట్లాడుతూ వివిధ కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని, దశాబ్దాల యానాదుల వెనుకబాటుతనాన్ని అర్థం చేసుకోవాలని కోరుతున్నామన్నారు. ఐటిడిఎ పరిధిలో యానాది యాక్షన్ ప్లాన్ క్రింద కొంత మేర మాత్రమే అభివృద్ధి జరిగిందని, మైదాన ప్రాంతాలలో యానాదులు తీవ్ర పేదరికం అనుభవిస్తున్నారన్నారు. సోషియో ఎకనామిక్ సర్వేలు యానాదుల దుర్భర జీవితాలను తేటతెల్లం చేస్తున్నాయని, ప్రభుత్వ పథకాలు అందుకోలేని స్థితిలో యానాదులు ఉండటం దురదృష్టకరమన్నారు. కుల గణన సర్వే ముగిసేలోగా యానాది కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ తీసుకుంటే బాగుంటుందన్నారు. యానాదుల జనాభా గణనీయంగా పెరిగిందని భావిస్తున్నామని, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో విభిన్న పరిస్థితులలో జీవనం సాగిస్తున్నారన్నారు. గ్రామాలలో ఉపాధి లేక వలస వెళ్లిన వారి వివరాలు ప్రభుత్వ సర్వేలో, కుల గణనలో బయటపడతాయని, అందుకు అనుగుణంగా ప్రభుత్వ చర్యలు యానాదుల సమగ్ర అభివృద్ధికి దోహద పడతాయన్నారు.

## ఈనెల 14నుండి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

**దర్శి, నవంబర్ 12, ప్రభాతవార్త**

దర్శి శాఖా గ్రంథాలయంలో ఈనెల 14నుండి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంపథపాలకురాలు వి.విజయకుమారి తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు, వ్యాసరచన, వకృత్వం, చిత్రలేఖనం, పాటల ఆటల పోటీలు నిర్వహించబడును. ఈ కార్యక్రమంలో విద్యార్థులు విరివిగా పాల్గొనాలని కోరారు. 20న వారోత్సవాల ముగింపు రోజున పోటీల్లో విజయం సాధించిన వారికి బహుమతులు అందజేయడం జరుగుతుందని ఆమె తెలియజేశారు.

## ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌కి శుభాకాంక్షలు తెలిపిన మారెళ్ళ



**దర్శి, నవంబర్ 12, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా నియమితులైన గోనుగుంట్ల కోటేశ్వరరావుని పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపిన ఒంగోలు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు మారం శ్రీనివాసరెడ్డి.

## మాగుంట రాఘవరెడ్డి పుట్టిన రోజు వేడుకలు

**దర్శి, నవంబర్ 12, ప్రభాతవార్త**



ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు రాఘవరెడ్డి జన్మదిన సందర్భంగా దర్శిలోని సాయి వృద్ధాశ్రమం నందు వృద్దులకు భోజనం, పండ్లు, మిఠాయిలు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ రెండో వార్డు కౌన్సిలర్ వీసీరెడ్డి, దర్శి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్న, ఉపాధ్యక్షుడు కల్లూరు సుబ్బు, అధికార ప్రతినిధి గుర్రం బాలకృష్ణ, అంబటి గోవిందరెడ్డి పాల్గొన్నారు.

## అందుబాటులో రాయితీపై శనగ విత్తనాలు

**దర్శి, నవంబర్ 12, ప్రభాతవార్త**



దర్శి మండలంలో తూర్పు చౌటపాలెం, పెద్ద ఉయ్యాలవాడ రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణ నాయక్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రాయితీపై శనగ విత్తనాలు 1 క్వింటా పూర్తి ధర రూ.9400 లు సబ్సిడీ రూ.2350లు రైతు కట్టాల్సింది రూ.7050 లు అని తెలిపారు. రబీ పంట యొక్క ఇన్సూరెన్స్ మీ సేవ నందు డిసెంబర్ 15లోగా కట్టుకోవాలని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జి.రమ్య, మాధురి, రైతులు పాల్గొన్నారు.

## నవంబర్ 8 నుండి 15వరకు మండల కార్యాలయాల వద్ద ధర్నాలను జయప్రదం చేయండి

**ముండ్లమూరు, నవంబర్ 12, ప్రభాతవార్త**



నవంబర్ 8 నుండి 15వరకు మండల కార్యాలయాల వద్ద ధర్నాలను జయప్రదం చేయాలని ముండ్లమూరులో కరపత్రాల ప్రచారం చేయడం జరిగింది. గత నెల రోజులుగా వంట నూనెలు కూరగాయాలు ధరలు ఆకాశాన్నంటాయి. పండుగల సందర్భంగాను రోజువారి సరుకుల కొనుగోళ్లలోనూ ధరల ప్రభావం కనిపిస్తోంది. రేషన్ షాపుల ద్వారా నిత్యవసర సరుకులను సరసమైన ధరలకు అందించాలని సీపీఎం డిమాండ్ చేస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను అదుపునకు రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలొస్తాయని ఎదురు చూస్తున్న యువతకు నిరాశకు గురవుతున్నారన్నారు. డీఎస్సీ వాయిదా పడిందని, ప్రత్యేక డీఎస్సీ ప్రకటించలేదన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్యులపై భారాలు మోపుతున్నారన్నారు. మద్యాన్ని నియంత్రించాలని, వారానికి ఒక రోజు డ్రైడే అమలు చేయాలని, డి అడిక్షన్ సెంటర్లు పెట్టాలని, ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలు వ్యతిరేకిస్తున్న చోట్ల నిబంధన వ్యతిరేకంగా షాపులకు అనుమించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు, బోడపాటి హనుమంతరావు, గంగినేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జర్మన్ భాషా శిక్షణ, ఉపాధి అవకాశాలు కార్యక్రమం

**ఒంగోలు టౌన్, నవంబర్ 12, ప్రభాతవార్త**

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, క్యూరా పర్సనల్ సంయుక్త ఆధ్వర్యంలో నర్సింగ్ అభ్యర్థులకు జర్మన్ భాషా శిక్షణ, ఉపాధి అవకాశాలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిఎన్ఎం, బిఎస్‌సి నర్సింగ్ పూర్తి చేసిన వారు అర్హులని,ఆసక్తి గల వారు స్కిల్ ఇంటర్నేషనల్ ఎట్‌దిరేటాఫ్ ఎపిఎస్ఎస్‌డిసి.ఇన్‌కు సర్టిఫికేట్స్ పంపాలని,మరిన్ని వివరాలకై 9988853335 సెల్‌నంబర్ సంప్రదించాలని తెలిపారు.

## 18 పంచాయతీ పనులు మీద అవగాహన

**టంగుటూరు, నవంబర్ 12, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన టంగుటూరిలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం 10గంటలకు 18 పంచాయతీల సెక్రటరీల సమావేశం జరుగును. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీలో పలు పనుల విధానంపైఅవగాహన కల్పిస్తారని మండల అభివృద్ధి అధికారి తెలిపారు. కనుక 18 పంచాయతీల సెక్రటరీలు, అధికారులు పాల్గొనాలని తెలియజేశారు.

## పంటలు పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారులు

**కనిగిరి, నవంబర్ 12, ప్రభాతవార్త**

కనిగిరి మండలం బొమ్మిరెడ్డిపల్లి, పునుగోడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.జ్యోష్ణదేవి కంది, వరి పంటను పరిశీలించి రైతులకు తెగుళ్లపై పలు సూచనలు చేశారు. రబీలో వరి పంటలో 45 రోజుల లోపు జింక్ సల్ఫేట్(చిలేటెడ్ జింక్) 100 గ్రాములు/ ఎకరాకు పిచికారి చేసినట్లయితే జింకు లోపాన్ని నివారించుకోగలమని తెలియజేశారు. కంది పంట ప్రస్తుతం కళ్ళే దశలో ఉన్నందున పురుగు ఆశించడానికి అవకాశం ఉందని వేప నూనె లేదా క్లోరోఫైరిపాస్ 50 శాతం ఈసీ లేదా ఎసిఫేట్ 1 గ్రా/ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించడం జరిగింది. ఉద్యాన శాఖాధికారి అంజలి బాయి మాట్లాడుతూ మినీ ట్రాక్టర్లు, తైవాన్స్ స్ప్రేయర్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు కనిగిరి హార్టికల్చర్ ఆఫీస్ నందు సంప్రదించాలని కోరారు.

## శివనగర్ కాలనీలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



**కనిగిరి, నవంబర్ 12, ప్రభాతవార్త**

కనిగిరి మున్సిపల్ 2వ వార్డు శివనగర్ కాలనీలో మంగళవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుకుగా జరిగింది. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కొబ్బరిబోండాల సుబ్బారావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు పదుల సంఖ్యలో జరిగాయి. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ షరీఫ్, లక్ష్మయ్య, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్యను పరిష్కరించిన మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



**కనిగిరి, నవంబర్ 12, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని డంపింగ్ యార్డు వద్ద నీటి పైపులైన్ పగిలిపోవడంతో పట్టణంలోని పాతూరు, మంగలిమాన్యం ప్రాంతాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తాయి. సమస్యపై వెంటనే స్పందించిన కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మున్సిపల్ సిబ్బందితో కలిసి పైపులు దెబ్బతిన్న డంపింగ్ యార్డు ప్రాంతానికి మంగళవారం చేరుకున్నారు. ఈ సందర్భంగా దెబ్బతిన్న నీటి పైపులైన్లను పరిశీలించి, యుద్దప్రాతిపదికన దెబ్బతిన్న మాన్యం, పాతూరు ప్రాంతాలకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ కోటేశ్వరరావు, సచివాలయ ఇమ్యూనిటీ సెక్రటరీ షంషీర్‌లు ఉన్నారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలించిన ఎంపీడీఓ

### - పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మెమో జారీ చేయాల్సిందిగా ఎంఈఓకు ఆదేశం



**కనిగిరి, నవంబర్ 12, ప్రభాతవార్త**

విద్యార్థినీ, విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ ప్రభాకర్ శర్మ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్ద వరిమడుగు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జియో ట్యాగింగ్ ఎన్ఎస్ఐపీ సర్వేను పరిశీలించి అనంతరం పాఠశాలలోని మధ్యాహ్న భోజనంలో కొన్ని పొరపాట్లను గుర్తించడం జరిగిందని విచారణ సమయంలో 52 మంది విద్యార్థులకు గాను 32 మంది విద్యార్థులు మాత్రమే ఉండటం జరిగిందన్నారు. మధ్యాహ్న భోజనంలో కొన్ని లోపాలు గుర్తించి వెంటనే ప్రధానోపాధ్యాయులకు మెమో జారీ చేయాల్సిందిగా మండల విద్యాశాఖాధికారిణి ఆదేశించారు. వెంటనే సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓతో పాటు మండల విద్యాశాఖాధికారి సంజీవి, పాఠశాలసిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమమద్యం పట్టివేత




**కనిగిరి, నవంబర్ 12, ప్రభాతవార్త**

పీసీపల్లి నుండి అక్రమంగా మద్యం బాటిల్స్‌ను తీసుకొని వెళ్తున్న నేరేడుపల్లి గ్రామానికి చెందిన షేక్ అల్లి సాహెబ్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద 18 ఆఫీసర్ చాయిస్ 180 ఎంఎల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు. అక్రమంగా మద్యం బాటిళ్లను తీసుకుని వెళ్తున్నాడని పక్కా సమాచారం మేరకు వ్యక్తిని అదుపులోకి తీసుకుని మద్యం బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో అక్రమంగా బెల్టు షాపులు నిర్వహించిన బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసిన అట్టివారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులను నమోదు చేయడం జరుగుతుందని ఎస్సై కోటయ్య హెచ్చరించారు. గ్రామాల్లో అక్రమ మద్యం అమ్ముతున్నట్లు తమ దృష్టికి తీసుకొని వస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచటం జరుగుతుందని తెలియజేశారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించండి

### - మాల కార్పొరేషన్ చైర్మన్‌ను కోరిన జనసేన ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి గూడూరు శివరామప్రసాద్




**చీరాల, నవంబర్ 12, ప్రభాతవార్త**

రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ మాల యువతకు మాల కార్పొరేషన్ ద్వారా న్యాయం చేయాలని రాష్ట్రంలోని మాలల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి గూడూరు శివరామప్రసాద్ అన్నారు. మంగళవారం మాల కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయ్ కుమార్‌ను ఇంకొల్లులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాల కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయ్‌కుమార్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కి హృదపూర్వక కృతజ్ఞతలని అన్నారు. చట్టబద్దంగా పని చేసి ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేలా కృషి చేస్తానని మాలల నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు అందేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర సేవా సొసైటీ అధ్యక్షులు గుమ్మడి సూర్య ప్రకాష్, గూడూరు సుజిత్, జనసేన పార్టీ ఫ్రోగ్రాం కోఆర్డినేటర్ పాలవలస శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినీలు



**చీరాల, నవంబర్ 12, ప్రభాతవార్త**

ఈనెల 10న కందుకూరులో జరిగిన తైక్వాండో అసోసియేషన్ మీట్లో సబ్ జూనియర్ విభాగంలో యార్లగడ్డ లాస్య ప్రియ గోల్డ్ మెడల్‌సాధించి రాష్ట్రస్థాయికి సెలెక్ట్ అవడం జరిగింది. అలానే క్యారెట్ విభాగంలో యార్లగడ్డ లక్ష్మీప్రియ గోల్డ్ మెడల్స్ సాధించడం జరిగింది. వీరు కందుకూరులో జరుగు రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫణి సత్యనారాయణ, పీడీలు ఏ.కోటేశ్వరమ్మ, జే.శ్రావణిలు అలానే విద్యా కమిటీ వైస్ చైర్మన్ సురేఖ, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## పొలం పిలుస్తోందిలో వరి దిగుబడికి సలహాలు



**వేటపాలెం, నవంబర్ 12, ప్రభాతవార్త**

వేటపాలెం మండలం రామన్నపేట పందిళ్ళపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయాధికారి కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సాయిల్ హెల్త్ కార్డులు రైతులకు పంచడం జరిగింది. పాడి పంటలు మాస పత్రికను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ వరి పొలాలలో వచ్చే తెగుళ్లు, వాటి నివారణకు ఏ మందులు వాడాలి, ఎలా పిచికారి చేయాలి దీని గురించి వివరించారు. అలాగే ప్రకృతి వ్యవసాయంలో కూడా ఎలాంటి కషాయాలు వాడుకోవాలి, ఏ విధంగా వాడాలి అనే విషయం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు అనుకూలమైన బడ్జెట్

**కనిగిరి, నవంబర్ 12, ప్రభాతవార్త**



అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేద ప్రజలకు అనుకూలమైన బడ్జెట్ ప్రకటించడం జరిగిందని ఒంగోలు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి తమ్మినేని వెంకటరెడ్డి మంగళవారం అన్నారు. రాష్ట్ర బడ్జెట్ రూ.2.94 లక్షల కోట్లతో ఏపీ వార్షిక బడ్జెట్ ప్రకటించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర ఆదాయానికి గండి పడిందని, రాష్ట్ర వనరుల మళ్లింపు దుర్వినియోగం జరిగాయని తెలిపారు.


**దావా సమను**

అండర్ ఆడర్ 5 రూల్ 1 & 5 ఆఫ్ సి.పి.సి
కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం: 24/2024

షేక్ ఖాదర్ భాషా ....... వాది
వర్సెస్
కదిరి హరిప్రసాద్ ...... ప్రతివాది

టు, కదిరి హరిప్రసాద్ తండ్రి తిరుపతయ్య, ఆర్/ఓ డోర్.నెం: 2-33/1(ఎ), నాగిరెడ్డిపల్లి గ్రామము, వెలిగండ్ల మండలం, ప్రకాశం జిల్లా.

ఇందుమూలంగా ప్రతివాదికి తెలియజేయడమేనగా వాది మీపై కనిగిరి జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో ఓ.ఎస్.నెం:24/2024 నెంబర్ గల దావా మీపై దాఖలు చేసి ఉన్నారు. కనుక మీ ఆక్షేపణలు ఉన్నచో తేది: 24.12.2024న ఉదయం గంటలు 10:30ని.లకు పై కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణ లను తెలుపుకొనవలయును. లేనిచో ఎక్సార్టీగా తీర్మానించబడునని తెలుసుకొనగలరు.

వాయిదా తేది: 24.12.2024

అన్నపురెడ్డి బాల్‌రెడ్డి
వాది తరపు న్యాయవాది
కనిగిరి, ప్రకాశం జిల్లా
సెల్: 9293335550

13-11Pg5.qxd:13-11Pg5.qxd 01/01/01 8:00 AM Page 1



# ట్రంప్ విదేశాంగమంత్రిగా మార్కో రుబియో



**వాషింగ్టన్, నవంబరు 12:** అమెరికా కొత్త అధ్యక్షుడుగా బాధ్యతలుచేపట్టబోతున్న రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్ తన కొత్తకేబినెట్ కూర్పులు చేపట్టారు. ఇప్పటికే శ్వేతసౌధం చీఫ్‌ఆఫ్ స్టాఫ్‌గా తన ప్రచారకర్తను నియమించుకున్న ట్రంప్ తన విదేశాంగమంత్రిగా సెనేటర్ మార్కో రుబియోను నియమించాలని నిర్ణయించారు. రుబియో, కాంగ్రెస్ ప్రతినిధి మైఖేల్ వాల్జ్ ఇద్దరూ కూడా జాతీయ భద్రతా సలహాదారు పోస్టుకోసం రేసులో ఉన్నారు. చైనాపై వీరిద్దరు నిరంతరం దేగకళ్లతోనే ఉంటారు. వీరిద్దరూ కూడా ఫ్లోరిడా రాష్ట్రానికి చెందినవారే. ట్రంప్ అమలుచేసిన అమెరికా ఫస్ట్ విదేశాంగ విధానానికి రూపకర్తలు కూడా వీరే. అలాగే ఉక్రెయిన్, మధ్యప్రాచర్యంలో యుద్ధాలను విరమింపచేస్తామన్న నినాదం కూడా వీరు ప్రవేశపెట్టినదే. 78 ఏళ్లట్రంప్ రెండోసారి అధ్యక్షపదవిలో తనకు నచ్చినవారినే నియమించుకుంటానని ముందే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇమ్మిగ్రేషన్ అధికారి టామ్ హోమాన్‌ను బోర్డర్ సిజార్‌గా ప్రకటించారు. అక్రమ వలసదారులను ఆయన సమర్ధవంతంగా తిరిగి వెనక్కు అప్పగించే సామర్ధ్యం ఉన్నవారని ట్రంప్‌కు ప్రగాఢ విశ్వాసం. ముస్లిం బ్యాన్ ఇమ్మిగ్రేషన్ విధానాన్ని రూపకల్పనచేసిన స్టీఫెన్ మిల్లర్‌ను డిప్యూటీ చీఫ్‌ఆఫ్ స్టాఫ్‌గా నియమించుకోవాలని భావిస్తున్నట్లు వైట్‌హౌస్ వర్గాలు చెపుతున్నాయి.

ఇక న్యూయార్క్ కాంగ్రెస్ ప్రతిని ఎలైస్ స్టేఫానిక్ ఐక్యరాజ్యసమితి రాయబారిగా నియమితులయ్యారు. స్టెఫానిక్ ముందునుంచి కూడా ఇజ్రాయెల్ మద్దతుదారుగా నిలిచారు. ఆయనకు రాజకీయ మిత్రునిగా పనిచేసిన లీ జెల్డిన్‌ను పర్యావరణ పరిరక్షణ ఏజెన్సీ చీఫ్‌గా నియమిస్తారని అంచనా. రెండోసారి బాధ్యతలుచేపట్టబోతున్న ట్రంప్ తన కేబినెట్‌లో సమర్ధులయిన, తనకు విధేయులయిన ప్రతినిధులను మాత్రమే నియమించుకోవాలని చూస్తున్నారు. వ్యక్తిగతంగా తనకు విధేయులుగాను, సన్నిహితంగా మెలిగిన వారికిమాత్రమే ఈసారి కేబినెనట్‌లో చోటుంటుందని ట్రంప్‌చర్యలు ఇప్పటికే స్పష్టంచేసాయి. అంతేకాకుండా ఎన్నికల్లో మోసంచేసానన్న తన అభియోగాలపై తనకు అండగా నిలిచినవారిని కూడా ట్రంప్ అక్కున చేర్చుకుంటున్నారు. రుబియో నామినేషన్‌పై ఇప్పటికే విభిన్న వ్యాఖ్యలు వ్యక్తం అవుతున్నాయి. 2016లో వీరిద్దరూ కూడా రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థిగా పోటీపడ్డారు. రుబియో తన వ్యాఖ్యల్లోట్రంప్‌ను అత్యంత నీచమైన వ్యక్తి అని అధ్యక్షపదవికి అనర్హుడని విమర్శలుచేసిన సంగతి తెలిసిందే. క్యూబన్ వారసత్వం ఉన్న రుబియో పేరు మొదట విదేశాంగ విధాన రూపకల్పనలో తెరపైకి వచ్చింది. క్యూబాకు వ్యతిరేకంగాను, లాటిన్ అమెరికాలో ఆయనకున్న వామపక్ష మిత్రులు వెనిజులా పట్ల అనుసరించే విధానాల రూపకల్పనసందర్భంగా రుబియోపేరు విశ్వవ్యాప్తం అయింది.

**అమెరికా జాతీయ భద్రతా సలహాదారుగా మైక్ వాల్జ్**

మరోవైపు, అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టబోతున్న రిపబ్లికన్ నేత డొనాల్డ్‌ట్రంప్ తన పాలనవర్గం కూర్పును వేగవంతం చేశారు. ఇప్పటికే పలు కీలక బాధ్యతలకు నియామకాలు చేపట్టిన ఆయన.. తాజాగా అమెరికా తదుపరి జాతీయ భద్రతా సలహాదారుగా కాంగ్రెస్ సభ్యుడు మైక్ వాల్జ్‌ను నియమించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అమెరికా సైన్యంలోని ప్రత్యేక భద్రతా దళం అయిన గ్రీన్ బెల్ట్‌లో ఆర్మీ కల్నల్‌గా పదవీ విరమణ చేసిన వాల్జ్ 2019 నుంచి ప్రతినిధుల సభలో సభ్యుడిగా ఉన్నారు. ప్రస్తుతం ఇండియా కాకస్‌కు సహఅధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.




# మిస్ టీన్ యూనివర్స్‌గా భారత్‌కు చెందిన తృష్ణా రే!

**న్యూఢిల్లీ, నవంబరు 12:** ఈ యేడాది మిస్ టీన్ యూనివర్స్ కిరీటాన్ని భారత్‌కు చెందిన తృష్ణారే దక్కించుకున్నారు. ఇటీవల దక్షిణాఫ్రికాలోని క్లింబరీ వేదికగా ఈపోటీలు జరిగాయి. ఇందులో పెరూ, దక్షిణాఫ్రికా, బ్రెజిల్, కెన్యా, పోర్చుగల్, నమీబియా, నెదర్లాండ్స్ తో సహా వివిధ దేశాలకు చెందిన మోడళ్లు పాల్గొన్నారు. వీరిందరినీ వెనక్కినెట్టి మిస్ టీన్ యూనివర్స్ కిరీటాన్ని 19 ఏళ్ల తృష్ణా రే సొంతం చేసుకున్నారు. పెరూకు చెందిన అన్నే థోర్సెన్, నమీబియాకు చెందిన ప్రెషియస్ ఆంద్రీలు రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. తృష్ణా రే కల్నల్ దిలీప్ కుమార్ రే, రాజశ్రీ రేల కుమార్తె. ఈమెది ఒడిశా రాష్ట్రం. ప్రస్తుతం భువనేశ్వర్‌లో కెఐఐటి యూనివర్సిటీలో ఫ్యాషన్ టెక్నాలజీ చదువుతున్నారు. గతేడాది ఏప్రిల్‌లో జరిగిన మిస్ టీన్ యూనివర్స్ ఇండియా పోటీల్లో విజేతగా నిలిచిన ఈమె తాజాగా అంతర్జాతీయ వేదికగా జరిగిన పోటీలోనూ విజయం సాధించారు. ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకురాలు డా.అచ్యుత సమంత ఈ సందర్భంగా తృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన వీడియోను నిర్వాహకులు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయగా పలువురు నెటిజన్లు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు ఈమె విజయానికి సంబంధించిన విషయాలను కెఐఐటి ఇన్‌స్టిట్యూట్ తన వెబ్‌సైట్‌లో పోస్ట్‌చేసింది. ఈమె గెలుపు దేశానికి గర్వకారణమని అందులో పేర్కొన్నారు.



### చైనా వీసా కేసు

# జగదీష్ టైట్లర్, అభిషేక్ వర్మ నిర్దోషులు

**న్యూఢిల్లీ, నవంబరు 12:** చైనా వీసా కేసులో కాంగ్రెస్ నేత జగదీష్ టైట్లర్, ఆయుధాల వ్యాపారి అభిషేక్ వర్మలకు భారీ ఊరట లభించింది. ఈ కేసులో వీరిద్దరిని ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. కాంగ్రెస్ నేత లెటర్‌హెడ్‌తో నకిలీ లేఖను సృష్టించినట్లు నమోదైన కేసులో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఓ చైనా టెలికాం కంపెనీ అధికారులకు వీసా నిబంధనల్లో సడలింపు ఇవ్వాలని అభ్యర్థిస్తూ అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు కాంగ్రెస్ నేత లేఖ రాసినట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే ఫోర్జరీ లెటర్‌హెడ్ ఉపయోగించారని పేర్కొంటూ నాటి హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మాకెన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దీనిపై జగదీష్ టైట్లర్, అభిషేక్ వర్మలపై ఐపిసితో పాటు అవినీతి నిరోధక సెక్షన్ల కింద అభియోగాలు నమోదయ్యాయి. దర్యాప్తు చేపట్టిన సిబిఐ ఆయుధాల వ్యాపారి అభిషేక్ వర్మతో కలిసి జగదీష్ టైట్లర్ కుట్ర పన్నారని ఆరోపించింది. చైనా టెలికాం కంపెనీని మోసం చేసేందుకు ప్రయత్నించినట్లు అనుమానించింది. ఇందులో టైట్లర్‌ను సూత్రధారిగా పేర్కొంది. ఈ కేసులో గతంలో అర్టెయిన టైట్లర్ బెయిల్‌పై బయటకు వచ్చారు.

# ప్రధానిమోడీ, అమిత్‌షా బ్యాగేజి చెక్‌చేశారా?

## యవత్మాల్‌లో థాకరే బ్యాగేజి తనిఖీ వివాదం



**న్యూఢిల్లీ, నవంబరు 12:** యవత్మాల్‌లో పార్టీ ప్రచారంలో ఉన్న మాజీ ముఖ్య మంత్రి శివసేన థాకరే అధినేత ఉద్ధవ్ థాకరే బ్యాగేజిని ఎన్నికల అధికారులు తనిఖీలు చేయడం పెద్ద దుమారమేరేపింది. మాజీ ముఖ్య మంత్రి ఒక ఎన్నికల ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా ఎన్నికల అధికారులు ఆయన బ్యాగేజిని చెక్‌చేసారు. దీనితో రెండు శివసేన వర్గాల మధ్య పెద్ద ఎత్తున వాగ్వాదాలు నడిచాయి. థాకరేసేన కీలకనాయకుడు సంజయ్ రౌత్ వెంటనే స్పందించి అధికారపార్టీ కీలక నాయకులు ప్రధాని నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్‌షా, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండేల బ్యాగేజి తనిఖీలుచేసారా అని ప్రశ్నించారు. వారు ప్రచారంలోఉండగా వారి లగేజి తనిఖీచేసే దమ్ముందా అంటూ ప్రశ్నలువేసారు. షిండే సేన ప్రతినిధి కృష్ణహెగ్డే స్పందిస్తూ సంజయ్‌రౌత్‌కు ఆరోపణలు చేయడం అలవాటుగా మారిందని, సార్వత్రిక ఎన్నికల సమయంలో షిండే బ్యాగేజిని కూడా ఎన్నికల అధికారులు నాసిక్‌లో తనిఖీచేసింది గుర్తులేదా అని ప్రశ్నించారు. మా బ్యాగేజి, హెలికాప్టర్, ప్రైవేట్ జెట్; కార్లు అన్నింటినీ తనిఖీచేసారని, మా ఇళ్లనుకూడా తనిఖీచేసారని అయినా మాకేమి ఇబ్బందిలేదని, నిష్పాక్షికంగా జరగాలన్నదే మాడిమాండ్ అని అన్నారు.

సిఎం ఏక్‌నాథ్‌షిండే, డిప్యూటి సిఎంలు అజిత్ పవార్, దేవేంద్ర ఫడ్నవిస్‌లు పోటీచేస్తున్నపుడు 25 కోట్లు ఇప్పటికే చేరాయని సేన థాకరే నేత ఆరోపించారు. ఇప్పటికే 25 కోట్లు పంపిణీ చేసారని ఆయన ఆరోపించారు. థాకరే బ్యాగ్‌ను తనిఖీచేస్తున్న విడియోలు వైరల్ కావడంతో వివాదాస్పదం అయ్యాయి. మీరు మీ నిబంధనల ప్రకారం వెళితే మాకేమి అభ్యంతరం లేదంటూ సంజయ్‌రౌత్ పేర్కొన్నారు. మీకేది కావాలంటే అది తనిఖీచేయండి, దేవేంద్ర ఫడ్నవిస్, నరేంద్రమోడీ, అమిత్‌షా లగేజిలు కూడా చెక్‌చేసారా అని ఉద్ధవ్‌థాకరే సైతం ధ్వజమెత్తారు. దీనితో తనిఖీచేసిన అధికారులు లేదని చెప్పడంతో ఆయన మరింత ఆగ్రహం వ్యక్తంచేసారు. వాని అసెంబ్లీ సీటుకోసం చేస్తున్న ప్రచారంలో థాకరే ఈ సంఘటనను వెల్లడించారు. తనిఖీలకు ముందు వారి గుర్తింపును వివరించాల్సిన అవసరం ఉందని గుర్తుచేసారు. ప్రతి ఎన్నికల్లోను ఈ తనిఖీలపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. ప్రతి పార్టీ లేదా కూటమి నాయకులు పెద్దపెద్ద వ్యాన్లలో భారీ మొత్తాలను ఓట్లను కొనుగోలు చేసేందుకు తీసుకెళుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తడం ఆపై వారిని సమగ్ర తనిఖీలు చేయడం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. థాకరే బ్యాగేజి చెక్‌చేయడంపై ఎన్నికల సంఘం వివరణ ఇస్తూ ఎన్నికల ప్రోటోకాల్స్ విధిగా పాటించారని, రాజకీయ నేతల హెలికాప్టర్లు కూడా తనిఖీచేస్తారని అన్నారు.

ఏప్రిల్‌జూన్ సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఇదే తనిఖీచేసామని, అమిత్‌షా హెలికాప్టర్లను కూడా తనిఖీలు చేసామన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఈనెల 20వ తేదీ జరగనున్నాయి. మూడురోజుల తర్వాత ఫలితాలు వెల్లడికానున్నాయి. థాకరే సేన గ్రూప్ కాంగ్రెస్, శరద్ పవార్ ఎన్సీపీతో జట్టుకడితే బిజెపి, షిండేసే, అజిత్‌పవార్ ఎన్సీపీలు మహాయుతిగా ఎన్నికల్లో పోటీచేస్తున్న సంగతి తెలిసిందే.

# ఇన్నోవా, ట్రక్కు ఢీ ఆరుగురు మృతి



[illegible], నవంబరు 12: [illegible] రోడ్డుప్రమాదం విషాదాన్ని నింపింది. ఆ రాష్ట్ర రాజధాని డెహ్రాడూన్‌లో జరిగిన కారుప్రమాదంలో ఆరుగురు విద్యార్థులు మృతిచెందారు. ట్రక్కు, ఇన్నోవా కారు ఢీకొన్న ప్రమాదంలో వీరు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున రెండు గంటలకు ఒఎన్జీసి కూడలివద్ద ఈప్రమాదం జరిగింది. కారులో ఏడుగురు విద్యార్థులున్నారు. వారిలో ముగ్గురు యువతులు, ముగ్గురు యువకులు ఉన్నారు. వీరుమొత్తం స్పాట్‌లోనే చనిపోయారని పోలీసులు వెల్లడించారు. ఒకే ఒక్కడు మాత్రం స్వల్పగాయాలతో బయటపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆతన్ని ఆసుపత్రికి తరలించారు. విద్యార్థులంతా ఒక ప్రైవేటు కళాశాలలో చదువుతున్నట్లు తేలింది.

భీకరంగా ట్రక్కు ఢీకొనడంతో ఇన్నోవా ముక్కలయింది. కారును కట్‌చేసి మృతదేహాలను వెలికి తీసారు. ట్రక్కుడ్రైవర్ అక్కడినుంచి పరారయ్యాడు. దూన్ ఆసుపత్రికి విద్యార్థుల మృతదేహాలను పోస్టుమార్టంకోసం పంపించారు. గాయపడిన విద్యార్థిని మహంత్ ఇంద్రేశ్ ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో ఢిల్లీ హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన విద్యార్థులున్నట్లు అంచనా వేస్తున్నారు.

# కేంద్రమంత్రిపై 'కాలియా' వ్యాఖ్యల దుమారం

## కాంగ్రెస్ జమీర్ అహ్మద్‌ఖాన్ వర్సెస్ మాజీ సిఎం కుమారస్వామి





**బెంగళూరు, నవంబరు 12:** కేంద్ర మంత్రి కుమారస్వామిని 'కాలియా' అంటూ వ్యాఖ్యలు చేసిన కర్ణాటక మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ స్పందించారు. తను వ్యాఖ్యలు ఇలా ఆయనపై చేయడం కొత్తేమీ కాదని ఆయనకూడా తనపై వ్యాఖ్యలుచేసిన సందర్భాలున్నాయని అన్నారు. జెడిఎస్ నేత, కేంద్ర మంత్రి కుమారస్వామిని కాలియా అంటూ సంభోదించడంపై పెద్ద ఎత్తున దుమారం రేగింది. తాము అత్యంత సన్నిహిత మిత్రులుగా ఉన్నపుడు కుమారస్వామి తనను మరుగుజ్జు అని లేదా పొట్టి అని పిలిచిన సందర్భాలున్నాయని, అలాగే తాను సైతం ఆయన్ను కాలియా అంటూ పిలిచేవాడినని గుర్తుచేసారు. ఇలా అనుకోవడం మాకేమి కొత్తకాదని అయినాకూడా తనవ్యాఖ్యలు ఆయన్ను బాధించి ఉంటే క్షమాపణలు చెప్పేందుకు సిద్ధమేనన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఖాన్ సిద్ధరామయ్య ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసారు. హౌసింగ్, వక్ఫ్, మైనార్టీ సంక్షేమ శాఖలను పర్యవేక్షిస్తున్నారు. చన్నపట్న అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి సిపి యోగేశ్వరకోసం ఆయనప్రచారానికి వచ్చారు. సార్వత్రిక ఎన్నికలకుముందు బిజెపిలోకి వెళ్లిన యోగేశ్వర మళ్లీ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. కుమారస్వామి కుమారుడు నిఖిల్‌పై ఆయన పోటీచేస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే కుమారస్వామి లోక్‌సభకు ఎన్నికవడంతో ఆస్థానానికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. పార్టీలో కొన్ని అభిప్రాయ భేదాల కారణంగా ఆయన వీడివెళ్లిపోయారని, స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసారని, బిజెపిలో చేరాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అయితే ఆయన జెడిఎస్‌లో చేరేందుకు సిద్ధంగా లేరని, కాలియా కుమారస్వామి బిజెపికంటే ఎంతోప్రమాదకరమని ఆయన అన్నారు. ఇపుడు ఆయన సొంతింటికి తిరిగి వచ్చేసారని అన్నారు.

ఈ సందర్భంగానే ఆయన ప్రయోగించిన కాలియా పదం వివాదాన్ని రేకెత్తించింది. వర్ణ వివక్ష వ్యాఖ్యలుచేసారని విమర్శలు వెల్లువెత్తాయి. కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు కూడా కుమారస్వామిపై చేసిన వ్యాఖ్యలకు మండిపడ్డారు. కాంగ్రెస్‌మంత్రి జమీర్ అహ్మద్ చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగబద్ధం కావని ఆయన వర్ణ వివక్ష వ్యాఖ్యలుచేసారన్నారు. గతంలో రాహుల్ గాంధీ సలహాదారు కూడా దక్షిణాది భారతీయులు ఆఫ్రికన్లుగా ఉంటారని, ఈశాన్య ప్రాంతాలవారు చైనీయులుగాను, ఉత్తర భారతీయులు అరబ్బులుగాను ఉంటారన్న వ్యాఖ్యలను ఈసందర్భంగా కిరెన్‌రిజిజు గుర్తుచేసారు.

# కిమ్, పుతిన్ మధ్య రక్షణ ఒప్పందం



**ప్యాంగాంగ్, నవంబరు 12:** ఉత్తరకొరియా, రష్యా మధ్య స్నేహం మరింత బలపడుతోంది. శత్రు దేశం నుంచి దాడి జరిగితే ఈ రెండు ఒకదానికొకటి సహకరించుకునేలా రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. జూన్‌లోనే దీనిపై సంతకాలు జరిగాయని ఉత్తరకొరియా మీడియా తాజాగా వెల్లడించింది. ఉక్రెయిన్ యుద్ధం, కొరియా ద్వీపకల్పంలో అమెరికా మిత్రపక్షాల మధ్య పెరుగుతోన్న సైనిక భాగస్వామ్యంతో కిమ్, పుతిన్ ప్రభుత్వాలు మరింత దగ్గరవుతున్నాయి. ఈ రెండు దేశాల స్నేహం పాశ్చాత్య దేశాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తోన్న రష్యాకు సహకరించేందుకు ఉత్తరకొరియా వేలాదిమంది తన సైనికులను పంపిందని కథనాలు వెలువడ్డాయి. దాదాపు 11 వేల మంది కిమ్ సైనికులు తూర్పు రష్యాలో శిక్షణ పొందుతున్నారని ఉక్రెయిన్ వర్గాలు ఇటీవల పేర్కొన్నాయి. శిక్షణ అనంతరం వీరు కదన రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఈ యేడాది రష్యాలో కిమ్ ఉత్తర కొరియాలో పుతిన్ పర్యటించిన సంగతి తెలిసిందే. 24 యేళ్లలో తొలిసారిగా ఉత్తర కొరియాలో రష్యా అధ్యక్షుడు పర్యటించారు. ఆ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ ఉత్తర కొరియాలో సైనిక, సాంకేతిక సహకారాన్ని అభివృద్ధి చేసుకునే అంశాన్ని తోసిపుచ్చలేమన్నారు. భద్రత, అంతర్జాతీయ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించామనిచెప్పారు. ఇదిలా ఉంటే ఉక్రెయిన్, రష్యాయుద్ధంలో ఉత్తరకొరియా జోక్యం చేసుకోవడం సమంజసం కాదని ఈ చర్య ఉన్న పరిస్థితిని మరింత తీవ్రతరం చేయడమేనని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే గతంలో ఆందోళన వ్యక్తంచేశారు. ఒకవేళ ఉత్తర కొరియా సైనికులు ఉక్రెయిన్ యుద్ధంలోకి చొరబడితే కచ్చితంగా వాళ్లుకూడా లక్ష్యాలుగా మారతారని అమెరికా హెచ్చరించింది. తమతో జరిగిన పోరాటంలో పాల్గొన్న కిమ్ సైన్యం కీవ్ దళాల చేతుల్లో మరణించినట్లు ఇటీవల జెలెన్‌స్కీ వెల్లడించారు. తాము కఠినచర్యలు తీసుకోకపోతే అక్కడ మరిన్ని బలగాలు మోహరించే అవకాశం ఉందన్నారు. అయితే ఎంతమంది సైనికులు మృతి చెందారన్న దానిపై స్పష్టత లేదన్నారు.

# ప్రముఖ బెంగాలీ నటుడు మనోజ్‌మిత్రా కన్నుమూత



**కోల్‌కత్తా, నవంబరు 12:** ప్రముఖ బెంగాలి చలనచిత్ర నటుడు మనోజ్‌మిత్ర 85వ ఏట కన్నుమూసారు. బెంగాలి చిత్రపరిశ్రమలోని ప్రముఖ నటుల్లో మనోజ్‌మిత్రా ఒకరు. నటుడు, డైరెక్టర్‌గానే కాకుండా థియేటర్ ఆర్టిస్ట్‌గా పేరు ప్రఖ్యాతులు పొందారు. వృద్ధాప్యసంబంధిత సమస్యలతో ఆయన కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈనెల 3వతేదీనే ఆయన్ను ఆసుపత్రిలో చేర్పించారు. అయినా ఇప్పటికీ కోలుకోలేదని, మంగళవారం ఉదయం 8.50 గంటలకు కన్నుమూసారని ఆయన అన్నారు. నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేరిన మిత్రా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. సత్యజిత్‌రే, తపన్‌సిన్హా, బసుఛటర్జీ, శక్తి సామంతా వంటి ప్రముఖ దర్శకులతో కలిసి పనిచేసారు. 1980లోవచ్చిన బంచార్మర్ బాగన్ చిత్రంతో ఆయన చిత్రసీమలో పాపులర్ నటుడుగా మారిపోయారు. గతంలోసెప్టెంబరు 20వ తేదీ కూడా ఒకపర్యాయం శ్వాసకోస ఇబ్బందులతో మనోజ్‌మిత్రా ఆసుపత్రిలో చేరారు. సోడియం, పొటాషియం వంటివి కొరత ఉన్నాయని, ఇతరత్రాకూడా సంక్లిష్టసమస్యలు వచ్చినట్లు తేలింది. సెప్టెంబరునెల చివరిలో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. సత్యజిత్‌రే చిత్రాలు ఘరే బైరే, ఘనశత్రు వంటి చిత్రాల్లోకూడా ఆయన కనిపించారు. సత్యజిత్‌రాయ్‌తర్వాత బుద్ధదేవ్ దాస్‌గుప్తా, తరుణ్‌మంజుందార్, గౌతమ్‌ఘోష్ వంటి ప్రముఖ దర్శకుల సినిమాల్లోకూడా నటించారు.

### ట్రంప్ ఎన్నికతో అమెరికాలో

# గర్భనిరోధక పిల్స్‌కు భారీ డిమాండ్

**వాషింగ్టన్, నవంబరు 12:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిగా డొనాల్డ్‌ట్రంప్ జయకేతనం ఎగురవేయడంతో ఇపుడు దేశం మొత్తం గర్భనిరోధక మాత్రలకు భారీ డిమాండ్ ఏర్పడింది ఒక్కరోజులోనే వీటికోసం పదివేలకు పైగా అభ్యర్థనలు రావడం విశేషం. ట్రంప్ అధికారంలోకి వస్తే గర్భవిచ్ఛిత్తి హక్కును నిషేధిస్తారంటూ వదంతులు రావడంతో మాత్రల కొనుగోళ్లు భారీగా పెరిగినట్లు మందుల షాపు వ్యాపారులు వెల్లడించారు. ప్రత్యేకించి అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించిన తర్వాత వీడికి డబుల్ డిమాండ్ ఏర్పడింది. 24 గంటల్లోనే అబార్షన్ మాత్రలకోసం 10వేలకుపైగా అభ్యర్థనలువచ్చాయి. ఇదిరోజూ ఉండే డిమాండ్ కంటే 17 రెట్లు ఎక్కువని తేలింది. గర్భిణులు కానివారుసైతం ప్రిస్క్రిప్షన్‌కోసం ముందస్తుగా సంప్రదిస్తున్నారని ఒక ఎన్జీవో సంస్థ ప్రకటించింది. తమవద్దకు వచ్చిన 125 ఆర్డర్లలో 22 మంది గర్భిణిలు కానివారేనని సంస్థ ప్రకటించింది. ఎన్నికలకు ముందు గర్భవిచ్ఛిత్తి మాత్రలు ఎక్కడ లభిస్తాయి అన్న సమాచారంకోసం నిత్యం నాలుగునుంచి 4500 మందివరకూ తమ వెబ్‌సైట్‌చూసేవారని ఎన్నికల ఫలితాలు వచ్చాక అలా చూసేవారి సంఖ్యలోభారీ మార్పు వచ్చిందని స్వచ్ఛంద సంస్థ ఒకటి వెల్లడించింది. ఇపుడు కేవలం ఒక్కరోజులోనే 82 వేల మందికి పైగా వెబ్‌సైట్‌ను చూస్తున్నారని దీనితోపాటు గర్భనిరోధక పరికరాలు, వేసెక్టమీ శస్త్ర చికిత్సలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆ ఎన్జీఓ వెల్లడించింది.

ట్రంప్ బాధ్యతలు స్వీకరించినతర్వాత అబార్షన్ హక్కుపై నిషేధం విధిస్తారన్న ఆందోళనతో ముందుగానే మాత్రలు నిల్వచేసుకుంటున్నట్లు జాతీయ అబార్షన్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిటనీ ఫోంటెనో అన్నారు. ఇలా అబార్షన్ మాత్రలను నిల్వచేసుకోవడం ఇదే తొలిసారికాదు. గతంలో 2022 మేనెలలో గర్భవిఛ్చితికి వ్యతిరేకంగా చట్టం తీసుకువస్తారని ప్రచారంజరిగింది. ఆ సమయంలోకూడా ఈ పిల్స్‌కు విపరీతమైన గిరాకీ ఏర్పడింది.

# కంగనా రనౌత్‌కు ఆగ్రా కోర్టు నోటీసులు!

**లక్నో, నవంబరు 12:** ప్రముఖ బాలీవుడ్ నటి, బిజెపి ఎంపి కంగనా రనౌత్ చిక్కుల్లో పడ్డారు. రైతులపై అవమానకర వ్యాఖ్యలు చేసిన కేసులో కంగనాకు ప్రత్యేకకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆగ్రాలోని రాజీవ్‌గాంధీ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రామశంకర్ శర్మ, సీనియర్ న్యాయవాది ఈ యేడాది సెప్టెంబరు 11న కంగనాపై కేసు వేశారు. గత ఆగస్టు 27న పత్రికల్లో కంగనా చేసిన వ్యాఖ్యలు ఆధారంగా ఆయన కేసు నమోదు చేశారు. కేంద్రం తీసుకువచ్చిన చట్టాలను వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టిన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే బంగ్లాదేశ్ తరహా అశాంతి పరిస్థితులకు దారితీసే అవకాశం ఉండేదంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన పోరాటంలో మృతదేహాలు వేలాడుతూ కనిపించాయని, లైంగిక దాడులు చోటుచేసుకున్నాయని.. సాగు చట్టాలను వెనక్కి తీసుకున్నా నిరసనలు కొనసాగేలా విదేశీ శక్తులు, స్వార్థ ప్రయోజనాలను ఆశించే వారు నిరసనలను ప్రోత్సహించారని ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో ఏం జరిగిందో ఇక్కడ కూడా జరిగే అవకాశం ఉంది, విదేశీ శక్తులు ఇందుకు కుట్ర పన్నాయంటూ ఆరోపించారు.

ఈ వ్యాఖ్యలు దుమారం రేపాయి. అదే సమయంలో ఆమె వ్యాఖ్యలకపై బిజెపి నేతలు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, కంగనా రనౌత్ దేశంలోని కోట్లాది మంది రైతులను అవమానించారని రామశంకర్ శర్మ ఆరోపించారు.

# బోగస్ ఇన్వెస్ట్ స్కీంతో రూ.42 లక్షలకు టోకరా

**న్యూఢిల్లీ, నవంబరు 12:** రాజస్థాన్‌లోని అజ్మేర్‌కు చెందిన 19 యేళ్ల యువకుడు 200 మందిని 42లక్షలమేరకు మోసం చేసినట్లు తేలడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బోగస్ ఇన్వెస్ట్‌మెంట్ పథకం అంటూ ప్రచారం చేసి ఇన్వెస్టర్లను మోసంచేసినట్లు తేలింది. ఖాషిష్ మీర్జా 11వతరగతి విద్యార్థి సోషల్‌మీడియా యూజర్లే టార్గెట్‌గా బోగస్ హామీలు ఇస్తూ భారీ ఎత్తున లాభాలు గడిస్తారంటూ నమ్మబలికి వారిని ముంచేసినట్లు పోలీసులు గుర్తించారు. మీర్జా సోషల్‌మీడియా ఇన్ఫ్లూయెన్సర్ అని ఇన్‌స్టాలో భారీ సంఖ్యలో ఫాలోవర్లు కూడా ఉన్నారన్నారు. బాధితులందరికీ 1,39,999 రూపాయలు అందుకుంటారని, 99,999 రూపాయలు పెట్టుబడిపెడితే 13 వారాల్లోనే లాభాలు పెరుగుతాయంటూ మోసంచేసినట్లు తేలింది. ప్రాథమికంగా కొందరు ఇన్వెస్టర్లకు లాభాలుచూపించాడు. దీనితో వారు మరికొందరికి చెప్పడంతో లాభాలు భారీ వస్తాయని ఆశలు పెంచాడు. మొత్తం బోగస్ అని తేలినతర్వాత పోలీసులు ఆతడినుంచి హుంబయి వెర్నా, నగదు లెక్కింపు మెషిన్, ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనంచేసుకున్నారు. ఆతడిని రెండు రోజులపాటు పోలీస్ రిమాండ్‌కు పంపించారు. ఇలాంటి స్కీమ్‌లపట్ల అప్రమత్తంగా ఉండాలంటూ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# సామాజిక మాధ్యమాల్లో నాపై తప్పుడు పోస్టింగులు పెట్టిస్తున్నారు

## - పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

**విజయవాడ,నవంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్దేశపూర్వకంగా సామాజిక మాధ్యమాల్లో తన అన్న తనపై తప్పుడు పోస్టింగులు పెట్టిస్తున్నారని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. తన సోదరుడు, వైసీపీ అధినేత జగన్ పై మరో పర్యాయం తీవ్ర ఆరోపణలు చేశారు. సోషల్ మీడియాలో తాను కూడా బాధితురాలేనని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టుల ద్వారా తనపై ప్రచారం వెనుక ఉన్నది జగనే అని స్పష్టం చేశారు. నాపై దుష్ప్రచారం జరుగుతుంటే ఆయన ఆపలేదు... దానర్థం ఏమిటి? ఆ అసభ్యకర ప్రచారాన్ని ఒకరకంగా ఆయన ప్రోత్సహించినట్టే కదా! అని షర్మిల వ్యాఖ్యానించారు. జగన్ వద్దు అని చెప్పి ఉంటే ఆ ప్రచారం అప్పుడే ఆగిపోయి ఉండేదని అన్నారు. వైసీపీ సోషల్ మీడియా ఓ సైతాన్ ఆర్మీలా తయారైందని పేర్కొన్నారు. వాళ్లకు వ్యతిరేకంగా ఉండేవారిపై సోషల్ మీడియాలో దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలు రాజకీయాల్లో కొనసాగాలంటే భయపడే పరిస్థితి తెచ్చారని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పుడు పట్టుబడ్డ వాళ్లంతా విషనాగులేనని, ఆ సోషల్



మీడియా విషనాగులతో పాటు అనకొండను కూడా అరెస్ట్ చేయాల్సిన అవసరం ఉందని షర్మిల ఉద్ఘాటించారు. ఇక, అసెంబ్లీ సమావేశాలకు వెళ్లను అనడం జగన్ అహంకారానికి నిదర్శనం అని విమర్శించారు. జగన్ కు ఒకప్పుడు 151 స్థానాలు ఇచ్చిన ప్రజలు, ఇప్పుడు 11 స్థానాలకే పరిమితం చేశారని, జగన్ అక్రమాలు, అవినీతిని ప్రజలు గమనించారని షర్మిల వివరించారు. ప్రజల తీర్పుపై జగన్ కు గౌరవం ఉండాలని హితవు పలికారు. సభలో మైకు ఇవ్వలేదంటే, అది మీ స్వయంకృతాపరాధమే అని వ్యాఖ్యానించారు. వైసీపీ ఎమ్మెల్యేలకు ప్రజలు ఓట్లు వేసింది అసెంబ్లీకి వెళ్లడానికి కాదా? మరి ప్రజల ఓట్లతో గెలిచి అసెంబ్లీకి హాజరుకాకపోవడం అంటే ప్రజలను వెన్నుపోటు పొడిచినట్టు కాదా? అని షర్మిల విమర్శించారు.

అసెంబ్లీకి గైర్హాజరవడం ద్వారా వైసీపీ ఎమ్మెల్యేల అజ్ఞానం ఏంటో బయటపడిందని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేటప్పుడు, అసెంబ్లీకి వెళ్లబోమని చెప్పి ఓట్లు అడిగారా? అని నిలదీశారు. మీకు సత్తా లేకపోతే రాజీనామా చేయండి అంటూ డిమాండ్ చేశారు.



**విజయనగరం, నవంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి :**

# మాదక ద్రవ్యాలను సంకల్పంతో నియంత్రిద్దాం

## - విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టి

యువత మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా చూడడంతో పాటు వాటి అలవాటు నుంచి వారిని దూరం చేసేందుకు, వారిలో చైతన్యం నింపేందుకు విశాఖ రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాల్లో సంకల్పం కార్యక్రమాన్ని చేపట్టామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు రూపొందించిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా పోలీసు శాఖ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతి రోజూ చర్యలు చేపడుతుందని ఆయనన్నారు. విజయనగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మంగళవారం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆధ్వర్యంలో జరిగిన సంకల్పం కార్యక్రమంలో డీఐజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని డ్రగ్స్‌ను న్యాయబద్ధంగా తయారు చేస్తూ వైద్యంలో వినియోగిస్తుంటే మత్తు కలిగించే గంజాయి, నల్ల మందు పంటలను అక్రమంగా పండిస్తున్నారన్నారు. ఇటీవల కాలంలో పది వేల ఎకరాల్లో గంజాయి పంటను నాశనం చేసి మూడు వేల మందిని అరెస్టు చేశామన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల ప్రభావం ఏవిధంగా ఉంటుంది, మాదక ద్రవ్యాల ప్రభావం వ్యక్తుల కేరియర్‌ను, మానవ జీవితాలను ఏ విధంగా నాశనం చేస్తాయన్న విషయాలు వైద్య వృత్తిలో ఉన్న విద్యార్థులకు తెలుసునన్నారు. డ్రగ్స్ నియంత్రణ అన్నది సమాజానికి పెద్ద ఛాలెంజ్‌గా మారిందన్నారు. మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు అరెస్టులతో పాటు ఆ యా మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించడంతో సమాజానికి మేలు జరుగుతుందన్నారు. విద్యార్థులు ఒక్కసారి డ్రగ్స్‌ను వినియోగిస్తే ఏమీ కాదన్న భ్రమలో ఉంటారని, కానీ వాస్తవాన్ని ప్రతీ ఒక్కరూ గ్రహించాలన్నారు. విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మశీల, ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎస్.అప్పలనాయుడు, పలు వురు సిఐలు, ఎస్.ఐలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 10వ తరగతి విద్యార్థి ఆత్మహత్య

**విశాఖపట్నం, నవంబర్ 12, ప్రభాతవార్త** నగరంలో గోపాలపట్నం 89వ వార్డు యల్లపువాని పాలెంలో విషాధం నెలకొంది. 10వ తరగతి చదువుతున్న విద్యార్థి నిఖిల్వేశ్వరరావు అనే విద్యార్థి మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డడు. ఆయనకు ఆరోగ్య బాగుండలేక కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికులు సమాచారం మేరకు ఘటన స్థలానికి గోపాలపట్నం పోలీసులు చేరుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న గోపాలపట్నం పోలీసులు పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

# లోకో పైలట్‌లు అప్రమత్తంగా ఉండాలి

## రైల్వే భద్రతా సమావేశంలో జిఎం అరుణ్‌కుమార్ జైన్

**గుంతకల్లు రైల్వే,నవంబరు 12,ప్రభాతవార్త** రోజురోజుకు చలితీవ్రత పెరుగుతున్నందున శీతాకాలంలో రైల్వే లోకో పైలట్‌లు అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వర్తించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ కోరారు. తెలుగు రాష్ట్రాల రైల్వే భద్రతా సమీక్ష సమావేశం మంగళవారం రైల్ నిలయంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన భద్రతాధికారి కె వెంకట రమణారెడ్డి, పిసిసిఎం కె.పద్మజ,పిసిఎండి డాక్టర్ సి.కె. వెంకటేశ్వర్లు ఆయా విభాగాలకు చెందిన సంబంధిత ప్రధాన ఉన్నతాధికారులతో పాటు,వీడియో కాన్ఫరెన్స్‌లో గుంతకల్లు డిఆర్ఎం విజయ్‌కుమార్ సహా హైదరాబాద్,సికింద్రబాద్, విజయవాడ,గుంటూరు,నాందెడ్ డివిజన్‌లకు చెందిన డిఆర్ఎంలు పాల్గొన్న ఈ సమావేశంలో జిఎం జైన్ మాట్లాడుతూ పొగమంచు గుర్తించే పరికరాల సహాయంతో శీతాకాలంలో రైళ్ల సమయపాలన,భద్రత నిర్ధారణలను దృష్టిలో ఉంచుకుని రైలు మార్గాల నిర్వహణ సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వర్తించాలన్నారు. జోన్‌లో మంచును,పొగను గుర్తించే పరికరాలు,అగ్నిమాపక పరికరాల నిల్వల స్థితిగతులపై చర్చించి అన్నిరకాల అగ్నిమాపక భద్రతా పరికరాలను సరిపడా నిల్వలు ఉండేలా చూడాలన్నారు. శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తగినంత నిల్వలు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. భద్రతా మార్గదర్శకాలు,సురక్షితమైన పని పద్ధతులను పాటిస్తూ ఆకస్మిక భద్రతా తనిఖీలను ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. ఎలాంటి పొరపాట్లు జరుగకుండ అన్ని రైల్వే సైడింగ్‌ల వద్ద లోడింగ్/అన్‌లోడింగ్ పాయింట్‌ల వద్ద సిసి కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. జోన్‌వ్యాప్తంగా లెవెల్ క్రాసింగ్ గేట్ల తొలగింపు స్థితిగతులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. రోడ్ అండర్ బ్రిడ్జిలు(ఆర్‌యుబి) రోడ్ ఓవర్ బ్రిడ్జిల(ఆర్ఓబి) నిర్మాణాలను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.




భద్రతపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే జీఎం ఎ.కె జైన్

# హామీలు అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్‌చేస్తున్నారు

## - సిఎం చంద్రబాబుపై వైఎస్సార్సీ నేత బి.కరుణాకర్‌రెడ్డి ధ్వజం

**చిత్తూరు, నవంబర్ 12 ప్రభాతవార్త:** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రతి నెలా ఏదో ఒక డైవర్షన్ పాలిటిక్స్‌తో రాజకీయం చేసి సిఎం నారా చంద్రబాబు నాయుడు ప్రజలను ప్రక్కతోవ పట్టిస్తున్నారని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైకాపా అధ్యక్షులు బి.కరుణాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. చిత్తూరు వైకాపా కార్యాలయంలో మంగళవారం చిత్తూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి అధ్యక్షతన చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లా వైకాపా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వంను తరిమికొట్టడానికి ప్రతి వైకాపా నాయకులు, కార్యకర్త కలసికట్టుగా పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. పార్టీలో కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు తప్పకుండా లభిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో రాష్ట్ర వైకాపా అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, చిత్తూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి నాయకత్వంను బలపరచడానికి తాను ఒక సైనికుడిగా పని చేస్తానన్నారు. అలాగే భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో చిత్తూరు నుండి ఎంసి విజయానందరెడ్డిని గెలిపించడానికి ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. మాజీ డిప్యుటీ సిఎం నారాయణస్వామి మాట్లాడుతూ ప్రస్తుత సిఎం నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారం చేజిక్కించుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నప్పటికీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని ఇప్పటి వరకు సిఎం నారా చంద్రబాబు నాయుడు అమలు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తూ సిఎం నారా చంద్రబాబునాయుడు తనకు కావాల్సిన వారికి నిధులు కుమ్మరిస్తున్నారని ధ్వజమెత్తారు. పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని వైకాపా కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైకాపా సోషల్ మీడియా కార్యకర్తలను పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు జనసేన పార్టీ అధ్యక్షుడి హోదాలో ఏది పడితే అది మాట్లాడిన ప్రస్తుత డిప్యుటీ సిఎం పవన్‌కళ్యాణ్ ప్రస్తుతం ఏమి చేయలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో జిల్లా పార్టీ అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.



వైఎస్సార్సీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైకాపా అధ్యక్షులు బి.కరుణాకర్‌రెడ్డి.

చిత్తూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో అమలు కాని హామీలు ఇచ్చి అధికారం చేజిక్కించుకున్న సిఎం నారా చంద్రబాబు నాయుడును ప్రజలు ప్రస్తుతం ప్రశ్నిస్తున్న ప్పటికీ సమాధానాలు ఇవ్వడం లేదన్నారు.

# ఏడేళ్ల చిన్నారిపై అత్యాచారం!

**నంద్యాల,నవంబరు 12,ప్రభాతవారతప్రతినిధి** మానవునిమేదాశక్తి నానాటికి పెరిగే కొలది మనుషులు మృగాలుగా మారుతున్నారు. ఏడు సంవత్సరాల చిన్నారిపై అత్యాచారం చేసిన సంఘటన నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలంలోని కొలుములపల్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది, బేతంచెర్ల మండలంలోని కొలుముల పల్లి గ్రామంలో 7 సంవత్సరాల చిన్నారి ఇంటి బయట ఆడుకుంటుండగా ఇంటిపక్కలో ఉన్న ఎల్లయ్య 35 సంవత్సరాలు వయస్సు ఉండే మానవ మృగం ఆ చిన్నారిని ఈ నెల 7 తేదిన అత్యాచారం చేశాడు. చిన్నారికి తీవ్ర రక్త స్రావం కావడంతో చిన్నారి కేకలు వేసింది. ఆ చిన్నారి కేకలు విన్న స్థానికులు కామాంధుని పట్టుకునేందుకు ప్రయత్నిం చేశారు కాని పలితం లేదు. తప్పించుకుని పరార్ అయ్యాడు. బేతంచెర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా ఫోక్స్ చట్టం కింద కేసు నమోదు చేసుకుని కామాందుని కోసం గాలిస్తున్నారు.

# గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులకు రూ. 2.27 కోట్ల నిధులు విడుదల : మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి

**విజయవాడ,నవంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 6 గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుల ఫీజిబులిటీ స్టడీ కోసం రూ. 2.27 కోట్ల నిధులు విడుదల చేయనున్నట్లు ఏపీ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి..కుప్పం, శ్రీకాకుళం, నాగార్జునసాగర్, తుని అన్నవరం, తాడేపల్లి గూడెం, ఒంగోలులో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుల అభివృద్ధికి ప్రతిపాదనలు చేసామన్నారు..ఎయిర్ పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 9 అంశాలపై అధ్యయనం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో అదనంగా మరో 6 గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుల అభివృద్ధిలో భాగంగా.. ఆ ప్రాజెక్టుల సాధ్యాసాధ్యాల అధ్యయనం కోసం రూ.2.27 కోట్ల నిధులు విడుదల చేయనున్నట్లు రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రంలోని కుప్పం, శ్రీకాకుళం, నాగార్జునసాగర్, తుని అన్నవరం, తాడేపల్లి గూడెం, ఒంగోలు ఎయిర్ పోర్టులను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలకు అనుగుణంగా ఈ ప్రతిపాదిత ఎయిర్ పోర్టులను అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రంలో ఎయిర్ కనెక్టివిటీని, కార్గో సేవలను పెంచడం ద్వారా ప్రయాణీకులకు మరింత విస్తృతంగా సేవలు అందించాలన్న ఆలోచన సాకారం అవుతుందన్నారు.. ఇందులో భాగంగా రాష్ట్రంలోని గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుల అభివృద్ధి సాధ్యాసాధ్యాలపై ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. దీంతో ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతిపాదిత ఎయిర్ పోర్టుల అభివృద్ధికి తగిన భూమి గుర్తించి, నివేదికలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. దీనికి సంబంధించి కుప్పంలో 1501 ఎకరాలు, నాగార్జున సాగర్ - 1670 ఎకరాలు, తాడేపల్లి గూడెం - 1123 ఎకరాలు, శ్రీకాకుళం - 1383 ఎకరాలు, తుని - అన్నవరం 787 ఎకరాలు, ఒంగోలు - 657 ఎకరాలు ఎయిర్ పోర్టు అభివృద్ధికి తగిన భూమి అందుబాటులో ఉన్నట్లు కలెకర్ట్ ల ఆధ్వర్యంలో ప్రభుత్వానికి నివేదికను అందించడం జరిగింది. అనంతరం ప్రతిపాదిత 6 గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుల అభివృద్ధికి గుర్తించిన భూమిలో సాధ్యాసాధ్యాలపై ముందస్తు అధ్యయనంకు ప్రాథమికంగా 9 అంశాలకు సంబంధించి, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఒక సాంకేతిక కమిటీ, అక్కడ అధ్యయనం చేయనుందన్నారు.. ఈ అధ్యయనంలో 9 అంశాలు (ప్రతిపాదిత భూమిలో జూబిలీ 84 వ్యవస్థ, రెవెన్యూ మ్యాప్, ప్రతిపాదిత భూమి లైన్ డైయాగ్రమ్ స్కెచ్, ప్రతిపాదిత భూమి విండోర్స్ డయాగ్రమ్, కాంటూర్ మ్యాప్, ప్రతిపాదిత సైట్ లో ప్లాన్ చేయబడిన క్రిటికల్ ఎయిర్ క్రాఫ్ట్ టైప్, 1:50000 లో సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్, గత 10 ఏళ్లలో మెటలర్జికల్ డిపార్ట్ మెంట్ డేటా, టైప్ ఆఫ్ ఆఫరేషన్స్ డిసైర్డ్ (జునీళి) ్ఖు (.నీళి) ) ప్రతిపాదిత ఎయిర్ పోర్టు ప్రాంత అభివృద్ధికి సంబంధించిన భూమిలో అధ్యయనం చేయనున్నారు.

# వైఎస్సార్సీ కార్యకర్తలపై కేసు నమోదుపై న్యాయపోరాటానికి సిద్ధమవుతున్న మాజీ సిఎం జగన్

**ఒంగోలు, ప్రభాతవార్త** రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ సోషల్ మీడియా యాక్టివ్ లిస్టులపై కేసులు నమోదు అవుతుండడంతో వైసీపీ అలర్ట్ అయింది. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైన నెల రోజుల్లోనే సోషల్ మీడియా బృందాలను యాక్టివేట్ వేసుకుంది. అధికారంలో ఉన్న సమయంలో ఐ ప్యాక్ బృందాలు సోషల్ మీడియా కంటెట్ తయారీలో భాగస్వాములుగా ఉండేవి. దాంతో పాటు వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలు కూడా జిల్లా మండల స్థాయి వరకు ఉన్నారు. పార్టీ అభిమానుల్లో యువకులు, ఉత్సాహవంతులను గుర్తించి వారిని సోషల్ మీడియా ప్రచారానికి వినియోగించుకున్నారు. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై ఆ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కూడా పలు విమర్శలు వచ్చాయి. న్యాయమూర్తులపై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పలువురిపై సీబీఐ కేసులు కూడా నమోదు చేసింది. ఆ తరువాత ఆయా వ్యవహారం సర్దుమనిగి పోయింది. వైసీపీ అధికారానికి దూరమైన తరువాత కొద్ది రోజులకే ఆ పార్టీ సోషల్ మీడియా టీమ్స్ యాక్టివ్ అయ్యాయి. ప్రభుత్వ వైఫల్యాలు, రాజకీయ విమర్శలతో ఆ పార్టీ ఎక్స్, ఫేస్‌బుక్, ప్లాట్‌పామ్‌లపై, కూటమి పార్టీలపై విరుచుకుపడుతున్నారు. ఈ క్రమంలో సోషల్ మీడియాలో వైసీపీలో యాక్టివ్‌గా ఉండే వారిని గుర్తిస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో రాజకీయ ప్రత్యర్థులపై అనుచిత వ్యాఖ్యలు అసభ్యదోషణలకు పాల్పడిన ఖాతాలను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తిస్తున్నారు. వీరిలో చాలా మంది పాత ఖాతాలను, పోస్టులను డిలీట్ చేసిన వారిని పోలీసులు గుర్తిస్తున్నారు. ఒక పొలిటికల్ కంటెంట్‌ను వాట్సప్ గ్రూపుల్లో క్షేత్రస్థాయికి చేరుతున్నట్లు గుర్తించిన పోలీసులు వాట్సప్ కంటెంట్ షేర్ చేసే వాళ్ళని కూడా నోటీసులు ఇస్తున్నారు. తీవ్ర స్థాయిలో ఆరోపణలు ఉన్న వారు వ్యతిగత ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. గత పది రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా వందకు పైగా కేసులు నమోదయ్యాయి. జగన్ రాజకీయ ప్రత్యర్థులపై అసభ్యదోషణలతో విరుచుకుపడే ఖాతాలను పోలీసులు గుర్తిస్తున్నారు. ట్రోల్ హ్యాండిల్స్‌ను గుర్తించి వారిని అదుపులోకి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో సోషల్ మీడియాలో కీలకంగా ఉండే వారిని పోలీసులు గుర్తించారు. వారిపై పలు ప్రాంతాల్లో ఫిర్యాదులు ఆధారంగా కేసులు నమోదు చేస్తున్నారు. వైసీపీ సోషల్ మీడియా బృందాలను లీడ్ చేస్తున్నవారిపై పోలీసులు కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తుండటంపై ఆ పార్టీ అధ్యక్షుడు కూడా దృష్టి సారించినట్లు పార్టీ వర్గాలు చెప్పున్నాయి. సోషల్ మీడియా కార్యకర్తలను కాపాడుకోవడానికి లీగల్ టీమ్స్‌ను సిద్ధం చేస్తున్నట్లు చెప్తున్నారు. సోషల్ మీడియా వ్యవహారంలో వైసీపీ అధ్యక్షుడు కూడా బాధితుడే అని, జగన్ కుటుంబ సభ్యులపై దుష్ప్రచారం జరుగుతున్నా పోలీసులు కట్టడి చేయడం లేదని, ఆర్గనైజ్డ్‌గా ఈ వ్యవహారం సాగుతుందని వైసీపీ భావిస్తుంది. వైసీపీ కేడర్, కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేయడానికి కొద్ది మందిపై వేర్వేరు ప్రాంతాల్లో కేసులు నమోదు చేసి మిగిలిన వారిని అణిచివేసే ప్రయత్నాలు చేస్తున్నారని వైసీపీ భావిస్తుంది. కేసులు ఎదుర్కొంటున్న

వారికి న్యాయసాయం అందించడంతో పాటు జైలుకి వెళ్లిన వారిని జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో అండగా ఉంటామని చెబుతున్నారు. వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి స్వయంగా కొంత మందిని పరామర్శిస్తారని చెబుతున్నారు. సోషల్ మీడియా

బృందాల్లో మనో ధైర్యం నింపడంతో పాటు వారిని ప్రోత్సహించడానికి ఏమి చేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. వైసీపీ కార్యకర్తలపై చేస్తున్న అభియోగాలు, ఆరోపణలు, అధికార కూటమి పార్టీల సోషల్ మీడియా విభాగాలు కూడా చేస్తున్నాయని, వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం ఆ పార్టీ ప్రశ్నిస్తున్నది

# బయో ఇంధన రంగంలో రిలయన్స్ భారీ పెట్టుబడులు

## మంత్రి నారా లోకేష్



**మంగళగిరి,నవంబర్ 12,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తొలి ఐదునెలల్లోనే రిలయన్స్ ఎనర్జీ సంస్థ బయో ఇంధన ప్రాజక్టులో రూ.65వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం ఆనందంగా ఉందని రాష్ట్ర ఐటి,విద్య శాఖలమంత్రి నారా లోకేష్ అన్నారు. రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో బయో ఇంధన ప్రాజెక్టుకు సంబంధించి రిలయన్స్ ప్రతినిధులు ఏపి ప్రభుత్వ ఉన్నతాధికారుల నడము అవగాహన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ తాను ముంబై లో రిలయన్స్ చైర్మన్‌ముఖేష్ అంబానీ,రిలయన్స్ ఎనర్జీ అధినేత అనంత్‌అంబానీతో చర్చలు జరిపిన 30రోజుల్లోనే ఒప్పందం జరగడం చారిత్రాత్మకమైన ఘట్టమన్నారు. డిసెంబర్ 28న ప్రకాశం జిల్లా కనిగిరిలో తొలి బయో ఇంధన ప్రాజెక్టు శంకుస్థాపన జరుగుతుందని,రాబోయే మూడేళ్ళలో రాష్ట్రవ్యాప్తంగా 500ప్లాంట్ల ఏర్పాటు పూర్తిచేస్తారని చెప్పారు. తొలిప్రాజెక్టు వచ్చే ఏడాది డిసెంబర్ 28నాటికి పూర్తి చేస్తామని రిలయన్స్ ఎనర్జీ ఏపి ప్రతినిధి ప్రసాద్ తెలిపారు. మంత్రి లోకేష్‌స్పందిస్తూ రిలయన్స్ బయో ఇంధన ప్రాజెక్టుకు ఏపి ప్రభుత్వం తరపున అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. రిలయన్స్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం ఏపి ప్రజలతోపాటు పారిశ్రామిక వేత్తల్లో విశ్వాసాన్ని పెంపొ ందిస్తుందన్నారు. 5ఏళ్ళలో 20లక్షల ఉద్యోగాలు కల్పించాన్నారు.

# ఎఎన్‌యును సందర్శించిన జపాన్ బృందం

## - నలుగురుసభ్యులతో కూడిన టోయమా ప్రిపెక్చర్ బృందం పర్యటన

## - ఉన్నత విద్య మండలి తాత్కాలిక చైర్మన్ ఆచార్య రామ్మోహన్ రావు వెల్లడి



**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,నవంబర్ 12,ప్రభాతవార్త :** అభివృద్ధి చెందిన దేశంగా పిలువబడుతున్న జపాన్‌లోఉన్న టోయామా ప్రీఫిక్చర్ యూనివర్సిటీలతో ఆంధ్రప్రదేశ్ యూనివర్సిటీలు,విద్యార్థి, అధ్యాపక,పరిశోధన రంగాల్లో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకునేందుకు సూత్రపాయ అంగీకారం లభించింది. మంగళవారం టోయామా ప్రీ ఫెక్చర్ నుంచి నలుగురు సభ్యుల బృందం నాగార్జున విశ్వవిద్యాలయానికి వచ్చింది. ఈ బృందం సభ్యులకు ఉపకులపతి ఆచార్య గంగాధరరావు సాధర స్వాగతం పలికారు. అనంతరం కమిటీ సమావేశ మందిరంలో జరిగిన కొలాబరేటివ్ డైలాగ్ ఆన్ ఎడ్యూకేషన్ బిట్వీన్ టోయామా ప్రీఫెక్చర్ అండ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై చర్చ జరిగింది. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి తాత్కాలిక చైర్మన్ ఆచార్య కె.రామ్మోహనరావు జపాన్ బృందాన్ని ఉద్దేశించి మాట్లాడారు. జపాన్ దేశానికి భారతదేశానికి చాలా అంశాల్లో పోలీకలు ఉన్నాయన్నారు. భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ లోజపాన్ దేశ విద్యావిధానాన్ని కొనసాగించే క్రమంలో ఆయా రాష్ట్రాల్లో ఉన్న జపాన్ విద్యా విధానంపై ఏపిలో అమలు చేసే అంశాలను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ పలు యూనివర్సిటీల వీసీలు తెలిపిన వివరాలను పరిశీలించిన జపాన్ ప్రతినిధులు బృందం సానుకూలంగా స్పందించింది. సైన్స్ ఎకే స్ఛేంజ్ ప్రోగ్రాంలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు పాల్గొనడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. వచ్చే నెలలో టోయోమా గవర్నర్ ఆంధ్రప్రదేశ్ పర్యటన ఉంటుందని ఆ పర్యటనలో ఎంఓయులు చేసుకోనున్నట్లు తెలిపారు. జపనీయులకు తెలుగు ఇంగ్లీష్ కొంచెం కష్టంగా ఉన్నా అక్కడి వారు ఇక్కడికి ,ఇక్కడివారు అక్కడికి వచ్చినట్లయితే వారి మధ్య జరిగే సంభాషణ ద్వారారెండు దేశాలకు భాషాపరమైన వ్యత్యాసాలు తగ్గిపోతాయని పేర్కొన్నారు. తమ అధ్యాపకులు విదేశాలకు వెళ్ళి భాషా నైపుణ్యాలు నేర్చుకునేందుకు తాము ఎల్లప్పుడు ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.

# ఇంద్రకీలాద్రిలో ప్రత్యేక బిల్వార్చన



సినీనటుడు వరుణ్‌తేజ్‌కు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, నవంబర్ 12, ప్రభాత'వార్త' :** దుర్గమ్మవారి ఆలయంలో పవిత్ర కార్తీకమాస పూజలు మంగళవారం నిర్వహించారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేక బిల్వార్చన సేవను నిర్వహించారు. ప్రదోషకాలంలో ఆకాశదీపాన్ని వెలిగించారు. మధ్యాహ్నం 3.30గంటల నుండి సాయంత్రం 7 వరకు సహస్ర లింగార్చన, ఉదయం 8 గంటలనుండి 11 వరకు కారక పారాయణ, శివపంచాక్షరి, లక్ష్మిగణపతి జపములు, ప్రదోషకాలంలో మహానివేదనలు నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు అభిషేకాది క్రతువులతో పూజాదికాలు అందుకున్న అనంతరం శ్రీస్వామి అమ్మవార్లు సాయం సంధ్యాకాలంలో నిర్వహించిన ఊంజల్‌సేవలో సహస్ర దీపాల శోభతో భక్తులను అనుగ్రహించారు. సహస్ర దీపాలంకరణ సేవలో విజయవాడ డిసిపి గౌతమి శాలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇఓ కెఎస్ రామారావు మాట్లాడుతూ ఈనెల 15న కార్తీకపూర్ణిమ పర్వదినాన కోటి దీపోత్సవం, జ్వాలాతోరణం, పూర్ణిమసందర్భంగా గిరిప్రదక్షణ, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో కృత్తికా దీపోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. కార్తీకమాసంలో అత్యంత పవిత్రమైన 2వ సోమవారం సందర్భంగా బిల్వార్చన నిర్వహించారు. ఈ బిల్వార్చన సేవను ఈనెల 15, 18, 25, 26, 29 తేదీల్లో బిల్వార్చన నిర్వహిస్తామన్నారు. సహస్ర లింగార్చన రు.500 టికెట్టు, రుద్రహోమం రు.1వెయ్యి, ఊంజల్‌సేవ రు.500 టికెట్టు ఒకరోజుకు భక్తులు చెల్లించి పాల్గొనవచ్చన్నారు. అలాగే నెలరోజులకు గాను సహస్రలింగార్చనకు రు,5,116లు, ప్రత్యేక బిల్వార్చనకు రు.2వేలు, ఊంజల్‌సేవ దీపారాధనకు రు.50 (ఒక టికెట్టు)కు భక్తులు చెల్లించి పాల్గొనవచ్చు అని ఇఓ కెఎస్ రామారావు ప్రకటించారు. దుర్గమ్మను మంగళవారం సినీనటుడు వరుణ్‌తేజ్ దర్శించుకున్నారు. ఆయనకు దుర్గమ్మవారి దర్శనానంతరం ప్రసాదం, దుర్గమ్మచిత్రపటం, శేషవస్త్రం అందించారు.

13-11P g7exHMNWJQE.qxd:13-11P g7exHMNWJQE.qxd 01/01/01 9:50 AM Page 1



# 277 ప్రభుత్వ పాఠశాలల్లో స్టాండర్డ్స్ క్లబ్‌ల ఏర్పాటు

## - బిఐఎస్ విజయవాడ కార్యాలయం నేతృత్వంలో లెర్నింగ్ సైన్స్ స్టాండర్డ్స్



లెర్నింగ్ సైన్స్ స్టాండర్డ్స్ కార్యక్రమంలో పాల్గొన్న బిఐఎస్ డిప్యూటి డైరెక్టర్ డి వివేక్ వర్ధన్‌రెడ్డి తదితరులు

**విజయవాడ, నవంబర్ 12, ప్రభాత'వార్త' :** ఆంధ్రప్రదేశ్‌లోని 277 ప్రభుత్వ పాఠశాలల్లో స్టాండర్డ్స్ క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విజయవాడ కార్యాలయ సైంటిస్ట్-సి/డిప్యూటి డైరెక్టర్ డి వివేక్ వర్ధన్‌రెడ్డి వెల్లడించారు. బ్యూరోఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ వినియోగదారుల వ్యవహారాల కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధర్యవంలో నడిచే బిఐఎస్ విజయవాడ కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం కర్నూలులో సైన్స్ టీచర్లకు లెర్నింగ్ సైన్స్ స్టాండర్డ్స్ కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డి వివేక్ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ లెర్నింగ్ సైన్స్ వయా స్టాండర్డ్స్ అనేది బిఐఎస్ యొక్క చొరవ అని, ఇది నాణ్యతా ప్రమాణాల భావనల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ జ్ఞానం మరియు అవగాహన ప్రోత్సహించేలా లక్ష్యం పెట్టుకున్నామన్నారు. బిఐఎస్ స్టాండర్డ్స్ క్లబ్‌లను కలిగి వున్న పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు బిఐఎస్ కర్నూలులో త్రిగుణా క్లార్స్ హోటల్‌లో మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు తెలిసిన సైన్స్ భావనల పరిజ్ఞానం ద్వారా వారు రోజువారీ జీవితంలో ఉపయోగించే వివిధ ఉత్పత్తుల యొక్క భారతీయ ప్రమాణాలను బోధించేలా ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారని వివరించారు. అదేవిధంగా బిఐఎస్ అనేది ఐఎస్ఐ మార్క్, హాల్‌మార్క్, రిజిస్ట్రేషన్ మార్క్, బిఐఎస్ కేర్‌యాప్ మొదలైన మార్కులు పాఠం యొక్క లావాదేవీలపై అందించబడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ శ్యామ్యూల్‌పాల్, కర్నూలు జిల్లా డిప్యూటి ఇఒ కె హనుమంతరావు, కర్నూలు ఎంఇఒ వినోద్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి ఎస్ రంగమ్మ, విజయవాడ బ్యూరోఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రమోషన్ ఆఫీసర్ డి కృష్ణవీర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటికేటాయింపులపై పునఃసమీక్షించాలి

## - సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ - హంద్రీనీవా కాలువ వెడల్పుకు 6,700 కోట్లకుగాను 867.75 కోట్లు కేటాయించారు - జిల్లా ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు రాబట్టాలి

**అనంతపురం, నవంబర్ 12 ప్రభాతవార్త బ్యూరో** రాష్ట్ర బడ్జెట్‌లో హంద్రీనీవాకు గతం కంటే నిధులు పెంచడాన్ని సిపిఎం జిల్లాకమిటీ స్వాగతిస్తోంది. పెంచిన నిధులను నిర్దిష్ట కాల పరిమితిలోపు ఖర్చు చేసి జిల్లా వ్యవసాయాన్ని ఆదుకోవానలి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా సాగునీటి వనరుల అభివృద్ధికి ఏడు వేల కోట్లు అవసరం కాగా వెయి య్ కోట్లలోపు మాత్రమే కేటాయించారు. జిల్లాకు జీవనాడిగా ఉన్న హెచ్ఎల్‌సి స్టేజ్ 1, స్టేజ్-2 పనుల కోసం 792 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించగా కేవలం 28.2 కోట్లు మాత్రమే కేటాయించడంపై పున: సమీక్ష చేసి న ఇధులు పెంచాలన్నారు. హెచ్ఎల్‌సి ఆయకట్టు రైతులు కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలను బడ్జెట్ ప్రతిపాదనలు నీరుగార్చాయన్నారు. గత ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపివేసిన హెచ్ఎల్‌సి ఆధునీకరణ పనులను పూర్తి చేస్తామని కూటమి నేతలు ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అందుకు తగ్గట్టుగా నిధులు కేటాయించలేదు. తుంగభద్ర డ్యాంను రక్షించుకునేందుకు కొత్త గేట్లను తక్షణం ఏర్పాటు చేయాలని కేంద్ర జల వనరుల శాఖ నిపుణులు నివేదిక ఇచ్చారు. దీనికి అవసరమైన నిధుల గురించి ఈ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. బొమ్మనహాళ్ మండలంలో 15 సంవత్సరాల క్రితం ప్రతిపాదించిన ఉంతకల్లు రిజర్వాయర్ గురించి ఆర్థిక మంత్రి మాట్లాడలేదు. హంద్రీనీవా కాలువ వెడల్పుకు 6,700 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించగా 867.75 కోట్లు మాత్రమే కేటాయించారు.

పదివేల క్యూసెక్కుల సామర్థ్యంతో హంద్రీనీవా కాలువ వెడల్పు చేస్తామని ప్రస్తుత ముఖ్యమంత్రి ఇన్‌చార్జ్ హామీ అమలు కావాలంటే ఈ నిధులు సరిపోవు, బిటి ప్రాజెక్టు, పేరూరు ప్రాజెక్టులను పూర్తి చేస్తారని రైతులు ఎదురు చూస్తున్నారు. పిఎబిఆర్ కుడి కాలువ, య ఆడికి



సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

కాలువ, సుబ్బరాయ సాగర్ పనులు పూర్తిచేయాలి.

జిల్లా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ చర్చల సందర్భంగా జిల్లా ఎంఎల్ఏలు ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి ఏడు వేల కోట్ల నిధులు రాబట్టాలని కోరారు.

# గ్రామాల్లో పోలీసు నిర్బంధంతో భయానక వాతావరణం

## బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఫార్మా కంపెనీ కోసం రైతుల భూములు గుంజుకునేందుకు ఒత్తిడి తేవడంతో ఆ ప్రయ త్నాలకు వ్యతిరేకంగా ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజాపాలన చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ నేడు నమ్మి ఓట్లేసి గెలిపిం చిన ప్రజల నోట్లో మట్టికొడుతున్నారన్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్లలో ఫార్మా కంపెనీల కోసం రైతుల నుంచి భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజల ఆగ్రహానికి అధికారులు బలయ్యారని అన్నారు. సోమవారం కొడంగల్‌లో జరిగింది అధికారులపై దాడి కాదు, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు కట్టలు తెంచుకున్న ఆగ్రహమే అన్నారు. తనపై దాడి జరగలేదని జిల్లా కలెక్టర్ బహిరంగంగా ప్రకటించినప్పటికీ.. గ్రామాల్లో నిర్బంధం పెట్టి అక్రమంగా 50 మందిపై కేసులు నమోదు చేశారన్నారు. ఇంటర్నెట్ సేవలు బంద్ పెట్టి మరీ పోలీసుల దిగ్బంధం చేసి ప్రజలను వేటాడుతుండటం దౌర్జన్యమన్నారు. ఈ ఘటన చూసిన తర్వాత కాంగ్రెస్ పార్టీని ప్రజలు మరింత తీవ్రంగా అసహ్యించుకుంటున్నారని అన్నారు. చౌటుప్పల్ దగ్గర దివిస్ కంపెనీ నుంచి మొదలు రాష్ట్రంలో చాలా కంపెనీల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వలేదని, ఆయా కంపెనీలతో భూగర్భజలాలు, గాలి కలుషితమై రైతులు పంటలు పండించుకోలేని పరిస్థితి దాపురించిం దన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 10 ఫార్మాక్లస్టర్లు చేస్తామని చెబుతూ దోచుకునే ప్రయత్నం చేస్తున్నారదన్నారు. సిఎం రేవంత్ రెడ్డి.. ఆయన బామ్మర్ది సృజన్‌రెడ్డితో పార్టనర్‌షిప్ చేస్తూ ఫార్మా కంపెనీ పెట్టేందుకు ప్రయత్నిస్తూ ప్రజలపైదాడులు చేస్తున్నారని ఆరోపించారు. మొన్న కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామంలో ఒక దుర్మార్గుడు మతం మాటున మైనర్ బాలికపై అత్యాచారం చేసిన కేసులో పోలీసులు ఆ గ్రామాన్ని నిర్బంధం చేశారు. ఢిల్లీకి వెళ్లిన టూర్ వెనుక మతలబు మరోటి ఉంది. మరో డ్రామా ఉంది. జార్ఖండ్, మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డబ్బులు పం పేందుకే కేటీఆర్ ఢిల్లీకి వెళ్లాడని ఆరోపించారు. నిన్న కొడంగల్ నియోజకవర్గంలో జరిగిన ఘటనపై పూర్తిస్థాయి న్యాయవిచారణ జరపాలి.

# బొలెరో వాహనం బోల్తా

## 35 మందికి గాయలు.. ఐదుగురికి తీవ్రగాయాలు

## ఒకరిద్దరి పరిస్థితివిషమం..కనిమెట్ట జాతీయరహదారిపై ఘటన

కొత్తకోట, నవంబరు 12, ప్రభాతవార్త : పూట గడవని కుటుంబాలు, రెక్క డితే కానీ డొక్కానిండని బతుకులు, ఎక్కడ పని ఉన్న నేనొస్తానంటూ పరుగేత్తే మహిళలు, వారి పనిని చూసి ప్రకృతి కన్నెర్ర చేసింది. ఆడుతూ పడుతు వెళ్తున్న బొలెరో వాహనం ఒక్కసారిగా బోల్తా పడి గాయలపాలయ్యారు. టైర్ పంచర్ అయి బొలెరో వాహనం బోల్తా పడి 35 మందికి గాయలైన సంఘటన కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామ సమీపంలోని సాయి అమృత దాబ దగ్గర జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగింది. స్థానికుల, పోలీసుల వివరాల ప్రకారం కొత్తకోట మండలం భూత్కూర్ గ్రామానికి చెందిన ఆంజనేయులు తన బొలెరో వాహనంలో అదే గ్రామానికి చెందిన మహిళా కూలీలను 35 మందిని తీసుకోని అడ్డాకల్ సమీపంలో కూలి పనులకు తీసుకెళ్తున్నాడు. అతి వేగంగాతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడ్ తో కూలీలను తీసుకెళ్తూ కనిమెట్ట గ్రామ సమీపంలోని సాయి అమృత దాబ దగ్గరకు రాగానే బొలెరో వాహనం టైర్ ఒక్కసారిగా పగిలింది. దింతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ఉన్న 35 మందికి గాయాలు అయ్యాయి. అందులో కొందరికి తీవ్ర గాయాలు కాగ వనపర్తి జిల్లా దవాఖానకు తరలించారు. స్వల్ప గాయాలు అయిన వారిని కొత్తకోటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స నిర్వహించారు. తీవ్ర గాయాలు అయిన రేణుకమ్మ, అబ్దుల్లమ్మ, చిట్టెమ్మ, సావిత్రమ్మ, జయమ్మ, సారాంబి, పర్బీన్, నర్సమ్మ లను వనపర్తి ఏరియా హాస్పిటల్ కు తరలించారు. వీరిలో చిట్టెమ్మ, జయమ్మ, సావిత్రి, అబ్దుల్లమ్మ, రేణుకమ్మ లను మెరుగైన వైద్యం కోసం మహబూబ్ నగర్ ఎస్‌విఎస్ హాస్పిటల్ కు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు.

**బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఆల, నాయకులు**

ఘటన తెలిసిన వెంటనే కొత్తకోటకు చెందిన కాంగ్రెస్ నాయకులు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి సమాచారం అందించారు. ఎమ్మెల్యే వైద్యు లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అదేవిదంగా దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వనపర్తిలోని ప్రభుత్వ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న మహిళలను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.

# బలవంతంగా రైతుల భూములు సేకరించొద్దు

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బలవంతంగా రైతుల భూములు సేకరించొద్దని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోని లగచర్ల గ్రామంలో జరిగిన ఘటన రైతుల ఆగ్రహాన్ని సూచిస్తున్నదని.. రైతులు తమ భూములను కోల్పోవడానికి సిద్ధంగా లేరనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా గమనించా లన్నారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా రైతుల భూములను బలవంతంగా లాక్కోవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వికారాబాదులో జరిగిన ఘటనకు బాధ్యత ప్రభుత్వానిదేనని.. తమకు జీవనాధారమైన భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిశ్రమలకు ఇవ్వబోమని రైతులు పదే పదే చెప్పినా.. ప్రభుత్వం మొండిగా వ్యవహరించిందని.. చివరకు జిల్లా కలెక్టర్ మరియు అధికారులు చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ నిరసనలతో ప్రారంభమై ప్రతిఘటనకు దారితీసిందని గుర్తు చేశారు. ఘటనకు బాధ్యు లను చేస్తూ రైతులపై ఎలాంటి కేసులు నమోదు చేయవద్దని తమ్మినేని ప్రభుత్వానికి సూచించారు.

# ఒబిసిలు, బహుజనులు కెటిఆర్, హరీశ్‌రావులను నిలదీయాలి

## టిపిసిసి ప్రధాన కార్యదర్శి డా.అద్దంకి దయాకర్

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే అడ్డుకునేందుకు కేటీఆర్, హరీష్ రావు కుట్ర చేస్తున్నారని టిపిసిసి ప్రధాన కార్యదర్శి డా.అద్దంకి దయాకర్ మండిపడ్డారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేను అడ్డుకోవాలని బిఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని అన్నారు.

రిజర్వేషన్‌లు బిసిలకు రాకుండా అడ్డుకుంటూ బిఆర్ఎస్ నాయకులు కుట్ర చేస్తూ ప్రజలను రెచ్చగొడుతున్నారని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రతి పనిని విమర్శించడం బిఆర్ఎస్ నాయకులకు రివాజుగా మారిందని, సమగ్ర కులగణన జరిగితే వాళ్ళ ఆర్థిక, సామాజిక విషయాలు బయట పడతాయని అన్నారు. అందుకే బిఆర్ఎస్ మాజీ మంత్రులు హరీష్ రావు,

కెటిఆర్ సర్వే జరగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విషం చిమ్ముతున్నారని అన్నారు. బిసి, ఎస్సీ, ఎస్టీ ఇతర కులాల పట్ల సర్వేను అడ్డుకోవాలని చూస్తున్న బిఆర్ఎస్ నాయకుల వైఖరి ఏంటో స్పష్టంగా ప్రజలకు అర్థం అవుతుందన్నారు. జనగణన జరిగితే రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టొచ్చో ఒక క్లారిటీ వస్తుంది. అందుకే ప్రభుత్వం ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే చేపట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జనాభా లెక్కల్లో కులం కాలం పెట్టాలని కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో డిమాండ్ చేస్తున్నామన్నారు.



# రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన కార్యక్రమాలు

## - రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు తగ్గించేవరకు ఆందోళనలు

## - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

**అనంతపురం, నవంబర్ 12 ప్రభాతవార్త బ్యూరో** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి రాగానే చార్జీలు తగ్గింపుపై ఎటువంటి చర్యలు తీసుకోకపోగా 18 వేల కోట్ల రూపాయల భారాన్ని విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై మోపుతున్నారని విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు ఈ నెల 20 నుంచి 30వ తేది రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపి ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్ 2,94,427 కోట్లతో విడుదల చేసిందన్నారు. ఈ బడ్జెట్ వల్ల ఆశించినంత ప్రయోజనాలు ఏ మాత్రం వర్తిస్తుందో చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొని రాకుండా ప్రజలపై భారాలు మోపుతున్నారన్నారు. 6.72 కోట్ల రూపాయలు ప్రజలపై విద్యుత్ భారం డిసెంబర్‌లోగా వస్తుంది కానీ కిలోగా 11 వేల కోట్ల రూపాయల పెంచాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వం తెలియజేయడం జరిగిందన్నారు. ఈ నెల 19లోపల అభ్యంతరాలు ఉంటే తెలియజేయానలి కోరడంతో సిపిఐ పార్టీ తరపున అభ్యంతరాలను లేఖ ద్వారా రాయడం జరిగిందన్నారు. విద్యుత్ చార్జీలకు నిరసనగా ఈ నెల 19న విజయవాడలో భారీ ఎ తు _న వామపక్ష పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ నెల 20 నుంచి 30 తేది వరకు రాష్ట్ర వ్యాప్తంగా 23 జిల్లాల్లో ప్రజలను చైతన్యం పరుస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టి విద్యుత్ చార్జీలు తగ్గించేందుకు ఉద్యమిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పట్టాల విషయంలో పట్టణాలలో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇస్తూ ఇంటి నిర్మాణానికి 5 లక్షలు ఇవ్వాలన్నారు. సోషల్ మీడియాలో రాజకీయాలకు సంబంధం లేని క ఉటుంబ సభ్యులపై బూతులు మాట్లాడడం నీచమైన చర్య అన్నారు. మాజీ మంత్రి రాజకీయాలను విమర్శించాడని పోలీసులు అదుపులోకి తీసుకోవడం సరైంది కాదన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్ మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వం 41, 421 పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇల్లు కట్టుకోవడానికి సరైన నిధులు ఇవ్వకపోవడంతో 60 శాతం మంది ఇల్లు కట్టుకోలేకపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు పట్టాలు ఇస్తామని చెప్పడం జరిగిందన్నారు. ఇంత వరకు గృహ నిర్మాణాలకు ఆదేశాలు ఇవ్వలేదన్నారు. ఇల్లు నిర్మానానికి ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.1.50 లక్షల నుంచి 1.20 వేలకు తగ్గించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఇచ్చే నిధులు పెంచే విధంగాకూటమి ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ..

ఇంటి పట్టాల దరఖాస్తులు పూర్తి చేసే కార్యక్రమాన్ని మొదలు పెట్టామన్నారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతి ఇంటికి సర్వే చేస్తూ ఇంటి పట్టాలు లేని వారికి దరఖాస్తులు ఇచ్చే విధంగా పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ పార్టీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సమాయ కార్యదర్శి పి. నారాయణ స్వామి, నగర కార్యదర్శి ఎస్. శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు సి. లింగమయ్య, నగర కార్యదర్శి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల టోకెన్లు ఇవ్వడం లేదు.. కాంటా పెట్టడం లేదు

## ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతోంది

## బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అనేకచోట్ల వడ్ల కొనుగోలు కేంద్రాల్లో టోకెన్లు ఇవ్వకుండా, కాంటా పెట్టకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారని బిజెపి రాష్ట్ర ఉపాధ్య క్షుడు చింతల రామచంద్రారెడ్డి మండిపడ్డారు. మంగళవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమా వేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వరి ధాన్యం ప్రతి గింజ కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఆధ్వర్యంలో బిజెపి నాయకుల బృందం రైతు కల్లాలను సందర్శించడం జరిగిందన్నారు. మొన్న యాదాద్రి జిల్లా పోచంపల్లి మండల కేంద్రంతోపాటు రేవన్నపల్లిలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో రాజ్య సభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, రైతుల సమస్యలను తెలుసుకున్నారు. కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ బిజెపి నాయకులతో కలిసి వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించారని తెలిపారు. ఎక్కడికెళ్లినా రైతులకు రుణమాఫీ చేయలేదని, రైతు భరోసా ఇవ్వలేదని, ధాన్యం కొనుగోళ్లు జరపడం లేదని రైతులు సమస్యలు చెప్పుకుంటున్నారన్నారు. రైతు పండించిన పంటలకు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీని తుంగలోకి తొక్కి సన్నవడ్లకే బోనస్ ఇస్తమని చెబుతున్నారని, ఇదెక్కడి న్యాయం అంటూ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యంపై ఇచ్చే రూ. 2,320 ఎంఎస్‌పితో కలిపి రాష్ట్ర ప్రభుత్వం 500 బోనస్ ఇచ్చి రూ. 2,820 ఇచ్చి ధాన్యం కొనుగోలు చేస్తమన్న కాంగ్రెస్ నాయకుల మాటలు ఏమయ్యాయి అన్నారు. ఆనాడు మాజీ సీఎం కేసీఆర్ సన్నాలు పండించొద్దన్నారు.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాలకు మాత్రమే బోనస్ ఇస్తమంటున్నదన్నారు. జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణతో కలిసి వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించినట్లు, ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తే 40 కిలోల ధాన్యానికి కిలోన్నర ధాన్యం తరుగు తీస్తున్నారని అన్నారు. రైస్ మిల్లులకు వెళ్లేసరికి సుమారు 100 కిలోలకు 3 కిలోల చొప్పున తాలు, తరుగు పేరుతో కోత పెడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైస్ మిల్లర్లు, దళారులతో కుమ్మక్కైందన్నారు. దళారుల ప్రమేయంతో రైతు లు సుమారు క్వింటాలు బియ్యానికి రూ. 700-800 మేర నష్టపోతు న్నాడని, కొనుగోళ్ల ఆలస్యం చేస్తుండటంతో రైతులు ఇప్పటికే రాష్ట్రం లో 40 శాతం మేర వడ్ల ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవాలి.



మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి

# జమిలి ఎన్నికలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

## కులగణనలో అనవసర ప్రశ్నలను తొలగించాలి

## సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

## రాష్ట్ర ఆర్థికపరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

## రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** దేశంలో జమిలి ఎన్నికలు ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకమని, జమిలి ఎన్నికలు జరిగితే అనార్థాలకు దారితీస్తుందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. మహారాష్ట్ర, జార్ఖండ్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే ప్రధాని నరేంద్ర మోడీ జమిలి ఎన్నికలకు సిద్ధమవుతారని విమర్శించారు. లౌకిక ప్రజా స్వామ్య వ్యవస్థకు భంగం కలిగించే రీతిలో ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజకీ యాలు చేస్తున్నారని.. వారు ప్రజాస్వామ్య వ్యవ స్థకు ప్రమాదకరంగా మారారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో మంగళవారం మీడియా సమా వేశంలో రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి నారాయణ మీడియాతో మాట్లాడారు. అమిత్‌షా కేంద్ర హోంశాఖ మంత్రి అయిన తర్వాతనే నేరపూరిత రాజకీయాలకు ప్రత్యక్షంగా ఆజ్యం పోస్తున్నారని నారాయణ మండిపడ్డారు. తెలంగాణలో చేపట్టిన కులగణన మంచి కార్యక్రమమని, అనవసరమైన ప్రశ్నలతో దీనిని వివాదస్పదం చేసుకోద్దని రాష్ట్ర ప్రభు త్వానికి సూచించారు. కులగణ నలోని ప్రశ్నలు సరళతరంగా ఉండా లన్నారు. వికారాబాద్ కలెక్టర్‌పై దాడి చేయడం సరైంది కాదన్న నారాయణ.. అదే సమయంలో రైతుల బాధను, వారి ఆవేదనను కూడా ప్రభుత్వం అర్థం చేసుకోవాలని సూచిం చారు. దాడి చేశారనే నెపంతో రైతులపై ఒక రాజకీయ పార్టీ ముద్ర వేసి చర్యలు తీసుకోవద్దని సూచించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇంటికి ప్రధాని మోడీ వెళ్లడం, ఆయనను ప్రధాన న్యాయమూర్తి ఆహ్వా నించడం రెండూ తప్పేనని, రాజకీయాల్లో ఇది దుష్ట సంప్రదాయమని, ఇటు వంటివి న్యాయ వ్యవస్థకు కలంకం తీసుకొస్తాయన్నారు. ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో మోడీది విష కౌగిలి అని నారా యణ విమర్శించారు. ఈ నెల 17న కొల్లేరు సరస్సును సందర్శించనన్నట్టు నారా యణ తెలిపారు. బీఆర్ఎస్ రాజకీయ కుట్రను అనుసరిస్తున్నట్టు కనిపిస్తోందని.. పేదల భుజాలపైన తుపాకులు పెట్టి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కాల్చేందుకు ప్రయత్నిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శిం చారు. విగ్రహ ధ్వంసంతోపాటు మసీదు ఘట నలతో రాష్ట్రంలో జరుగుతున్న వరుస ఘటనలపైన సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి రక్షణ కవచం కావాలని..

అందుకే ఆయనకు ఇప్పుడు కమ్యూనిస్టులు గుర్తుకొస్తు న్నారని అన్నారు. అయితే తాము ప్రజలకు మాత్రమే కవచంగా ఉంటామని కూనంనేని ఒక ప్రశ్నకు సమాధానం చెప్పారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

హైడ్రా విషయంలో ఈనెల 14న మేధావులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో అన్ని అంశాలను చర్చించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాయనున్నట్టు కూనంనేని సాంబశివరావు తెలిపారు.

# కుల గణనను వ్యతిరేకిస్తే ప్రజాద్రోహులే

## తప్పడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి పీపుల్స్ కమిటీ ఆన్ కాస్ట్ సెన్సెస్ డిమాండ్

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** కుల గణనను వ్యతిరేకిస్తే ప్రజా ద్రోహులేనని మేధావి వర్గం అభిప్రాయపడింది. ఈమేరకు మంగళవారం హైదరాబాద్లోని సోమాజి గూడ ప్రెస్‌క్లబ్‌లో కుల గణనకు వ్యతిరేకులను నిరసిస్తూ పీపుల్స్ కమిటీ ఆధ్వర్యంలో మీడియాసమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రొఫెసర్లు మురళి మనోహర్, సింహాద్రి, పిఎల్. విశ్వేశ్వర్‌రావు, తిరుమలి, ప్రొఫెసర్ సుదర్శన్‌రావు, ఇంజనీర్లు దేవళ్ల సమ్మయ్య, సతీస్ కొట్టే, వినోద్ కురువ తదితరులు హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ కుల గణనపై కొంత మంది తప్పుడు, వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 75 ఏళ్ల తరువాత రాష్ట్రంలో కులగణన ప్రభుత్వం చేస్తుంటే అడ్డు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సమగ్ర సర్వే చేసిన లెక్కలు బయట పెట్టలేదని, సోషియో ఎకనామిక్ సర్వే చేసిన బయట పెట్టలేదని ప్రొఫెసర్ మురళి మనోహర్ గుర్తుచేశారు. కులగణనలో కులం ప్రత్యేక మైందన్నారు. 2024 ఎన్నికల్లో కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చిన బీఆర్ఎస్ ఎందుకు వ్యతిరేకి స్తుందో అర్థం కావట్లేదని విస్మయం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కుల గణన చేయడాన్ని తాము స్వాగతిస్తున్నాని బీహార్‌లో గణనకు మద్దతు ఇచ్చిన బీజేపీ ఇక్కడ ఎందుకు వ్యతిరేకిస్తుందో తెలపాలని ప్రశ్నించారు. ఎన్యుమరేటర్లు వస్తే అడ్డుకుంటున్నారని, ఇది కరెక్టు కాదన్నారు. సంపన్న కుటుంబాలే ఈ గణనను అడ్డుకుంటున్నాయని, సర్వేను వ్యతికేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ తీరును ప్రొఫెసర్ ఖండించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ నరేంద్రబాబు, ప్రొ.రాధాకృష్ణ, నాగుల వేణు, ఇంజనీర్ భద్రయ్య, తుల్జారాంసింగ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

13-11pg10exHMNWJQETBV.qxd:13-11pg10exHMNWJQETBV.qxd 01/01/01 10:15 AM Page 1





## ఇంటర్నేషనల్ టోర్నీలో భారత్ స్టార్ జ్యోతికి కాంస్యం

**హైదరాబాద్:** జేవీడీ ఓపెన్ ఇండోర్ ఆర్చరీ అంతర్జాతీయ టోర్నమెంట్‌లో భారత్ స్టార్ ప్లేయర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ కాంస్య పతకాన్ని సాధించింది. నెదర్లాండ్స్‌లో జరిగిన ఈ టోర్నీలో జ్యోతి సురేఖ 900 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానాన్ని సంపాదించింది. 18మీటర్ల దూరం ఉన్న లక్ష్యంవైపు ఆయాప్లేయర్లు 30బాణాలను మూడుసార్లు చొప్పున సంధించారు. నిర్ణీత 90 బాణాల తర్వాత సురేఖతో పాటు, ఇటలీకి చెందిన ఎలీసా రోనెర్, కొలంబియాకు చెందిన అలెజాంద్రా ఉస్కియానో, స్పెయిన్‌కు చెందిన ఆండ్రియా మునోజ్ 900 పాయింట్లు స్కోరు చేసి సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే పతకాల వర్గీకరణ కోసం కేంద్ర బిదువుపై కొట్టిన అత్యధిక షాట్‌లను పరిగణలోకి తీసుకున్నారు. ఫలితంగా ఎలీసా రోనెర్‌కు స్వర్ణ పతకం, అలెజాంద్రాకు రజతం, జ్యోతిసురేఖకు కాంస్యపతకాలు ఖరారయ్యాయి. కాగావరల్డ్ వర్సిటీ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ షూటర్ మద్దినేని ఉమా మహేశ్ త్రుటిలో కాంస్య పతకాన్ని చేజార్చుకున్నాడు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో ఉమా మహేశ్ 208.8 పాయింట్లు స్కోరు చేసి నాలుగో స్థానంలో నిలిచాడు.




## భారత్ నంబర్ వన్‌గా రష్మిక

**ఢిల్లీ:** మహిళల టెన్నిస్ సింగిల్స్ విభాగంలో భారత్ నంబర్ వన్ ప్లేయర్‌గా హైదరాబాద్‌కు చెందిన భమిడిపాటి శ్రీవల్లి రష్మిక అవతరించింది. మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) ర్యాంకింగ్స్‌లో 22 ఏళ్ల రష్మిక రెండు స్థానాలు పడిపోయి 302వ స్థానంలో నిలిచింది. మూడు నెలలుగా భారత్ నవంబర్ వన్‌గా ఉన్న తెలంగాణ ప్లేయర్ యామలపల్లి సహజ పాయింట్ల పట్టికలో ఏకంగా 18 స్థానాలకు పడిపోవడంతో 304వ ర్యాంక్‌కు దిగిపోయింది. ఇదే రష్మికకు కలిసొచ్చింది. దీంతో భారత్ నవంబర్ వన్‌గా సహజ స్థానానిన రష్మిక దక్కించుకుంది. అలాగే భారత్‌కే చెందిన అంకిత రైనా పాయింట్ల పట్టికలో 306వ ర్యాంక్‌లోను, వైదేహీ 405వ ర్యాంక్‌లో ఉన్నారు.

## చెన్నై గ్రాండ్ మాస్టర్స్ విజేత అరవింద్



**ఢిల్లీ:** యువగ్రాండ్ మాస్టర్, భారత్‌కు చెందిన అరవింద్ చిదంబరం చెన్నై గ్రాండ్ మాస్టర్స్-2024 టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. చివరి వరకూ వరుసగా అమెరికా, ఇరాన్‌కు చెందిన గ్రాండ్ మాస్టర్లపై ఆధిక్యాన్ని సాధించి టైటిల్‌ను దక్కించుకున్నాడు. ఈ టోర్నమెంట్‌లో ఫైనల్‌లో వరుసగా రెండు విజయాలు నమోదు చేసిన అతడు అమెరికాకు చెందిన లెవాన్ అరోనియన్‌ను ఓడించి టైటిల్ విజేతగా నిలిచాడు. ఆరో రైండ్‌లో ఇరిగేసి అర్జున్‌ను ఓడించిన అరవింద్ ఏడో రౌండ్‌లో ఇరాన్ ఆటగాడు పర్హమ్ మమ్‌సూద్‌ను చిత్తు చేయడంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి నిలిచి టైటిల్ రేసులోకి దూసుకొచ్చాడు. 4.5 పాయింట్లతో అరవింద్, అరోనియన్, అర్జున్ సాధించడంతో ఫైనల్ పోరు టైబ్రేక్‌కు దారితీసింది. ప్లే ఆఫ్‌లో అరవింద్‌కు బై దక్కగా అరోనియన్, అర్జున్ గ్రాండ్ ఫైనల్ కోసం తలపడాల్సి వచ్చింది. ఫైనల్లో అర్జున్, అరోనియన్ మధ్య జరిగిన మూడు మ్యాచ్‌లలో ఒకటి డ్రాగా ముగియగా, ఇరువురు తలా ఓ విజయం సాధించి 1.5 పాయింట్లతో సమానంగా నిలిచారు. కానీ రౌండ్ రాబిన్ దశలో మెరుగైన పాయింట్లతో అరోనియన్ గ్రాండ్ ఫైనల్‌కు అర్హత సాధించగా, అర్జున్ మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఇక ఫైనల్లో అరవింద్ టైటిల్‌ను ఎగరేసుకుపోయాడు.

## సస్పెండైన అధికారికి భారీగా ఫాలోయర్లు

**తిరువనంతపురం, నవంబరు 12:** సీనియర్ అధికారిని బహిరంగంగా విమర్శించి క్రమశిక్షణ కారణాలతో సస్పెండ్ అయిన కేరళ ఐఎఎస్ అధికారి ఎన్.ప్రశాంత్ ఆకాకు ఫేస్‌బుక్‌లో మూడు లక్షలు, ఇన్‌స్టాగ్రామ్‌లో 50 లక్షలమందికిపైగా ఫాలోవర్లు ఉన్నట్లు తేలింది. ప్రజలకు చేరువ అయ్యేందుకు సోషల్‌మీడియా ఉత్తమ వేదిక అని ఆయన అన్నారు.

ఒక సీనియర్ అధికారిపై ఆయన చేసిన సోషల్‌మీడియా విమర్శలే ఆతడిని ఇబ్బందుల్లోకి నెట్టి ప్రభుత్వం ఆయనపై క్రమశిక్షణ వేటువేసేందుకు కారణం అయింది. 2007 బ్యాచ్ ఐఎఎస్ అధికారి అదనపు ప్రధాన కారనయదర్శి ఎ జయతిలక్‌నున సైకోపాత్‌గా అభివర్ణించారు. ఆయనపై నిరాధారమైన వార్తా వానయఖ్యలు పోస్టుచేసారని ఆరోపించారు. రాష్ట్రప్రభుత్వ చర్యను అనుసరించి తనకుతాను విజిల్‌బ్లోయర్ అని చెప్పాడు.




## ఐపిఎల్ మెగా వేలంలో.. ఆటగాళ్లపై కోట్ల వర్షం

### తక్కువ ప్లేయర్ల రిటైన్‌తో భారీ స్కెచ్

### అత్యధిక పర్స్ వేల్యూతో బరిలోకి ఫ్రాంచైజీలు

**ఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్-2025 మెగా వేలంలో ఫ్రాంచైజీలు ఆటగాళ్లపై కోట్ల రూపాయలను కుమ్మరించేందుకు సిద్ధమయ్యాయి. ఈ నెల చివరి వారంలో జరగనున్న మెగా వేలానికి ముందునే పలు ఫ్రాంచైజీలు రిటైన్ పేరుతో కొందరు ప్లేయర్లను అత్యధికంగా రెండంకెల కోట్ల రూపాయల మేర కొనుగోలు చేశాయి. ఈ మేరకు కొన్ని జట్లు తక్కువ మంది ప్లేయర్లను రిటైన్ చేసుకుని ఎక్కువ పర్స్ విలువతో ఈ మెగా వేలానికి రానున్నాయి. మొత్తం 10 ఫ్రాంచైజీలు ఉండగా, వాటిలో కొన్ని కోట్ల రూపాయల అత్యధిక పర్స్ విలువతో వేలంలో దిగేందుకు భారీ స్కెచ్ వేశాయి. రాబోయే సీజన్ కోసం మెగా వేలానికి ముందు చాలా ఫ్రాంచైజీలు 5 నుండి 6 గురు ఆటగాళ్లను అట్టిపెట్టుకున్నాయి. అయితే అదే సంఖ్యలో ఆటగాళ్లను నిలబెట్టుకునేందుకు ప్రతీ ఫ్రాంచైజీ భారీ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) నిబంధన ప్రకారం ఒక్కో ఫ్రాంచైజీ నిలుపుదల కోసం రూ.75 కోట్ల వరకూ వెచ్చించే అవకాశం ఉంది. అదే విధంగా ఈ సారి మె గా వేలం కోసం క్రికెట్ బోర్డు అన్ని ఫ్రాంచైజీల మర్స్ మనీని ఒక్కో జట్టుకు రూ.120 కోట్లగా నిర్ణయించింది. ఈ సారి తక్కువ ప్లేయర్లను రిటైన్ చేసుకుని అత్యధిక పర్స్ మనీతో మూడు ఫ్రాంచైజీలు వ్యూహాత్మకంగా మెగా వేలంలోకి దిగుతున్నాయి. మొత్తం 10 ఫ్రాంచైజీలలో తక్కువ ప్లేయర్లను రిటైన్ చేసుకుని ఎక్కువ పర్స్ మనీ రూ.110.50 కోట్లతో పంజాబ్ కింగ్స్ మెగా వేలంలోకి దిగుతోంది. ఈ ఫ్రాంచైజీ కేవలం శశాంక్ సింగ్, ప్రభసిమ్రాన్ సింగ్‌ను మాత్రమే ఉంచుకుంది. ఈ ఇద్దరు ఆటగాళ్లకు చెల్లించే సొమ్ము రూ.9.50 కోట్లు పోను, ఈ ఫ్రాంచైజీ పర్స్‌లో ఇంకా రూ.110.50 కోట్లు మిగిలి ఉన్నాయి. ఈ మొత్తంతో వేలంలో భారీగా ప్లేయర్లను కొనుగోలు చేసేందుకు పంజాబ్ బిగ్ ప్లాన్ చేసింది. ఇక ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు ఒక్కసారి కూడా ట్రోఫీని గెలవ లేదు. ఐపీఎల్ రాబోయే సీజన్‌లో కేవలం ముగ్గురు ఆటగాళ్లపైనే విశ్వాసం ఉంచింది. విరాట్ కోహ్లీతో పాటు, రజత్ పటీదార్, యశ్ దయాల్‌లను తన వద్దే ఉంచుకుంది. వీరికి చెల్లించే రూ.37 కోట్లు పోను, ఇప్పుడు బెంగుళూరు పర్స్‌లో రూ.83 కోట్లు మిగిలాయి. ఈ సొమ్ముతో వేలంలో ప్లేయర్లను కొనుగోలు చేయనుంది. అలాగే ఢిల్లీ క్యాపిటల్స్ రూ.76.25 కోట్ల పర్స్ మనీతో వేలంలోకి దిగుతోంది. వచ్చే ఐపీఎల్ 18వ సీజన్ కోసం ఢిల్లీ నలుగురు ప్లేయర్లను రిటైన్ చేసుకుంది. వీరిలో నికోలస్ పురాన్, మయాంక్ యాదవ్, రవి బిష్ణోయ్, మొహ్సిన్ ఖాన్, ఆయుష్ బదోని ఉన్నారు. వీరిని నిలుపుకోవడానికి ఈ ఫ్రాంచైజీ అత్యధిక డబ్బును పూరన్‌పై ఖర్చు చేసింది. రూ.21 కోట్లతో అతడిని రిటైన్ చేసుకుంది. ఈ ఐదుగురికి మొత్తంగా రూ.51 కోట్లను ఖర్చు చేయగా, ఇంకా రూ.69 కోట్ల పర్స్ విలువతో మెగా వేలంలోకి ప్రవేశిస్తోంది.




## శ్రీలంక 115 పరుగులకే ఆలౌట్

### 9 వికెట్లతో చెలరేగిన పాకిస్థాన్ పేసర్లు




**ఢిల్లీ:** స్వదేశంలో శ్రీలంకతో జరుగుతున్న తొలి అనధికారిక టెస్టు మ్యాచ్‌లో పాకిస్థాన్ పేసర్లు చెలరేగిపోయారు. కషిఫ్ అలీ, ఖుర్రమ్ షెహజాద్ ఇద్దరు కలిసి 9 వికెట్లు పడగొట్టారు. ఫలితంగా తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 115 పరుగులకే ఆలౌటైంది. కషిఫ్ అలీ నాలుగో ఓవర్‌లో తొలి వికెట్ ఒషాడో ఫెర్నాండోను పడగొట్టాడు. అనంతరం ఖుర్రమ్ షెహజాద్ అహాన్ విక్రమసింఘేను పెవిలియన్‌కు పంపాడు. కొత్త బంతితో చెలరేగిపోయిన కషిఫ్ 8వ ఓవర్‌లో ఉగ్రరూపం దాల్చాడు. ఈ ఓవర్‌లో అతను 2 వికెట్లు నిపున్ ధనంజయ, పవన్ రత్నాయకేను పడగొట్టాడు. దీంతో శ్రీలంక జట్టు 14 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత బరిలోకి దిగిన సోనలన దినుష్ 110 బంతులోలన 30 పరుగులు, పసిందు సూరియబండార 84 బంతుల్లో 28 పరుగులు చేసి కొద్ది సేపు వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. వీరిద్దరి పుణ్యమా అని శ్రీలంక 100 పరుగుల మార్కును దాటింది. నిప్పులు చెరిగే బంతులతో బెంబేలెత్తించిన కషిఫ్ ఈ ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు పడగొట్టాడు. ఖుర్రమ్ షెహజాద్ 4 వికెట్లు నేలకూల్చాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్తాన్ తొలి రోజు ఆట ముగిసే సమయానకిఇ 2 వికెట్ల నష్టానికి 66 పరుగులు చేసింది. పాక్ ఆదిలోనే కెప్టెన్ మొహమ్మద్ హురైరా వికెట్ కోల్పోయింది.

ఆ తర్వాత కొద్ది సేపటికే అబ్దుల్ ఫసీ కూడా ఔటయ్యాడు. అలీ జర్యాబ్ 18 పరుగులతో, మొహమ్మద్ సులేమాన్ 11 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. శ్రీలంక తొలి ఇన్నింగ్స్ స్కోరుకు పాకిస్థాన్ ఇంకా 49 పరుగులు వెనకబడి వుంది. వాతావరణం అనుకూలించని కారణంగా తొలి రోజు కేవలం 57.1 ఓవర్ల ఆట మాత్రమే జరిగింది.

# వాణిజ్యం

## భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు


**ముంబై, నవంబరు 12:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి భారీ నష్టాల్లో ముగిసాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడితో సూచీలు భారీగా పతనమయ్యాయి. సెన్సెక్స్ 800 పాయింట్ల మేర నష్టపోగా, నిఫ్టీ మళ్లీ 24వేల దిగువకు చేరింది. నిరాశజనక త్రైమాసిక ఫలితాలు, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగుతుండడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఉదయం లాభాల్లో ట్రేడయినప్పటికీ, గరిష్టాల వద్ద ఇన్వెస్టర్లు అమ్మకాలకు దిగడంతో సూచీలు భారీగా కుంగాయి. ఈ సాయంత్రం ద్రవ్యోల్బణ గణాంకాలు వెలువడనున్న వేళ ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించారు. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బిఎస్ఇలో నమోదిత కంపెనీ మొత్తం విలువ దాదాపు రూ.6 లక్షల కోట్లు ఆవిరై రూ.436 లక్షల కోట్లకు చేరింది. ఉదయం సెన్సెక్స్ 79,644.95 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఉదయమంతా లాభాల్లో కొనసాగిన సూచి, తర్వాత నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 78,547.84 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరిన సూచి, చివరికి 820.97 పాయింట్ల నష్టంతో 78,675.18 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 257 పాయింట్లు నష్టపోయి 23,883.45 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ జీవనకాల కనిష్టమైన 84.40రూపాయలకు చేరింది. ఎన్‌టిపిసి,



హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఏసియన్ పెయింట్స్, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, టాటా మోటార్స్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసింది. సన్‌ఫార్మా, ఐసిఐసిఐ బ్యాంకు, ఇన్ఫోసిస్, టిసిఎస్, రిలయన్స్ వంటి షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ 72.29 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 2599 డాలర్ల స్థాయిలో కొనసాగింది.

## ఎగుమతులు పెంచాలని ఆపిల్ ప్లాన్


**న్యూఢిల్లీ, నవంబరు 12:** ఆపిల్ కంపెనీ దాని ముఖ్య సరఫరాదారుల సహకారంతో 2026-27 ఆర్థికసంవత్సరం నాటికి గ్లోబల్ ఐఫోన్ ఉత్పత్తి పరిమాణంలో 32 శాతం భారత్‌లో సమీకరించడానికి ప్రతిష్టాత్మకంగా పని చేస్తుంది. భారత దేశంలో అందుబాటులోఉన్న ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకం ద్వారా 2027ఆర్థిక సంవత్సరం చివరినాటికి భారతదేశంలో ఐఫోన్‌ల ఉత్పత్తి విలువను 34 బిలియన్ల డాలర్లకు మించి అందించింది. 2025 ఆర్థిక సంవత్సరంలో ఈ విలువ 18 బిలియన్ల డాలర్లకు పెరుగుతుందని నిపుణులు అంచనా వేశారు. అలాగే మార్కెట్ విలువ 27 బిలియన్ల డాలర్లకు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి అర్ధ భాగంలో మాత్రమే 9 బిలియన్ల డాలర్ల ఫ్రైట్‌ఆన్‌బోర్డ్ ఉత్పత్తి విలువను అంచనా వేశారు . ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి ప్రపంచ ఐఫోన్ ఉత్పత్తి పరిమాణంలో భారతదేశం 1718 శాతంగా ఉంది. అలాగే ఉత్పత్తి విలువ పరంగా 14 శాతం వాటాను కలిగి ఉంటుందని



పెంచే సామర్థంతో పని చేస్తామని ఆపిల్ ప్రతినిధులు చెబుతున్నారు. గ్లోబల్ ఐఫోన్ విక్రయాలు 2023-24 స్థాయిలకు అనుగుణంగా ఉంటే ప్రపంచ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తి ల్యాండ్‌స్కేప్‌లో భారతదేశ స్థానాన్ని బలోపేతం చేస్తుంది. ఆపిల్ ప్రస్తుత ఉత్పత్తి విలువ 2023-24 ఆర్థిక సంవత్సరానికి భారతదేశం ప్రపంచ ఐఫోన్ ఉత్పత్తి పరి మాణంలో సుమారు 1214 శాతం వాటాను అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఐఫోన్ సక్సెస్ మోడల్ అయిన ఐఫోన్16 సిరీస్ ఫోన్లను ఎక్కువగా భారత దేశంలో ఉత్పత్తి చేస్తున్నందున ఉత్పత్తి విలువతోపాటు అమ్మకపు విలువ ఈఆర్థిక సంవత్సరంలో అధికంగా ఉంది. ఆపిల్‌తో పాటు ఆ కంపెనీ సరఫరాదారులతో భారతదేశ ప్రభుత్వ చర్చలు ఈ ప్రతిష్టాత్మక ఉత్పత్తి లక్ష్యాలను సులభతరం చేశాయి. అలాగే ఆపిల్ ఉత్పత్తుల తయారీ పర్యావరణ వ్యవస్థకు సహాయక వాతావరణాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. పీఎల్ఐ పథకం కింద భారతదేశంలో ఐఫోన్ అసెంబ్లీని పెంచే ఈచర్యలు మేక్ ఇన్ ఇండియా చొరవకు అనువుగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. భారతదేశాన్ని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా ఉంచడానికి ఆపిల్ చర్యలు దోహదం చేస్తాయని పేర్కొంటున్నారు.

## డొమినోస్ నికర లాభం డౌన్

**న్యూఢిల్లీ, నవంబరు 12:** ఫాస్ట్ ఫుడ్ చైన్ దిగ్గజం జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు వెల్లడయ్యాయి. జులై-సెప్టెంబర్‌లో కన్సాలిడేటెడ్ నికర లాభం రూ.67 కోట్లకు పరిమితమైంది. (2023-24) ఇదే కాలంలో రూ.97కోట్లకుపైగా ఆర్జించింది. డొమినోస్ పిజ్జా, డంకిన్ స్టోర్ల కంపెనీ మొత్తం అమ్మకాలు మాత్రం రూ.1,955 కోట్లకు చేరాయి. గత రెండవ త్రైమాసికంలో రూ.1,369 కోట్ల టర్నోవర్ మొత్తం వ్యయాలు సైతం రూ.1,290 కోట్ల నుంచి రూ.1,896 కోట్లకు పెరిగాయి. అయితే ఫలితాలు పోల్చి చూడతగదని కంపెనీ గుర్తించింది. సొంత అనుబంధ సంస్థ జూబిలెంట్ ఫుడ్ నెదర్లాండ్స్ బీవీ 2024 మార్చికల్లా డీపీ యూరేషియా ఎన్‌ఫీలో మెజారిటీ వాటాను కొనుగోలు చేసినందుకు ఈ సందర్భంగా ప్రస్తావించబడింది. ఈ కాలంలో 139 స్టోర్లను కొత్తగా జత చేసుకున్నట్లు కంపెనీ దేశీయ ఆదాయం 8 శాతం పుంజుకుని రూ.1,467 కోట్లకు చేరింది. అంతర్జాతీయ అమ్మకాలు దాదాపు రూ.461 కోట్లకు చేరాయి. ఫలితాల నేపథ్యంలో జూబిలెంట్ ఫుడ్ షేరు బీఎస్ఈలో ఒక శాతం నీరసించి రూ.602 వద్ద ముగిసింది.




## సగిలిటీ ఇండియా రూ.2,107 కోట్ల సమీకరణ

**ముంబై, నవంబరు 12:** సగిలిటీ ఇండియా కంపెనీ ఐపీవో మంగళవారం మొదలైంది. సగిలిటీ కంపెనీ షేర్లు 3.53 శాతం ప్రీమియం రేటుతో ఒక్కోటి రూ.31.06 వద్ద తమ ప్రయాణాన్ని మార్కెట్లో స్టార్ట్ చేశాయి. వాస్తవానికి కంపెనీ ఐపీవో ఇష్యూ సమయంలో ఇన్వెస్టర్లకు ఒక్కో షేరును గరిష్ఠంగా రూ.30 ధరకు విక్రయించబడ్డాయి. వాస్తవానికి గ్రేమార్కెట్లో ప్రీమియం కంటే మెరుగైన ధరకు మార్కెట్లో అడుగుపెట్టడం ఆరోగ్యకరమైనదిగా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ కంపెనీ ఐపీవోలో గౌతమ్ అదానీ గ్రూప్‌కు చెందిన కంపెనీ అదానీ ప్రాపర్టీస్ కూడా ఐపీవోకి ముందే పెట్టుబడులు పెట్టింది. కంపెనీలో అదానీ రూ.20 కోట్లను పెట్టుబడిగాపెట్టారు. సగిలిటీ కంపెనీ మార్కెట్ల నుంచి ఐపీవో ద్వారా రూ.2,106.60 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. అయితే కంపెనీ ఐపీవోకి ముందుగానే తొమ్మిది మంది ఇన్వెస్టర్ల నుంచి దాదాపు రూ.366 కోట్లను సమీకరించింది. మెయిన్ కేటగిరీలో వచ్చిన ఐపీవోలో కంపెనీ 70.22 కోట్ల తాజా ఈక్విటీ షేర్లను విక్రయించింది. ఈ క్రమంలో కంపెనీ తన ఐపీవో ప్రైస్ బ్యాండ్ ధరను రూ.28 30గా నిర్ణయించింది. అలాగే కంపెనీ తన లాట్ పరిమాణాన్ని 500 షేర్లుగా ఉంచింది. దీంతో




రిటైల్ ఇన్వెస్టర్లు ఒక లాట్ కొనుగోలుకు కనీసం రూ.15 వేలు ఇన్వెస్ట్ చేయాల్సి వచ్చింది. తాజా ఐపీవోలో కంపెనీ తన ఉద్యోగులకు దాదాపు 19 లక్షల ఈక్విటీ షేర్లను రిజర్వు చేసింది. వారికి షేర్లను ఇష్యూ ధర కంటే రూ.2 తగ్గింపు రేటుకు విక్రయించింది. సగిలిటీ ఇండియా లిమిటెడ్ గతంలో బెర్క్‌మీర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌గా పిలువబడేది. చెల్లింపుదారులకు ఆరోగ్య సంరక్షణకేంద్రీకృత పరిష్కారాలు, సేవలను అందిస్తుంది.

## ఐనాక్స్ విండ్‌కు భారీ ఆర్డర్

**ముంబై, నవంబరు 12:** విండ్ ఎనర్జీ రంగంలో పరిష్కారాలను అందిస్తున్న ఐనాక్స్ విండ్ లిమిటెడ్ కంపెనీ తాజాగా కంపెనీ కాంటినమ్ గ్రీన్ ఎనర్జీ నుంచి 87 మెగావాట్ల ఆర్డర్‌ను అందుకున్నట్లు ఎక్స్ఛేంజ్ ఫైలింగ్స్ ద్వారా వెల్లడైంది. దీంతో కంపెనీ షేర్లు నష్టాల్లో నుంచి లాభాల్లోకి చేరుకోవటానికి దోహదపడ్డాయి. కంపెనీ షేర్లు ఒక్కోటి రూ.205.40 వద్ద కొనసాగాయి. దీంతో కంపెనీ మార్కెట్ క్యాప్ ప్రస్తుతం రూ.26,740 కోట్లుగా ఉంది. కాంటినమ్ నుండి రిపీట్ ఆర్డర్ పొందినట్లు కంపెనీ వెల్లడించింది. ఈ ప్రాజెక్ట్‌ను గుజరాత్, రాజస్థాన్‌లలో కంపెనీ అమలు చేయనుందని తెలుస్తోంది. తాజా ఆర్డర్ ద్వారా కాంటినమ్ నుంచి మొత్తం క్యుములేటివ్ ఆర్డర్‌లు 700 మెగావాట్లకు చేరుకోనున్నాయి. ఇదే క్రమంలో ఐనాక్స్ విండ్ మెత్తం ఆర్డర్ బుక్‌ను 3.4 బిజూ కంటే ఎక్కువకు చేరుకుంటుందని తెలుస్తోంది. తాము స్పెక్ట్రమ్‌లోని కస్టమర్ల నుండి బలమైన డిమాండ్ కలిగి ఉన్నట్లు గ్రూప్ సీఈవో కైలాష్ తారాచందానీ పేర్కొన్నారు. దెవలపర్లు ఇప్పుడు హైబ్రిడ్/రౌండ్‌ది క్లాక్/లో ఉన్నారు. ఎఫ్‌డిఆర్‌టి సొల్యూషన్ పవన సామర్థం ఎక్కువగా ఉంటుందని వెల్లడించారు. గడచిన ఏడాది కాలంలో ఐనాక్స్ స్టాక్ తన పెట్టుబడిదారులకు మల్టీబ్యాగర్ రాబడులను అందించింది. ఈ క్రమంలో ఇన్వెస్టర్లు ఏకంగా 220 శాతానికిపైగా రాబడులను అందుకున్నారు. ఇక దీర్ఘకాలిక పెట్టుబడిదారులు సైతం కంపెనీ షేర్ల నుంచి మల్టీ ఫోల్డ్ రాబడులను పొందారు. ఐదేళ్ల కాలంలో పెట్టుబడిదారులు 2381 శాతం అద్భుతమైన రాబడిని అందుకున్నారు. ప్రస్తుతం స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ.261.90గా ఉండగా, 52 వారాల కనిష్ఠ ధర రూ.60.20 వద్ద కొనసాగుతోంది.



## 90వేల డాలర్లకు బిట్‌కాయిన్

**వాషింగ్టన్, నవంబరు 12:** అమెరికా తదుపరి అధ్య క్షుడిగా డొనాల్డ్‌ట్రంప్ విజయం సాధిం చడంతో క్రిప్టోకరెన్సీ బిట్‌కాయిన్ జోరు మీదుంది. క్రిప్టోకరెన్సీలకు అనుకూలంగా ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలు ఉండొచ్చన్న అంచనాలతో దీని విలువ రికార్డు స్థాయిలో పెరుగుతోంది. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో బిట్‌కాయిన్ విలువ చరిత్రలోనే తొలిసారి ఏకంగా 90వేల డాలర్లకు చేరువైంది. ఈ భూమ్మీదనే అమెరికాను క్రిప్టో రాజధానిగా మారుస్తానంటూ కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించారు. దీంతో మార్కెట్లలో ఈ కాయిన్ ర్యాలీ కొనసాగింది. మంగళవారం ఉదయం ట్రేడింగ్‌లో దీని విలువ 89,637 డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.75 లక్షలకు పైమాటే)వద్ద జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. ఇదే ఉత్సాహం కొనసాగితే ఈ యేడాది చివరికి బిట్ కాయిన్ విలువ లక్ష డాలర్లను దాటొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ట్రంప్ అధ్యక్షుడిగా విజయంసాధించిన తర్వాత నుంచి ఈ క్రిప్టో కరెన్సీ విలువ 30శాతంపైనే పెరిగింది. త్వరలో అగ్రరాజ్యంలో వడ్డీరేట్లు మరింత తగ్గొచ్చనే సంకేతాలు కూడా తాజా ర్యాలీకి దోహదం చేస్తున్నాయి.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps